
జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 14, ఆగస్టు 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




ఈ నెల 15 నుండి ప్రారంభం కానున్న అన్నక్యాంటీన్లకు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర డెవలపర్స్ సంస్థ రూ.1 కోటి విరాళం అందించింది. గుంటూరుకు చెందిన ఎస్.ఎల్.వీ డెవలపర్స్ అధినేత పి.శ్రీనివాసరాజు సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి రూ.1 కోటి చెక్కును అందించారు. రాబోయే ఐదేళ్ల పాటు అన్నక్యాంటీన్‌కు కోటి రూపాయల చొప్పున విరాళం అందిస్తానని శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజును సీఎం చంద్రబాబు అభినందించారు.



## ఎమ్మెల్సీ పదవికి
# దువ్వాడ రాజీనామా?


- జగన్ ఆదేశం?
- ఇమేజ్ పెంచుకునే వ్యూహం
- మహిళలకు దూరం కాకూడదన్న ముందుచూపు
- పార్టీకి, ఎమ్మెల్సీకి రాజీనామా చేయాలని ఆదేశం
- ఇప్పటికే విజయసాయి ఎపిసోడ్‌తో వైసీపీకి అ'శాంతి'
- ఈలోగా 'ద్వారంపూడి కామలీల' అంటూ సోషల్‌మీడియాలో గత్తర
- దువ్వాడ ఎపిసోడ్ మధ్యలో బయటపడ్డ 'పిన్నెల్లి అన్న కొడుకు రాసలీల'
- పిన్నెల్లి అన్నకొడుకుకి మహిళల బడితపూజ
- వై'కామ' పార్టీ అంటూ సోషల్‌మీడియాలో నిందలు
- ఇమేజ్ డామేజీ కాకుండా జగన్ దిద్దుబాబు
- అందులో భాగంగానే దువ్వాడ రాజీనామాకు ఆదేశం

(మార్తి సుబ్రహ్మణ్యం)

వైకాపా కాస్తా వై'కామ'పార్టీగా మారిన నేపథ్యంలో పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్ దిద్దుబాటుకు దిగారు. భవిష్యత్తులో మళ్లీ జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న జగన్.. మహిళల నుంచి నిరసనలు-ప్రశ్నలు-విమర్శలు ఎదురుకాకుండా ఉండేందుకు.. తన పార్టీకి చెందిన రాసలీల ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో రాజీనామా చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ఆ మేరకు దువ్వాడను పార్టీ-ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయాలని జగన్ స్వయంగా ఆదేశించినట్లు తెలుస్తోంది.

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. కట్టుకున్న భార్యను వదిలేసి.. కళాకారిణి అయిన తన పార్టీ మహిళా నేత మాధురితో సహజీవనం చేస్తూ, భార్యాపిల్లలకు దొరికిపోయి అల్లరైన శ్రీకాకుళం వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను, తన ఎమ్మెల్సీ-పార్టీ పదవికి రాజీనామా చేయమని జగన్ ఆదేశించారట. సొంత భార్య వాణి- ప్రియురాలు మాధురి ఎపిసోడ్ రోడ్డున పడటంతో, పార్టీ పరువు కూడా రోడ్డున పడింది.

దానిపై జగన్ ఇప్పటిదాకా మిగతా.. 2లో



## విలువలతో కూడిన
# నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాఠశాల విద్య సిలబస్‌లో మార్పులు చేయాలి
- ప్రైవేటు స్కూళ్లతో పోటీ పడేలా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దండి
- విద్య ప్రతి ఒక్కరి హక్కు... బడి ఈడు పిల్లలు బయట ఉండడానికి వీల్లేదు
- ప్రతిభా అవార్డులు, పేరెంట్ టీచర్ మీటింగ్‌లు మళ్లీ ప్రారంభించాలి
- జన్మభూమి కార్యక్రమం కింద స్కూళ్ల అభివృద్ధికి ముందుకు వచ్చేవారిని ప్రోత్సాహం
- విద్యాశాఖపై సమీక్షలో సీఎం నారా చంద్రబాబు నాయుడు అదేశాలు

అమరావతి,మహానాడు:

విద్యాశాఖలో సమూల మార్పులు జరగాలని... ఉత్తమ ఫలితాల సాధన లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పాఠశాల విద్యపై ప్రభుత్వం రూ.32 వేల కోట్లు ఖర్చుచేస్తోందని... క్షేత్రస్థాయిలో దీనికి తగ్గ ఫలితాలు కనిపించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించాలని అధికారులను ఆదేశించారు. మారుతున్న కాలానికి అగుణంగా, భవిష్యత్ అవసరాలను దష్టిలో పెట్టుకుని సిలబస్‌లో మార్పులు చేయాలని సూచించారు. ఇందుకోసం విద్యా రంగ నిపుణులు, మేధావులు, ఆయా రంగాల ప్రముఖులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సిఎం సూచించారు. వచ్చే 10 -20 ఏళ్లకు ఏమి అవసరమూ గుర్తించి బోధిస్తే మంచి ఫలితాలు ఉంటాయని సిఎం అన్నారు. ప్రచార ఆర్భాటం కాకుండా ప్రభుత్వ స్కూళ్లలో మౌళిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టాలని సీఎం అన్నారు.

విద్య ప్రతి ఒక్కరి హక్కు...బడి ఈడు పిల్లలు బయట ఉండడానికి వీల్లేదు అన్నారు. బడిఈడు పిల్లలు బయట ఉండే పరిస్థితి ఉండటానికి వీలు లేదన్నారు. ఈ విషయంలో కఠినంగా ఉండాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రైవేటు విద్యా సంస్థలతో ప్రభుత్వ స్కూళ్లు పోటీ పడాలని. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. విద్యార్థుల 100 శాతం ఎన్రోల్మెంట్ జరగాలని, గ్రాడ్యుయేషన్ వరకు మానిటరింగ్ జరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన APAAR (Automated permanent academic account registry) ద్వారా ప్రతి విద్యార్థికి ఐడీ ఇవ్వాలని అన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో మాదిరిగా మిగతా.. 2లో

సెప్టెంబర్ మొదటి వారం నుండి
# రెవిన్యూ సదస్సులు


- ఉద్యోగుల బదిలీల కారణంగా వాయిదా
- నిజమైన అసైనీలకు న్యాయం చేసేందుకే భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేత
- రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్



అమరావతి, ఆగస్టు 13,మహానాడు:
గతంలో నిర్ణయించినట్లుగా రెవిన్యూ సదస్సులను ఈ నెల 16 నుండి కాకుండా వాయిదా వేస్తూ సెప్టెంబరు మొదటి వారంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్లు మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ నిజానికి రెవిన్యూ సదస్సులను ఈ నెల 15వ తేదీన లాంచనంగా ప్రారంభించి, 16వ తేదీ నుండి నిర్వహించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించడం మిగతా.. 2లో

## జోగి రాజీవ్‌పై ఎఫ్ఐఆర్
# నమోదు చేసిన ఏసీబీ

- ఏ1గా జోగి రాజీవ్, ఏ2గా జోగి వెంకటేశ్వరావుపేర్లు
- ఎఫ్ఐఆర్‌లో మండల సర్వేయర్ రమేష్, గ్రామ సర్వేయర్ దేదీప్య పేర్లు కూడా
- సెక్షన్ 120బీ, 420 ఐపీసీ, పీసీ యాక్ట్ 7, 12 సెక్షన్ల కింద కేసు నమోదు



ఇబ్రహీంపట్నం,మహానాడు:
అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంట్లో ఉదయం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. 15 మంది అధికారులతో కూడిన ఏసీబీ బృందం, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ నివాసానికి ఈ ఉదయం 5 గంటలకు చేరుకుని సోదాలు జరిపింది. ఈ సందర్భంగా పలు రికార్డులు మరియు డాక్యు మెంట్లు స్వాధీనం చేసుకున్నారు.

అనంతరం, ఈ కేసులో కీలకంగా మిగతా.. 2లో



03

బీసీలకు మేలు చేయని జోగి రమేష్ బీసీ కార్డు వాడుకోవడానికి సిగ్గుండాలి



04

కన్నాకు మహానాడు మీడియా అధినేత బోడేపూడి సుబ్బారావు జన్మదిన శుభాకాంక్షలు



05

ఆహారశుద్ధి, ఆక్వా రంగాల ఆధారిత ఇండస్ట్రియల్ పార్కులు



10

అదానీతో దేశానికి నష్టమైనప్పుడు.. తెలంగాణకు లాభం ఎట్లా అవుతుంది?



09

ప్రతి అడుగులోనూ బాబు మోసం..




- కలెక్షన్ సెంటర్లు కాంగ్రెస్‌కు అలవాటు
- కరప్షన్, కలెక్షన్ కాంగ్రెస్ విధానం
- ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ
- రవాణా శాఖలో ప్రతి జిల్లాకు కోటి రూపాయలు వసూలు
- బిల్డర్ల నుంచి చదరపు అడుగుకు 75 రూపాయలు వసూలు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలల్లోనే 50 వేల కోట్ల రూపాయల అప్పు
- ఆర్టీసీ బస్సులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడంలో భారీ అవినీతి
- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

## ట్రాన్స్‌పోర్టు శాఖలో
# సీఎం పీఏ దందాలు

హైదరాబాద్,మహానాడు:
పొన్నం రవాణా శాఖలో జరుగుతున్న అవినీతిపై సోనియాకు పిర్యాదులు వెళ్లాయి. సీఎం పీఏ ట్రాన్స్ పోర్టు శాఖలో దందాలు చేస్తున్నారు. దీనిపై పొన్నం విచారణకు సిద్ధమా? రైతు రుణ మాఫీకి సంబంధించి మాజీ మంత్రి హరీష్ రావుపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నాం. హరీష్ రావు పని విధానాన్ని తప్పు పట్టే నైతిక అర్హత పొన్నం ప్రభాకర్ కు లేదు. రైతుల పక్షాన హరీష్ రావు మాట్లాడితే పొన్నం సహా మంత్రులు పిచ్చి కూతలు కూస్తున్నారు.

కేవలం వార్తాపత్రికల్లో హెడ్ లైన్లలో ఉండేందుకు మంత్రులు మాట్లాడుతున్నారు. 31 వేల కోట్ల రూపాయలతో రుణ మాఫీ అన్నారు .18 వేల కోట్ల రూపాయలతో మమ మిగతా.. 2లో



## గురుకులాలను ప్రక్షాళన చేస్తాం...
# నిధులు సమకూరుస్తాం

- మంత్రులు, ఎమ్మెల్యేలు నెలకొకరోజు గురుకులాల పర్యటన
- గురుకుల భవన నిర్మాణాలకు బడ్జెట్లో రూ.5 వేల కోట్లు
- గురుకుల భవన నిర్మాణాలను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం
- పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు తక్షణమే రూ.50 లక్షలు మంజూరు
- గురుకుల విద్యార్థులకు మంచాలు, బెడ్స్ ఉండాల్సిందే, ప్రతిపాదనలు పంపితే నిధులు ఇస్తాం
- పెద్దాపూర్‌లో విద్యార్థుల మృతి ప్రభుత్వాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది
- పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కుమారులను కోల్పోయి కంటతడి పెట్టిన తల్లిదండ్రులను ఓదార్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్

6లో




# ఇస్రో ప్రస్థానం స్ఫూర్తిదాయకం

- ఇస్రో అపూర్వ ప్రయాణం వెనుక ఎందరో శాస్త్రవేత్తల శ్రమ దాగుంది
- గ్లోబల్ స్పేస్ ఎకానమీలోనూ భారత్ ముద్ర వేసింది
- అపజయంలోనూ శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ ఇచ్చిన ధైర్యం గొప్పది
- ఇస్రోకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన విధంగా సహకరిస్తుంది
- ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, యువతలో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించేలా ఇస్రోతో ఎంఓయూ చేసుకుంటాం
- శ్రీహరికోట షార్‌లో నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

శ్రీహరికోట,మహానాడు:
'సామాన్యుడు ఈ రోజు ఎంతో ఆనందంతో అనుభవిస్తున్న శాస్త్ర సాంకేతిక రంగాల ప్రతిఫలాల వెనుక... జీవితంలో సుఖాలను, సంతోషాలను, బాధలను, బంధాలను సైతం త్యాగం చేసిన ఎందరో శాస్త్రవేత్తల శ్రమ దాగుంది. అంతరిక్ష పరిశోధనలే ప్రాణంగా పని చేస్తున్న ఎందరో మహానుభావుల పరిశ్రమ మిగతా.. 12లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 14, ఆగస్టు 2024

## సెప్టెంబర్ మొదటి వారం నుండి రెవిన్యూ సదస్సులు

(మొదటిపేజీ తరువాయి..)

జరిగిందన్నారు. అయితే చిత్తశుద్ధితో ప్రజలకు మంచి పరిపాలన అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్న నేపథ్యంలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి అయిన తదుపరి ఈ రెవిన్యూ సదస్సులను నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు.

క్షేత్ర స్థాయిలో పనిచేసే పాత అధికారులతోనే ఈ సదస్సులను నిర్వహిస్తే సరైన ఫలితాలు రావని, ప్రజలకు న్యాయం జరగదని ప్రభుత్వం బావిస్తూ ఉద్యోగల బదిలీల ప్రక్రియ పూర్తి అయిన తదుపరి కొత్త అధికారులతో ఈ సదస్సులను నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఈ సదస్సుల్లో భాగంగా మొదటి 45 రోజుల పాటు భూ వివాదాలు, రీ-సర్వేలో జరిగిన తప్పిదాలకు సంబందించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించి, తదుపరి 45 రోజుల్లో అర్జీలపై తగు చర్యలు తీసుకుంటూ రెవిన్యూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ రెవిన్యూ సదస్సులను పకడ్బందీగా, పటిష్టంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారిని నోడల్ అధికారిగా నియమించడంతో పాటు ఆయా జిల్లాల్లోని మంత్రులు, అధికారులు కూడా ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో అస్సైన్డ భూముల విషయంలో ఎన్నో అవకతవకలు, మోసపూరితమైన రిజిస్ట్రేషన్లు జరిగినట్లుగా ప్రభుత్వం దృష్టికి వస్తున్నాయన్నారు. ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ ఆధారంగా మోసపూరితమైన ఆధారాలతో కొన్ని రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించడం జరిగిందన్నారు. గతంలో ఈ విధంగా జరిగిన మోసపూరిత రిజస్ట్రేషన్లపై పూర్తి స్థాయిలో అధ్యయనం, విచారణ జరిపి నిజమైన ఎస్సైనీలకు ఎటు వంటి అన్యాయం జరుగకుండా, వారికి న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ భూముల రిజిస్ట్రేషన్లను మూడు నెలలపాటు నిలుపుదల చేయడం జరిగిందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిషేదిత భూముల చట్టంలోని 22(ఎ) జాబితాను కూడా పూర్తి స్థాయిలో దుర్వినియోగం చేయడం, ఎన్నో అవకవతకలకు పాల్పడటం జరిగిందన్నారు. ఒక్కొక్క కేసును అధ్యయనం చేసి బాదితులకు న్యాయం చేసే విధంగా వాటన్నింటినీ క్రమబద్దీకరించాలనే లక్ష్యంతోనే మూడు మాసాలపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

గతంలో ఇనాం భూములు, ఎస్టేట్ భూములు, తిరుపతి లోని మఠం భూములు కూడా రకరకాలుగా కబ్జాలకు గురి అయ్యాయని, రికార్డులు కూడా తారుమారు అయ్యాయన్నారు. వీటన్నింటి పై పూర్తి స్థాయిలో అధ్యయం చేసి బాదితులకు న్యాయం జరిగేవిధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

అదే విధంగా అగ్రిగోల్డు భూముల వివాదం ఇప్పటికే కోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో ఆ భూముల రిజిస్ట్రేషన్లు ఎట్టి పరిస్థితిలోనూ జరగడానికి వీల్లేదు అన్నారు. అయితే అక్కడున్న అధికారుల తప్పిదాల వల్ల అగ్రిగోల్డు భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయని, ఈ విషయంలో న్యాయస్థానమే తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

## విలువలతో కూడిన నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి..)

ప్రభుత్వ పాఠశాల్లో కూడా పేరెంట్ టీచర్ మీటింగ్ లు పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. కర్నూలు జిల్లాలో వలస కార్మికుల పిల్లలు స్కూళ్లకు దూరం అవుతున్నారని అధికారులు చెప్పగా... వారిని రెసిడెన్షియల్ స్కూళ్లలో చేర్పించి విద్యను అందించాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద పెద్ద క్రీడా మైదానాలు ఉన్నాయని, వాటిని సద్వినయోగం చేసుకుని పిల్లలను క్రీడలవైపు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు సంబంధించి ఎడ్యుకేషన్ రిపోర్ట్స్ తో పాటు స్పోర్ట్స్ రిపోర్ట్స్ కార్డ్స్ కూడా ఇవ్వాలని అన్నారు. జీవో నెంబర్ 117పై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

ఈ విషయంలో విద్యా రంగ నిపుణులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. స్కూళ్లలో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ లో ఉన్న జీతాలు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. స్కూళ్లలో ఇంగ్లీష్ తో పాటు మాతృభాష తెలుగుకు తగు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం తెచ్చి ప్రోత్సహించింది గత తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తుచేశారు.

గత ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోయాయని... పెద్ద సంఖ్యలో డ్రాపౌట్స్ పెరిగాయని ఆందోళన వ్యక్తంచేస్తూ... డ్రాపౌట్స్ అడ్డుకట్టపై దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ కూడా ఇవ్వాలని సిఎం అన్నారు. త్వరలో జన్మభూమి 2.0 కార్యక్రమం ప్రారంభిస్తున్నామని.... ఆయా గ్రామాల్లో ఎవరైనా పాఠశాలలు అభివృద్ధి చేయడానికి ముందుకు వస్తే వారిని ప్రోత్సహించాలని అన్నారు. గతంలో జన్మభూమి కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు.

గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లిన వారు తమ పాఠశాల అభివృద్ధికి ఆసక్తి చూపుతారని... అలాంటి వారికి అవకాశం ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం అమలులో లోపాలకు తావులేదని.... పిల్లలకు పెట్టే ఆహారంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, టీచర్ల నుంచి విడివిడిగా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని అన్నారు. దీని కోసం ఐవిఆర్ఎస్ విధానాన్ని అవలంభించాలని అన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ అందించే డైట్ కాలేజీల్లో ఉన్న పెండింగ్ పోస్టులు భర్తీ చేయాలని సీఎం ఆదేశించారు. టీచర్స్‌కు కూడా నిరంతరం లీడర్ షిప్ ట్రైనింగ్ అందించాలని అన్నారు. పాఠశాలల్లో జరిగే అంతర్గత పరీక్షల నిర్వహణ నిర్దేశిత ప్రమాణాలతో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ విద్యాశాఖలో తీసుకువచ్చిన నూతన విధానాలు, సంస్కరణల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ఒక క్లాసుకు ఒక టీచర్ అనే విధానం అమలుచేస్తున్నామని తెలిపారు.

టీచర్లపై అనవసరపు ఒత్తిడి తేవడం వల్ల ఉపయోగం ఉండదని... అందుకే ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించామని వివరించారు. ఇదే సమయంలో విద్యార్థులకు బోధన, నాణ్యత, సేవల విషయంలో మాత్రం ఎక్కడా రాజీ పడడం లేదని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగం నిపుణులతో మాట్లాడి విద్యా శాఖలో నిర్ణయాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా టీచర్ పేరెంట్ మీటింగ్ లు నిర్వహించాలని సీఎం అన్నారు. ఆ మీటింగులకు తనతో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులంతా హాజరవుతారని తెలిపారు. పాఠశాలల్లో జరిగే అంతర్గత పరీక్షలపై ఏడాది చివర్లో థర్డ్ పార్టీ ద్వారా ఆడిట్ చేయాలని సూచించారు. మొత్తం విద్యా వ్యవస్థను, రోజువారీ వ్యవహారాలను మోనిటర్ చేయడానికి కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలను హెల్త్ ప్రోగ్స్ కార్డులో నమోదు చేయాలని సీఎం సూచించారు.

అంతకు ముందు అధికారులు రాష్ట్ర విద్యాశాఖలో ప్రస్తుత పరిస్థితిని ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో 44,570 ప్రభుత్వ స్కూళ్లు, 813 ఎయిడెడ్ ఉన్నాయని తెలిపారు. పది మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న స్కూళు 5,520 ఉండగా, 20 మంది కంటే తక్కువ మంది స్టూడెంట్స్ ఉన్న స్కూళ్లు 8,072 ఉన్నాయని తెలిపారు. మొత్తం రాష్ట్రంలోని స్కూళ్లలో 70,22,060 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.

అందులో ప్రభుత్వ స్కూళ్లలో 35,13,533 మంది ఉండగా, ఎయిడెడ్ లో 92,579 మంది, ప్రైవేట్ స్కూళ్లలో 34,15,948 మంది విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో 1,87,996 మంది టీచర్లు పని చేస్తుండగా, ఎయిడెడ్‌లో 3,396 మంది టీచర్లు ఉన్నారన్నారు. 2014-19 మధ్య విద్యావ్యవస్థలో ప్రధానమైన సంస్కరణలు తీసుకొచ్చామన్నారు.

మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతి ఏటా



4,026 ప్రతిభా అవార్డులు అందించామని, ఇందులో భాగంగా రూ.20 వేలు నగదు, మెడల్, ట్యాబ్ ఇచ్చామని చెప్పారు. గత ప్రభుత్వం రద్దు చేసిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఇదొక స్ఫూర్తిగా ఉంటుందని సీఎం చెప్పారు. డ్రాపౌట్స్ గల కారణాలపై లోతైన విచారణ చేసి నివారణపై ఫోకస్ పెట్టి పనిచేయాలని సూచించారు.

### నైపుణ్య గణన కార్యక్రమంపై సమీక్ష

అనంతరం స్కిల్ డెవల్మెంట్ పై సీఎం సమీక్ష చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నైపుణ్య గణనపై అధికారులు ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. వివిధ వర్గాల నైపుణ్యాలను లెక్కించి, అవసరమైన శిక్షణ ద్వారా వారికి మంచి ఉపాధి, ఉద్యోగాలు మెరుగైపర్చాలన్నది నైపుణ్య గణన లక్ష్యం. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నైపుణ్య గణన చేపట్టబోతోంది. ఇందుకు రూపొందించిన విధివిధానాలపై అధికారులు సీఎంకు వివరించారు.

రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాల్లో 3.54 కోట్ల మంది పనిచేసే వయసు ఉన్న ప్రజలు ఉన్నారు, వారి నైపుణ్యాన్ని గణన చేయాల్సి ఉందని తెలిపారు. దీని కోసం 40 వేల మంది ఎన్యుమరేటర్లు అవసరం ఉంటుందని అన్నారు. స్కిల్ గణన కోసం మొత్తం 8 నెలల సమయం పడుతుందని... దీనిలో కేవలం సర్వేకి 55 నుంచి 70 రోజులు పడుతుందని అంచనా వేసినట్లు అధికారులు వివరించారు.

బేసిక్ స్కిల్ ప్రొఫైల్, డొమైన్ స్కిల్స్, క్రాస్ ఫంక్షనల్ స్కిల్స్ పై గణన చేయాలని అన్నారు. డోర్ టు డోర్, మీ సేవ కేంద్రాలు, విద్యా సంస్థలు, మొబైల్ యాప్ వంటి 4 విధానాల ద్వారా స్కిల్ సెన్సస్ చేయవచ్చని ప్రతిపాదించారు. ఇప్పటికే ఉన్న నిపుణ అనే పోర్టల్ ద్వారా నైపుణ్య గణన కార్యక్రమాన్ని చేపట్టవచ్చని అధికారులు వివరించారు.

పారిశ్రామిక రంగ ప్రతినిధులతో కూడా సంప్రదించి నైపుణ్య గణన కార్యక్రమాన్ని చేపట్టాలని సిఎం సూచించారు. మరికొంత కసరత్తు తరువాత నైపుణ్య గణన కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం చేపట్టనుంది. ఈ రోజు సమావేశంలో ప్రాథమికంగా చర్చించారు.

## ట్రాన్స్‌పోర్టు శాఖలో సీఎం పీఏ దందాలు

(మొదటిపేజీ తరువాయి..)

అనిపించే ప్రయత్నం జరుగుతోంది. మా కాల్ సెంటర్‌కు రుణ మాఫీ పై ఇప్పటికే 75 వేల కు పైగా పిర్యాదులు వచ్చాయి. పంద్రాగస్టు న మూడో విడత రుణ మాఫీ అంటున్నారు ..ఆ విడత తర్వాత సీఎం ,మంత్రులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగని పరిస్థితి ఉంటుంది.

రైతు రుణ మాఫీ కాని రైతుల పక్షాన కేసీఆర్ నాయకత్వం లో మా పార్టీ పోరాడుతుంది. లక్ష రూపాయల రుణ మాఫీ కాని వారే ఇంకా లక్షల సంఖ్య లో ఉన్నారు. చేయని తప్పులకు రైతులను సహకార సంఘాలను ప్రభుత్వం భాద్యులను చేస్తోంది. నల్లబెల్లి మండలం లో రైతులు ,సహకార సంఘాల ను క్రిమినల్స్ లాగా చిత్రీకరిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు.

కలెక్షన్ సెంటర్లు కాంగ్రెస్‌కు అలవాటు. అన్ని దిక్కులా కలెక్షన్ సెంటర్లు పెట్టి ప్రజలను పీడిస్తున్నారు. రవాణా శాఖ లో ప్రతి జిల్లాకు కోటి రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖ లో 1832 కలెక్షన్ సెంటర్లూ పెట్టి మిల్లర్ల ను వేధిస్తున్నారు. బిల్డర్ల నుంచి చదరపు అడుగుకు 75 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ ప్రభుత్వం రైతుల విశ్వాసం కోల్పోయింది. కేసీఆర్ చేసిన మంచి పనులను ఆస్వాదిస్తూ అప్పుల నెపాన్ని నెడుతున్నారు. అప్పుల పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ హాయం లో 3 లక్షల 24 వేల కోట్ల రూపాయలు మాత్రమే అప్పు అయిందని హరీష్ రావు గణాంకాలతో సహా చెప్పారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలల్లోనే 50 వేల కోట్ల రూపాయల అప్పు చేసింది. పొన్నం పిచ్చి కూతలు బంద్ చేయాలి. మాకు సమాధానం చెప్పే దైర్యం సీఎం కు మంత్రుల దగ్గర లేదు.

మంత్రి పొన్నం ప్రభాకర్ కు వయసు పెరిగింది తప్ప బుద్ధి పెరగలేదు. మాటకు కేసీఆర్ ను కే టీ ఆర్ ,హరీష్ రావు లపై బురద జల్లడం తప్ప పొన్నం చేస్తున్నదేమి లేదు. అవినీతికి పర్యాయ పదం కాంగ్రెస్ పార్టీ. కలెక్షన్ సెంటర్ల గురించి పొన్నం మాట్లాడటమా ? రవాణా శాఖలో అవినీతి లేదని పొన్నం శ్వేత పత్రం ఇవ్వగలడా? కరప్షన్ ,కలెక్షన్ కాంగ్రెస్ విధానం.

కేసీఆర్ హాయంలో ఒక్క బస్సు కొనలేదని పొన్నం అంటున్నారు. డిసెంబర్ 7 న కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది ..ఆ వెంటనే బస్సులు ప్రారంభించారు. అంత తక్కువ వ్యవధిలో బస్సులు మీరు కొనడం ఎలా సాధ్యం? కేసీఆర్ హాయం లో బస్సులు ఎన్ని కొన్నారో సజ్జనార్ ను పొన్నం అడిగితే చెబుతారు. కేసీఆర్ హయం లో వేల బస్సులు కొన్నాం.

500 ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు సంస్థలు ఓలెక్ట ,జేబీఎం సంస్థలకు ధారాదత్తం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. కొన్ని డిపోలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు పరం చేసింది. ఆర్టీసీ కి సంబంధించి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందా ? ఆర్టీసీ లో కలెక్షన్ల దందా నడుస్తోంది. ఆర్టీసీ బస్సులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం లో భారీ గా అవినీతి జరిగింది. ..దీనిపై సీబీసీఐడీ దర్యాప్తునకు సిద్ధమా ?

లాభాల్లో ఉన్న ఆర్టీసీ ని నష్టాల్లోకి నెట్టారు. ఆర్టీసీ ని మిగులు బడ్జెట్ తో అప్పగిస్తే 2100 కోట్ల రూపాయల నష్టానికి చేర్చారు. మా మీద ఆరోపణలు చేయడం అంటే సూర్యుడి మీద ఉమ్మి వేయడమే. ఏఐసీసీ అంటే అల్ ఇండియా కరప్షన్ కమిటీ. సమావేశంలో పొన్నం ప్రభాకర్ పుచ్చి విమర్శలూ మాని తన శాఖ మీద దృష్టి పెడితే మంచిది. పల్లె రవికుమార్ ,మన్నె గోవర్ధన్ రెడ్డి ,దిలీప్ పాల్గొన్నారు.

## జోగి రాజీవ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఏసీబీ

(మొదటిపేజీ తరువాయి..)

భావిస్తున్న జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్‌ను అధికారులు అదుపులోకి తీసు కున్నారు. తాజాగా ఆయనపై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. రాజీవ్ పేరును ఏ1గా చేర్చింది.

అలాగే ఏ2గా జోగి వెంకటేశ్వరావు పేరు చేర్చింది ఏసీబీ. వీరితో పాటు ఎఫ్ఐఆర్‌లో మండల సర్వేయర్ రమేష్, గ్రామ సర్వేయర్ దేదీప్య, నున్న సబ్ రిజిస్ట్రార్ వి.నాగేశ్వరరావులను కూడా చేర్చింది. సెక్షన్ 120బీ, 420 ఐపీసీ, పీసీ యాక్ట్ 7, 12 సెక్షన్ల కింద, అలాగే ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ సెక్షన్ 4 ప్రకారం కేసు నమోదు చేశారు.

ఇదే వ్యవహారంలో ఆగస్టు 8న అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. అవ్వ వెంకట శేషునారాయణ ఫిర్యాదుతో విజయవాడ వెస్ట్ ఏసీపీ విచారించారు. విచారణ నివేదికను గతంలోనే డీజీపీకి ఎన్టీఆర్ జిల్లా సీపీ సమర్పించారు. మండల, గ్రామ సర్వేయర్లు తప్పుడు సర్వే చేశారంటూ విజయవాడ పోలీసులు నివేదిక ఇచ్చారు. దీంతో విజయవాడ పోలీసుల నివేదిక ఆధారంగా తాజాగా ఏసీబీ కేసు నమోదు చేసింది.

సర్వే జరపకుండా సర్వే రిపోర్ట్ ఇచ్చినట్లు ఏసీబీ నిర్ధారించింది. సరిహద్దుల్లో ఉన్నవారికి నోటీసులు ఇవ్వకుండా నివేదిక ఇచ్చినట్లు తేల్చింది. 87 సర్వేనెంబర్ సీఐడీ అటాచ్‌లో ఉందని ఏసీబీ గుర్తించింది. నున్న సబ్ రిజిస్ట్రార్ రికార్డులను సరిగా పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ చేశారని ఏసీబీ తెలిపింది.

## ఎమ్మెల్సీ పదవికి దువ్వాడ రాజీనామా?

(మొదటిపేజీ తరువాయి..)

స్పందించకపోవడం మిహాళలను పార్టీకి దూరం చేసే ప్రమాదం తెచ్చింది. దీనితో దిద్దుబాటుకు దిగిన జగన్.. తన పార్టీ నేత దువ్వాడకు ఫోన్ చేసి, తన పార్టీ పదవులకు రాజీనామా చేయాలని ఆదేశించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ మేరకు ఆయన రేపో, మాపో తన ఎమ్మెల్సీ-పార్టీ పదవులకు రాజీనామా చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దానితో మహిళలలో తన ఇమేజ్ కాపాడుకోవచ్చున్నది జగన్ వ్యూహంగా కనిపిస్తోంది.


త్వరలో జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నందున.. మహిళల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాకూడదన్న ముందు చూపుతోనే, జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో ట్వీట్లు, పర్యటనల ద్వారా జగన్ మళ్లీ యాక్టివ్ అవుతున్న క్రమంలో.. తనపై వ్యక్తిగతంగా-పార్టీపరంగా మహిళల నుంచి ఎలాంటి విమర్శలు ఎదురుకాకూడదన్నది జగన్ యోచనగా అర్ధమవుతోంది.

ఇప్పటికే పార్టీని 'మహిళలతో అక్రమ సంబంధాల అనైతిక వ్యవహారం' గబ్బుపట్టించింది. తొలుత ఒక మహిళకు తన ఫ్యాంటు జిప్పు తీసి చాటింగ్ చేసిన అప్పటి ఎంపీ గోరంట్ల మాధవ్ ఘనత ఢిల్లీ వరకూ పాకింది. అధికారం పోయిన తర్వాత.. తన భార్య శాంతికి పుట్టిన బిడ్డకు ఎంపి విజయసాయిరెడ్డి తండ్రి అంటూ.. ఎండోమెంట్ ఏసీ శాంతి భర్త మీడియా సమక్షంలో చేసిన రచ్చ, వైసీపీ ఇమేజీని భారీగా డామేజీ చేసింది. దానితో స్పందించిన విజయసాయిరెడ్డి, తనకు శాంతితో ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. అదే నిజమైతే విజయసాయిరెడ్డి డీఎన్ఏ పరీక్షకు సిద్ధంగా ఉండాలని, శాంతి భర్త సవాల్ చేశారు.

ఆ తర్వాత శ్రీకాకుళం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తన భార్య-జడ్పీటీసీ వాణి, కూతురును విడిచిపెట్టి, మాధురి అనే పార్టీ మహిళలతో కలసి ఉన్న వైనాన్ని ఆయన భార్య రోడ్డెక్కి మరీ వెలుగులోకి తెచ్చింది. దువ్వాడ-మాధురి కలసి ఉన్న సమయంలో ఆ ఇంటిముందు, భార్య-కూతురు ధర్నా చేయడంతో ఆగ్రహించిన దువ్వాడ, పోలీసుల సమక్షంలోనే వారిపై దాడి చేయడం రచ్చ అయింది.

దీనితో వైసీపీ సహజంగానే మహిళలకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. గత ఎన్నికల్లో పార్టీ ఓడినప్పటికీ, పార్టీకి 40 శాతం ఓట్లు రావడానికి మహిళలే కారణమన్నది జగన్ విశ్వసిస్తున్నారు. దానితో ఈ ఘటనపై జగన్ నేరుగా మీడియా ముందుకొచ్చి మాట్లాడలేని ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. ఈ ఘటనపై మహిళా సంఘాలు, కూటమి మహిళా నేతలు వైసీపీపై మూకుమ్మడి దాడి చేయడంతో, జగన్ ఆత్మరక్షణలో పడాల్సి వచ్చింది.

మరోవైపు సోషల్‌మీడియాలో వైకాపాను వై'కామ'పార్టీగా ముద్రవేస్తూ చేసిన ప్రచారంతో మహిళలు పార్టీ వైపు చూసే పరిస్థితి లేకుండా పోయింది. అంబటి రాంబాబు, అవంతి శ్రీనివాస్, విజయసాయిరెడ్డి, ద్వారంపూడి, పిన్నెల్లి అన్న కొడుకు ఫొటోలు పెట్టి 'యువర్స్ సెక్సీ రొమాంటిక్ కంపేనియన్ పార్టీ' అంటూ వైఎస్సార్‌సీపీకి సరికొత్త భాష్యం ఇచ్చిన వైనం పార్టీ ఇమేజీని భారీగా డామేజీ చేసింది. విచిత్రంగా వైసీపీలో పెద్దనోరు చేసుకుని ప్రత్యర్ధులపై విమర్శలు చేసే రోజా, అనిత, సునీత, కళ్యాణి, వాసిరెడ్డి పద్మ, చివరకు జగనన్నకు దన్నుగా ఉండి సోషల్‌మీడియాలో ప్రత్యర్ధులపై విరుచుకుపడే శ్రీరెడ్డి కూడా, దువ్వాడ ఎపిసోడ్‌పై మౌనంగా ఉండటమే విచిత్రం. అంటే




దువ్వాడ ఎపిసోడ్ పార్టీని ఎంత ఇబ్బందిపెట్టిందో అర్ధం చేసుకోవచ్చని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

త్వరలో జనంలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్న జగన్‌కు.. మహిళల నుంచి ఎలాంటి వ్యతిరేకత లేకుండా చూసేందుకే, దువ్వాడతో రాజీనామా చేయిస్తున్నారంటున్నారు.

ఒకవైపు దువ్వాడ ఎపిసోడ్ పార్టీని భ్రష్టుపట్టించిన సమయంలోనే.. మరోవైపు మాచర్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అన్న కొడుకు, స్కూల్లో చదివే బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన పార్టీని అడ్డంగా ఇరికించింది. ఆ ఘటనలో మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి, పిన్నెల్లి అన్న కొడుకును దేహశుద్ది చేసిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అయి, పార్టీని భ్రష్టు పట్టించింది.

తాజాగా కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఒక దళిత మహిళతో సహజీవనం చేసిన వైనం వెలుగులోకి రావడంతో జగన్ తలపట్టుకోవలసి వచ్చింది. ఆమెను ఇంట్లో నుంచి బయటకు రాకుండా సీసీ కెమెరాలు పెట్టి ద్వారంపూడి బంధించారని, ఆమెకు పుట్టబోయే బిడ్డకు సంబంధించి స్కానింగ్ కూడా చేయించారంటూ సోషల్‌మీడియాలో గత్తరయింది. ఇలాంటి వ్యవహారాల వల్ల మహిళలు పార్టీకి పూర్తిగా దూరం కాకుండా ఉండకుండా, తన పార్టీ నేతలకు చెక్ పెట్టేందుకే దువ్వాడతో రాజీనామా చేయిస్తున్నారన్నది వైసీపీ వర్గాల కథనం.

## ఇస్కాన్ కృషి ప్రశంసనీయం

### - దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్,మహానాడు:



ప్రజల్లో ధార్మిక చింతన, మానవతావాదాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇస్కాన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని వారి నివాసంలో ఇస్కాన్ ప్రతినిధులు మంత్రి కొండా సురేఖ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రతినిధులు భగవద్గీత పుస్తకాన్ని, కృష్ణుడు, పూరి జగన్నాథుని చిత్రపటాలను, ప్రసాదాలను మంత్రిగారికి అందించి, ఆశీర్వచనాలిచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు ఇస్కాన్ ప్రపంచవ్యాప్తంగా ఆదర్శవంతమైన కార్యక్రమాలను చేపడుతున్నదని అన్నారు. భగవద్గీత, కృష్ణ తత్వాలను ప్రచారం చేస్తూ, ప్రకృతి పట్ల ఆరాధనా భావం, సాత్విక జీవనశైలితో జీవితంలో కలిగే గొప్ప మార్పు పై అవగాహన కల్పిస్తూ మానవ సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే దిశగా ఇస్కాన్ చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి అన్నారు.

3

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 14, ఆగస్టు 2024

# పేదోడి సొంతింటి కలను సాకారం చేద్దాం..

◆ మోదీ ప్రయత్నానికి సహకరించండి

◆ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి లేఖ

తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లులేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) ఫలాలను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం గురించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి,కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి లేఖ రాశారు.

ఆ లేఖ యథాతథంగా..

గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి,

విషయం: గ్రామీణ తెలంగాణలో సొంతిల్లు లేని పేద కుటుంబాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ పథకం యొక్క ఫలాలను అందించి వారి సొంతింటి కలను సాకారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారం గురించి.

గ్రామీణ భారతదేశంలోని ప్రతి ఒక్కరి సొంతింటి కలను సాకారం చేయడానికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ పథకాన్ని 2016 లో ప్రారంభించింది. పథకం ప్రారంభ సమయంలో గ్రామీణ భారతదేశంలోని సొంతిల్లు లేని పేద కుటుంబాలకు ఆయా రాష్ట్రప్రభుత్వాల సహకారంతో మార్చి, 2024 నాటికి 2.95 కోట్ల పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

మొదటి విడత గడువు ముగిసిన ఈ పథకాన్ని కొనసాగిస్తూ రెండవ విడతలో భాగంగా ఏప్రిల్, 2024 నుండి మార్చి, 2029 మధ్య కాలంలో మరో 2 కోట్ల పక్కా ఇళ్లను సొంతిల్లు అవసరమున్న గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలకు నిర్మించి ఇవ్వాలని తద్వారా కనీసం 10 కోట్ల మందికి లబ్ధిని చేకూర్చాలని 09.08.2024 న జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

ఇందులో మొదటగా 2018లో Awaas+(2018) list] ఇళ్లు అవసరం ఉన్నవారికోసం కేంద్ర ప్రభుత్వం చేసిన సర్వేలో పాల్గొని ఆయా రాష్ట్రాల నుంచి కేంద్ర ప్రభుత్వానికి అందించిన జాబితాలో ఇంతవరకూ ఇళ్లు మంజూరు కాకుండా మిగిలిపోయిన వారికి మరియు 2011 లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, కుల గణన Socio Economic Caste Census (SECC) 2011 Permanent Wait List (PWL) జాబితాలో ఇంతవరకూ ఇళ్లు మంజూరు కాకుండా మిగిలిపోయిన వారికి తొలి ప్రాధాన్యతను ఇచ్చి ఇళ్లను మంజూరు చేయనున్నారు. పై రెండు జాబితాలు పూర్తయిన అనంతరం ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో సొంతిల్లు అవసరం ఉన్న వారికి ప్రత్యేకంగా సర్వే నిర్వహించి వారికి కూడా ఇళ్లను మంజూరు చేయనున్నారు.

పై రెండు జాబితాల ప్రకారం ఇప్పటికే దేశంలోని అనేక రాష్ట్రాలలో గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలకు సొంతింటి కల పూర్తిగా నెరవేరగా, ఇంకా ఇళ్లు మంజూరు కాకుండా మిగిలిపోయిన వారి జాబితాను అస్సాం, బీహార్, గుజరాత్, హర్యానా, జారండ్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ



బెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి అందించాయి.

గ్రామీణ తెలంగాణలో సొంతిల్లు అవసరం ఉన్న పేద కుటుంబాలు లక్షలాదిగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న గత ప్రభుత్వం, 2018 లో కేంద్ర ప్రభుత్వం ఇళ్ల కోసం నిర్వహించిన సర్వేలో భాగం కాలేదు. అందువలన రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇళ్ల కోసం ఎటువంటి జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపలేదు. తద్వారా, సొంతిల్లు అవసరం ఉన్న గ్రామీణ తెలంగాణ పేద కుటుంబాలకు ఎటువంటి సహకారం అందక సొంతిల్లు నిర్మించుకోవాలన్న వారి కల కలగానే మిగిలిపోయింది.

రాష్ట్రంలో 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేద ప్రజలకు ఆశ చూపించి మభ్యపెట్టిందే తప్ప సొంతంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదు. కేంద్ర ప్రభుత్వ సహకారం తెలంగాణ ప్రజలకు అందకుండా అన్యాయం చేసింది.

ప్రజాప్రతినిధిగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా గత కొన్ని దశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నేను చేసిన అనేక పర్యటనలలో సొంతిల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరిన వారు అనేకం ఉన్నారు. ఇదే విషయాన్ని 09.08.2024 న జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో ప్రధానమంత్రి గారు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారి దృష్టికి తీసుకురాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన ప్రతిపాదనలు వస్తే ఇళ్లను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.

కావున, ఈ విషయంలో మీరు ప్రత్యేకమైన శ్రద్ధ వహించి, కేంద్ర ప్రభుత్వం ఇళ్ల కోసం నిర్వహించనున్న సర్వేలో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వం తరపున గ్రామీణ తెలంగాణలో సొంతిల్లు అవసరం ఉన్న పేద కుటుంబాల జాబితాను వీలయినంత త్వరగా తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి అందించాలని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన – గ్రామీణ పథకం ఫలాలను ఆయా కుటుంబాలకు అందించి వారి సొంతింటి కలను సాకారం చేయడంలో సంపూర్ణ సహకారం అందిస్తారని కోరుకుంటున్నాను.



ఛత్తీస్‌గఢ్ మరియు ధామ్‌తరి గరియా బంద్ సరిహద్దులో ఉన్న శోభా పోలీస్ స్టేషన్ సమీపంలో పోలీసులు మరియు నక్సలైట్ల మధ్య భారీ ఎదురు కాల్పులు జరిగాయి. పోలీసుల మెరుపు దాడిని తట్టుకోలేని నక్సలైట్లు అటవీ మార్గం గుండా పారిపోయారు. ఘటనా స్థలం నుంచి రూ. 38 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ నోట్లు భూమి కింద పాతి పెట్టినట్లు గుర్తించారు.



## డీజీపీతో ఎమ్మెల్యే గల్లా భేటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుని మర్యాద పూర్వకంగా కలిసిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి, గళ్ళా రామచంద్ర రావు.

- విజయవాడ, మహానాడు

# బీసీలకు మేలు చేయని జోగి రమేష్ బీసీ కార్డు వాడుకోవడానికి సిగ్గుండాలి

◆ మంత్రి వాసంశెట్టి సుభాష్



మంగళగిరి, మహానాడు: అక్రమంగా అగ్రిగోల్డ్ భూములను కొట్టేసి అమ్ముకున్న మోసగాన్ని చట్టపరంగా అరెస్ట్ చేస్తే జోగి రమేష్ గగ్గోలు పెడుతున్నారని.. బీసీ కార్డు వాడుతున్నారని.. గత ఐదేళ్లు గుర్తుకు రాని బీసీలు కొడుకు అరెస్ట్ అయ్యేసరికి గుర్తుకొచ్చారని మంత్రి వాసంశెట్టి అన్నారు. బీసీలకు కాదు కదా సొంత కులస్తులైన కల్లుగీత కార్మికులకు కూడా జోగి రమేష్ చేసిన మేలు ఒక్కటి లేదన్నారు. ఈమేరకు మంగళవారం మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడారు.

అవినీతి, ఫ్యాక్షనిజం, గంజాయి గురించి ప్రశ్నిస్తారననే అసెంబ్లీకి రాకుండా వైసీపీ నేతలు మొఖం చాటేశారు. కృష్ణా జిల్లాలో మరో జూనియర్ పెద్దిరెడ్డి జోగి రమేష్ అరచకాలు నేడు బయటపడ్డాయి. జోగి కొడుకు అరెస్ట్ అయ్యారు. 2019లో అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని వైసీపీ నేతలు ఇంటింటికి తిరిగి భరోసా ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఈడి పరిధిలో ఉన్న భూములను కూడా వదలకుండా కొట్టేశారు. విజయవాడ అంబాపురంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను జోగి రాజు, జోగి వెంటేశ్వరరావులు అక్రమంగా కొట్టేసి. రికార్డులు తారుమారు చేసి సర్వే నెంబర్లు, రికార్డులను మార్చారు. మళ్లీ ఆ భూములను అక్రమంగా విక్రయాలు జరిపారు. గ్రామ సర్వేయర్ సర్వే చేయకపోయినా సర్వే చేసినట్లు తప్పుడు రికార్డులు సృష్టించి అగ్రిగోల్డ్ భూములను కొట్టేశారు.

జోగి రమేష్ కు అసలు సిగ్గుందా? గత ఐదేళ్లలో బీసీలకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏనాడైనా గళమెత్తారా? కార్పొరేషన్ లకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. కూలాలను విడకొట్టి ఎటువంటి న్యాయం చేయలేదు. సొంత కులస్తులైన గీత కార్మికులకు జోగి రమేష్ చేసిన మేలు ఏమీ లేదు. కుల వృత్తి దారులకు కూడా జోగి ఏ ఉపకారం చేయలేదు. జోగి సొంత కులస్తుడు అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెడితే ఒక్క మాట మాట్లాడ లేదు. జోగి రమేష్ నేడు తన కొడుకు కేసుల్లో ఇరుక్కోవడంతో కులం కార్డు వాడుకుంటున్నారు. జగన్ మెప్పుకోసం గతంలో చంద్రబాబు ఇంటిపై దాడి చేసి మంత్రి పదవి పొందాడు.. కులం మేలుకోసం కాదు. పేర్ని నాని, కొడాలి నానిలు లోకేష్, చంద్రబాబులను తిడతారనే వారికి మంత్రి పదవులు ఇచ్చారు జగన్. సంబరాల రాంబాబులు సరసాలు చూసే జగన్ మంత్రి పదవి ఇచ్చారు. దాడులు చేయడం, బూతులు తిట్టేవాళ్లకే జగన్ రెడ్డి మంత్రి పదవులు ఇచ్చారు.

నేడు ఈ బూతుల మంత్రులందరూ అండర్ గ్రౌండ్ కు పోయారు. పెడన ప్రజలు తరిమేస్తే.. పెనమలూరుకు వచ్చిన జోగికి అక్కడ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. జోగి లాంటి నాయకులు కులం కార్డులు వాడుకోవడం సిగ్గుచేటు. వైసీపీ నేతల్లా అక్రమ కేసులు బనాయించే ప్రభుత్వం కాదు మాది.. క్షుణంగా పరిశీలించి సర్వేలు చేసే ప్రభుత్వం చట్టపరంగా చర్యలు చేపట్టింది. రెడ్ బుక్ తెరవకుండానే వైసీపీ అవినీతిపరులు లోపలికి పోతారు. ఇప్పటికే వైసీపీ నేతలకు తిండి పోవడంలేదు. పేర్నికి మతిభ్రమించి పిచ్చివాగుడు వాగుతున్నారు. అధికార దుర్వినియోగం చేసి అగ్రిగోల్డ్ భూములను స్వాహా చేసిన జోగి బీసీ కార్డు వాడుకోవడం విరమించుకోవాలి. బీసీల గౌరవాన్ని నిలబెట్టాలి.

# నా భార్యపై నాకు పూర్తి నమ్మకం ఉంది



◆ అమెరికాలో ఉంటున్న మాధురి భర్త మహేశ్ స్పందన

◆ ఆమె రాజకీయంగా ఎదుగుతుందనే కారణంతో ఆరోపణలంటూ వ్యాఖ్య

(శివశంకర్ చలువాది)

వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి, దువ్వాడ వాణిల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. సినిమా కథలకు ఏమాత్రం తీసిపోని విధంగా ట్విస్టింగ్ ఎపిసోడ్స్ ఈ వ్యవహారంలో చోటు చేసుకున్నాయి.


ఈ క్రమంలో తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకుని తనపై ట్రోలింగ్ చేస్తున్నారనే మనస్థాపంతో... ఆగి ఉన్న కారును తన కారుతో ఢీకొట్టి ఆత్మహత్యాయత్నం చేశారు. దాంతో ఈ ప్రమాదంలో గాయపడిన ఆమె పలాసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. తాజాగా మాధురి ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.

ఈ వ్యవహారంపై అమెరికాలో ఉంటున్న మాధురి భర్త దివ్వెల మహేశ్ చంద్రబోస్ తాజాగా ఓ మీడియా ఛానెల్‌తో మాట్లాడారు. తనకు రాజకీయాలంటే ఇష్టం లేదన్నారు. కానీ, మాధురి ఇష్టపడటంతో వైసీపీలోకి వెళ్లడానికి మద్దతు ఇచ్చానని తెలిపారు. తన భార్యపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఆమె రాజకీయంగా ఎదుగుతుందనే కావాలని ఈ ఆరోపణలు చేస్తున్నారంటూ చెప్పుకొచ్చారు.

ఇక ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత మాధురి కూడా మీడియాతో మాట్లాడారు. దువ్వాడ వాణి రాజకీయ కోణంలోనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ కారణంగానే తాను ఆత్మహత్యాయత్నం చేశానని ఆమె చెప్పారు.

# వేణుస్వామిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

హైదరాబాద్,మహానాడు: సోషల్ మీడియాలో సినీ ప్రముఖులపై వ్యాఖ్యలు చేస్తూ ప్రఖ్యాతి పొందిన వేణుస్వామి ఈ మధ్య జరిగిన అక్కినేని నాగ చైతన్య, శోభిత ధూళిపాళ్ల నిశ్చితార్థం రోజున వారి జాతకాలను విశ్లేషణ చేస్తూ చేసిన వీడియో పెను దుమారం లేపింది.



వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్‌లు సోమవారం ఎంజీ రోడుల్లో బుద్ధభవన్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్ పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గతంలో సినిమా రిలీజ్‌లపై, రాజకీయ ఫలితాలపై ఇలాంటి వ్యాఖ్యలే చేసి అభాసుపాలైనా బుద్ధి రాలేదని, అసలు వ్యక్తిగత విషయాలు నలుగురిలో మాట్లాడకూడదు అనే జ్ఞానం కూడా లేని వేణుస్వామి, వాళ్లు ఎప్పుడు విడిపోతారో కూడా చెప్పేసాడని అన్నారు.

ఈ విషయంపై స్పందించిన నేరెళ్ల శారద వేణుస్వామిని పిలిలించి వివరణ అడుగుతామని, ఆయనపై, టెలికాస్ట్ చేసిన యూ ట్యాబ్ చానల్స్‌పైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

కార్యక్రమంలో తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వై.జె.రాంబాబు, కోశాధికారి సురేంద్ర కుమార్ నాయుడు, ప్రసాదం రఘు, లక్ష్మి, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షురాలు వనం ప్రేమమాలిని, కార్యదర్శి వేదుల మూర్తి, సభ్యులు సువర్ణ, తేజస్విని, భాగ్య లక్ష్మి, కుమార్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు వనజ పాల్గొన్నారు.

# ఎన్డీయే గెలుపు కోసం చేసిన మీ కృషి మరచిపోలేను

◆ నవతరంపార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యంను అభినందించిన మంత్రి లోకేష్



మంగళగిరి, మహానాడు: ఎన్డీయే కూటమి విజయం కోసం నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం మద్దతుగా నిలిచారని, మంగళగిరి నియోజకవర్గంలో తన విజయంలోనూ కీలకపాత్ర పోషించారని నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యంను మంత్రి లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తరపున నవతరం పార్టీ సూచనలు సలహాలు తీసుకొంటామన్నారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో మంగళవారం రావు సుబ్రహ్మణ్యం, ఆయన సతీమణి రావు రామతులసి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు చేపట్టిన పలు కార్యక్రమాలకు హాజరై సంఘీభావం తెలిపారని అన్నారు. మేడే రోజు సుబ్రహ్మణ్యం తల్లి చంద్రావతి చనిపోయారు. ఎన్నికల ప్రచారంలో ఉన్నందున హాజరుకాలేక పోయానని అమ్మ కు నివాళులు అర్పిస్తున్నా అని మంత్రి నారా లోకేష్ తెలిపారు. నవతరం పార్టీ నుండి అన్న రావు సుబ్రహ్మణ్యం నిర్వహిస్తున్న ప్రజావారధి కార్యక్రమం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులుడు టీడీ జనార్ధన్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. చంద్రబాబు నాయుడు సీఎం కాగానే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు పడ్డాయని, సంక్షేమ పాలన మొదలు కావడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని ప్రభుత్వానికి నవతరం పార్టీ మద్దతు కొనసాగుతుందని రావు సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. మంత్రి లోకేష్ ఇంటికి పిలిచి కుటుంబ సభ్యుడులా అన్నా, వదిన అంటూ చూపిన అభిమానం ఎంతో సంతోషం కలిగించిందని రావు రామతులసి ఈ సందర్భంగా తెలిపారు.

# విలువలకు కట్టుబడే ఇపుడు పోటీ చేయడం లేదు

◆ హెూంమంత్రి వంగలపూడి అనిత



విశాఖపట్నం, మహానాడు: విలువలకు కట్టుబడే ఇపుడు పోటీ చేయడం లేదని, వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ కూడా వేయనివ్వలేదని హెూంమంత్రి వంగలపూడి వ్యాఖ్యనించారు. మేము గెలవాలనుకుంటే మాకు ఈజీ. వైసీపీని వదిలి కూటమిలోకి చేరేందుకు అనేకమంది సిద్ధంగా ఉన్నారు. మండలి వద్దన్న వ్యక్తి ఇపుడు అభ్యర్థిని పోటీకి పెట్టారు. డ్రైవర్ ని చంపిన వాడు ఎమ్మెల్సీ. తాజాగా ఓ ఎమ్మెల్సీ సంగతి చూస్తున్నాం. తన భద్రత గురుంచి జగన్ గగ్గోలు చేస్తున్నారు. జగన్ ఓ ఎమ్మెల్యే మాత్రమే అని గుర్తుంచుకోవాలి. అయినా 58 మందితో భద్రత ఇస్తున్నాం. జగన్ భార్యకు తల్లికి 2o2 సెక్యూరిటీ ఇస్తున్నాం. సీఎంగా వున్నప్పుడు స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్ ఏర్పాటు చేసుకున్నారు. 958 మందిని పెట్టుకుని వందల కోట్లు దుర్వినియోగం చేశారు. కూటమి హయాంలో భువనమ్మకు సెక్యూరిటీ ఇవ్వలేదు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

4

డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 14, ఆగస్టు 2024



## కన్నా జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

**సత్తెనపల్లి, మహానాడు:**
సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకల్లో పాల్గొని అనంతరం రక్తదాన శిబిరాన్ని పరిశీలించి రక్తదాతలను అభినందించిన సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ యువ నాయకులు మన్నెం శివ నాగమల్లేశ్వర రావు (మల్లి బాబు), డాక్టర్ వడ్డెంపూడి పవన్ కుమార్. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుంటూరులో ఘనంగా కన్నా జన్మదిన వేడుకలు

**గుంటూరు, మహానాడు:**
సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు గుంటూరు నగరంలో మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక నగరంపాలెంలోని కన్నా లక్ష్మీనారాయణ స్వగృహం, ఎన్డీఏ కూటమి నేతలతో సందడిగా మారింది. బండి శివరామప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 70 కేజీల కేక్ ను ఎమ్మెల్యే కన్నా కట్ చేసి పార్టీ శ్రేణులతో అభిమానులతో ఆనందాన్ని పంచుకున్నారు. వారికి శాలువా కప్పి పుష్ప గుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బండి శివరామప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో పాటు అష్ట ఐశ్వర్యాలతో తులతుగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా రాజకీయంగా ఉన్నతంగా ఎదగాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో తాళ్ల వెంకటేష్ యాదవ్, ఉయ్యాల శ్యాం వరప్రసాద్, పాలేటి మాధవ, నీలం ప్రసాద్, పాలిశెట్టి రఘు,




బీజేపీ నేతలు పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, బబ్బూరి శ్రీరామ్, నోముల చలపతిరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా కన్నా జన్మదిన వేడుకలు

**సత్తెనపల్లి, మహానాడు:**
అంగరంగ వైభవంగా సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నాలక్ష్మి నారాయణ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం జరిగాయి. కన్నా జన్మదిన సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జన్మదిన సందర్భంగా అభిమానులు ఉదయం నుంచి సాయంత్రం వరకు బాణసంచా పేల్చారు. పట్టణంలో వెంకటటేశ్వర గ్రాండ్ నందు ఏర్పాటు చేసిన భారీ కేక్ ను నియోజకవర్గ నాయకులు, ప్రజల కేరింత ల మధ్య కట్ చేసి, తినిపించారు. పలు ప్రాంతాల్లో పేద మహిళలకు చీరలు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు కన్నా పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.





## కన్నాకు మహానాడు మీడియా అధినేత బోడేపూడి సుబ్బారావు జన్మదిన శుభాకాంక్షలు

**గుంటూరు, మహానాడు:**
మాజీ మంత్రి సీనియర్ నాయకులు తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన సందర్భంగా మహానాడు మీడియా అధినేత బోడేపూడి సుబ్బారావు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం సాయంత్రం నగరంపాలెంలో కన్నా నివాసంలో బోడెపూడి సుబ్బారావు మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. సీనియర్ నాయకులు కన్నా సేవలు ఎంతో అవసరం అన్నారు.

ప్రజా ప్రభుత్వంలో కన్నా లాంటి మహోన్నత వ్యక్తి ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కన్నా అనుభవం కూటమి ప్రభుత్వానికి ఎంతో అవసరమని బోడెపూడి అన్నారు.

సుబ్బారావుతో పాటు గోరంట్ల సాంబశివరావు, వజ్జా వీరాంజనేయులు, తదితరులు కన్నాకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు





## ఉపాధి హామీ పథకంలో రూ.2.17 కోట్లు అవినీతి

- **2023-24 ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక**

**ముండ్లమూరు, ఆగస్టు 13,మహానాడు:**
స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద జరిగిన 2023-24 పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మంగళ వారం జరిగింది. గత వారం రోజులుగా మండలంలోని పంచాయతీల్లో 2023-24 సంవత్సరంలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై ఆడిట్ నిర్వహించారు. ఆ ఆడిట్ పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో రూ 2,17,33,401.00 లు అక్రమాలు జరిగినట్లు డ్వామా పిడి అర్జున్ రావు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీలో భారీగా జరిగిన ఉపాధి హామీ పథకంలో అక్రమాలు ముండ్లమూరు పంచాయతీలో రూ 48.56 లక్షలు, పసుపుగల్లు రూ 28.97 లక్షలు, పూరిమెట్ల రూ. 13.34 లక్షలు, నాయుడుపాలెం రూ. 10.80 లక్షలు, కెళ్లంపల్లి రూ. 15.00 లక్షలు, నూజిల్లపల్లి రూ. 9.00 లక్షలు, పోలవరం రూ. 2.87 లక్షలు, సింగన్నపాలెం రూ. 8.76 లక్షలు, జమ్ములమడక రూ. 4.32 లక్షలు, శంకరాపురం రూ.9.23 లక్షలు, ఈదర రూ. 11.12 లక్షలు, పులిపాడు రూ. 14.17 లక్షలు, ఉమామహేశ్వరం రూ. 5.83 లక్షలు, పెద్ద ఉల్లగల్లు రూ 75,686.00 లు,



తూర్పు కంభంపాడు రూ. 1.32 లక్షలు, మారెళ్ళ రూ. 16.35 లక్షలు, వేముల రూ. 22.97 లక్షలు, భీమవరం రూ. 65,023.00 లు, బొపూడివారిపాలెం రూ. 5.00 లక్షలు, వేముల బండ రూ.1002.00 లు అవినీతి జరిగినట్లు పిడి అర్జున్ రావు ప్రతిపాదనలు పంపారు. అక్రమాలకు పాల్పడిన ఏపీవో, ఈసీ, టీ సి, ఫీల్డ్ అసిస్టెంట్లుపై కఠిన చర్యలు తీసుకొని వారి నుండి సొమ్మును రికవరీ చేయటం జరుగుతుందని పిడి అర్జున్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడిఓ ఝాన్సీ రాణి, ఏపీడీలు వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఆర్ జనార్ధన్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎస్ఆర్పి వై వెంకటేశ్వర రావు, ఏపీవోలు కొండయ్య, మురళి, నాగరాజు, ఈసీ ప్రసాదు, టిసి రూతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## డ్రగ్ పెడ్లర్ మస్తాన్ సాయికి 14 రోజుల రిమాండ్

**గుంటూరు,మహానాడు:**
విజయవాడలో కలకలం రేపిన ఎండీఎంఏ డ్రగ్స్ కేసులో కీలక నిందితుడ్ని సెబ్ పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. రెండు నెలలు పరారీలో ఉన్న సాయిని గుంటూరులో అరెస్ట్ చేసి నగరానికి తరలించారు. సాయి హిమాచల్ ప్రదేశ్లో చదువుకునే టప్పుడు డ్రగ్స్కు అలవాటయ్యాడు. దిల్లీలో తక్కువ ధరకు దొరుకుతుందని ఓ వ్యక్తి చెప్పాడు. దీంతో గోపీచంద్ అనే వ్యక్తిని దిల్లీ పంపారు.



గుంటూరు నగరానికి చెందిన యనమల గోపీచంద్ దిల్లీ వెళ్లి 35 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి ఈ ఏడాది జూన్ 3న విజయవాడలో రైలు దిగి బయటకు వస్తుండగా ముందస్తు సమాచారం ఆధారంగా సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతని కోసం రైల్వే స్టేషన్ బయట కారులో ఎదురుచూస్తున్న గుంటూరు నగరానికి చెందిన ఎడ్ల కాంతికిరణ్, షేక్ ఖాజా మొహిద్దీన్, షేక్ నాగూర్ షరీఫ్ను కూడా అదుపులోకి తీసుకున్నారు.

అప్పట్లో ఈ ముగ్గురిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టడంతో రిమాండ్ విధించారు. ప్రస్తుతం వీరు నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్నారు. నిందితుల్లో ఖాజా మొహిద్దీన్, నాగూర్ షరీఫ్ గుంటూరులోని ప్రముఖ బిర్యానీ హోటల్ నిర్వాహకులు. నిందితులను సెబ్ పోలీసులు విచారించగా వీరి స్నేహితుడైన రావి సాయి మస్తాన్రావు ఇచ్చిన చిరునామా ఆధారంగా గోపీచంద్ దిల్లీ వెళ్లి తెచ్చినట్లు చెప్పాడు. దీంతో విజయవాడ వెస్ట్ సెబ్ పోలీసులు ఏ5గా సాయి పేరును చేర్చారు.

సాయి మస్తాన్రావు కోసం సెబ్ పోలీసులు గాలిస్తుండటంతో వారికి చిక్కకుండా హైదరాబాద్, గుంటూరుల్లో మకాం మార్చాడు. ఎట్టకేలకు గుంటురు జీటీ రోడ్డులోని మస్తాన్ దర్గా వద్ద ఉన్నాడని తెలుసుకుని విజయవాడ వెస్ట్ సెబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్రెడ్డి తన బృందంతో వెళ్లి అరెస్టు చేశారు. విజయవాడలోని ఆరో ఎంఎం కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు.

సాయి బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్లో సాఫ్ట్వేర్ ఇంజినీర్గా పనిచేస్తున్నాడు. సాయి తండ్రి రామ్మోహన్రావు మస్తాన్ దర్గా ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ఏటా జరిగే ఉరుసు వేడుకలకు రాజకీయ పార్టీల నాయకులతో పాటు పోలీసు అధికారులను సాయి తండ్రి ఆహ్వానించేవారు.

సాయి ఇంజినీరింగ్ చదివే సమయంలోనే డ్రగ్స్కు అలవాటుపడినట్లు సమాచారం. అప్పటి నుంచే డ్రగ్స్ సరఫరాదారులతో సంబంధాలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గుంటూరు-హైదరాబాద్ మధ్య తిరుగుతూ సినీ పరిశ్రమకు చెందిన వారితో పరిచయాల పెంచుకున్నాడు. నిందితుడిని సెబ్ ఉన్నతాధికారులు సుదీర్ఘంగా విచారించారు. డ్రగ్స్ సరఫరాదారులతో ఉన్న సంబంధాలు? తిరిగి ఎవరెవరికి అందించేవాడు? అన్న విషయాలను రాబట్టినట్లు సమాచారం. వివరాలను సెబ్ పోలీసులు వెల్లడించడం లేదు.

### గోవాలోని నైజీరియన్లతో లింకులు

లావణ్యను హోటల్ గదిలో పెట్టి వేధించటంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు నగరంపాలెం స్టేషన్లో గతంలో కేసు నమోదైంది. యువతులను ఈవ్టీజింగ్ చేసిన సంఘటనపై గుంటూరు పట్టాభిపురం స్టేషన్లో మరో కేసు నమోదైంది. గత ఏడాది సెప్టెంబరు 13న రాజేంద్రనగర్ ఎస్వోటీ, మోకిల పోలీసులు సంయుక్త ఆపరేషన్లో డ్రగ్స్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో వరలక్ష్మి టిఫిన్ సెంటర్ యజమాని ప్రభాకర్రెడ్డి, అనూరాధ, మరో వ్యక్తిని అరెస్టు చేశారు.

ఈ కేసులోనే ఏ4గా సాయి మస్తాన్రావు ఉన్నాడు. అప్పట్లో కేవలం డ్రగ్స్ వినియోగదారుడు అని నోటీసులు ఇచ్చి వదిలేశారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సమయంలోనే అనురాధకు గోవాలోని నైజీరియన్లతో లింకులు ఉన్నాయని, వారి సాయంతోనే హైదరాబాద్కు డ్రగ్స్ తెస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమె అరెస్టు కావడంతో సాయి మస్తాన్.. ఆమె పరిచయస్థుల ద్వారా డ్రగ్స్ తెప్పించుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. తర్వాత.. వాటిని వినియోగించడంతో పాటు ఇతరులకూ అమ్ముతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.



సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసిన ప్రముఖ హీరోయిన్ రెజీనా. తాము తలపెట్టిన రూరల్ విమెన్ లీడర్ షిప్ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మంత్రి సీతక్కని ఆహ్వానించిన రెజీనా

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ బుధవారం 14, ఆగస్టు 2024

# గురుకుల విద్యార్థినికి అండగా సీఎం రేవంత్ రెడ్డి

- ప్రభుత్వ ఖర్చుతో నిమ్స్‌లో వైద్యం
- కోలుకుంటున్న విద్యార్థిని కార్తీక

హైదరాబాద్,మహానాడు:
గురుకుల పాఠశాల భవనంపై నుంచి కిందపడి తీవ్రగాయాల పాలైన విద్యార్థిని కొయ్యడ కార్తీకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. ప్రభుత్వ ఖర్చుతో వైద్యం అందించాలని ఆయన సీఎం కార్యాలయ అధికారులను ఆదేశించారు.

సీఎం సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో కార్తీకకు వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం కార్తీక కోలు కుంటోంది. ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కార్తీక ఈ నెల 9న ప్రమాదవశాత్తు స్కూల్ మూడో అంతస్తు నుంచి పడిపోయింది. దీంతో విద్యార్థిని నడుము భాగంలో తీవ్రగాయా లయ్యాయి.

గురుకుల అధికారులు కార్తీకను వరంగల్ ఎంజీఎం ఆస్ప త్రికి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. నిమ్స్ న్యూరో సర్జన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమల్ బృందం మంగళవారం నాడు కార్తీకకు ఆపరేషన్ నిర్వహించింది.. ప్రస్తుతం ఐసీయులో



విద్యార్థిని కోలుకుంటున్నట్లు డాక్టర్లు తెలిపారు.

కార్తీకకు కావాల్సిన వైద్యం ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరించనున్నది. ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ వేముల శ్రీనివాస్‌లు నిమ్స్ డైరెక్టర్ బీరప్పతో మాట్లాడి కార్తీక కోలు కునేంత వరకు వైద్యం అందించాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా కార్తీక ఆరోగ్య పరిస్థితిపైన ఎప్పటికప్పుడు నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్నారు.

## అదానీతో దేశానికి నష్టమైనప్పుడు..
# తెలంగాణకు లాభం ఎట్లా అవుతుంది?

- అదానీపై ఢిల్లీ కాంగ్రెస్‌ది ఒకమాట. గల్లీ కాంగ్రెస్‌ది మరో మాటనా?
- అదానీ-సెబీ ఆరోపణల వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరి
- ఢిల్లీలో పోరాటం అంటూ తెలంగాణలో రెడ్‌కార్పెట్ పరుస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం
- రాష్ట్రాన్ని అదానికి అప్పచెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆపగలిగే శక్తి రాహుల్ గాంధీకి ఉన్నదా అని సూటి ప్రశ్న
- అదానీపై పోరాటంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేనేలేదని స్పష్టీకరణ
- రాహుల్‌ను నిలదీసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,మహానాడు:
హిండెన్ బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ-సెబీ ఆరోపణలపై దేశవ్యాప్త ఆందోళనకు పిలుపులిచ్చిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం అదే అదానీ కంపెనీకి స్వాగతం పలకడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం కాదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. అదానీపై జాతీయ కాంగ్రెస్‌కు ఒక నీతి..? రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు మరో నీతా ?? అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు.

"ఒక వైపు మీరేమో... అదానీ-సెబీ ఆరోపణలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నారు కానీ ఇక్కడ మీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఏమో.. అదానీకి స్వయంగా రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. అదానీ కంపెనీకి ద్వారాలు తెరుస్తున్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఏకంగా అదానీకే అప్పగిస్తున్నారు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

మీరు ఆదానీ-సెబీ ఆరోపణలపై దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిస్తే.. అదానీ-కాంగ్రెస్ మిలాఖత్ పైనా, లోపాయికారి ఒప్పందాలపైనే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ప్రశ్నిస్తున్నారని



కేటీఆర్ స్పష్టంచేశారు. అదానీ వల్ల దేశానికి నష్టం అన్నప్పుడు.. మరి తెలంగాణ రాష్ట్రానికి మాత్రం లాభమెలా అవుతుందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

తెలంగాణలో.. అదానీ కంపెనీల ఆగమనాన్ని రాహుల్ గాంధీకి ఆపగలరా.. కాంగ్రెస్ సీఎం నిర్వాకాన్ని నిలదీసే ధైర్యం చేయగలరా.. అదానీ పెట్టుబడులకు ఫుల్ స్టాప్ పెట్టగలరా..? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొట్టికాయలు వేయగలరా..?? అంత శక్తి రాహుల్ గాంధీకి ఉన్నదా అని కేటీఆర్ ప్రశ్నించారు.

అదానీపై ఢిల్లీ కాంగ్రెస్ ది ఒకమాట. గల్లీ కాంగ్రెస్ ది మరో మాటనా? అన్న కేటీఆర్ అదానీపై కాంగ్రెస్ చేస్తున్నట్టు చెబుతున్న పోరాటంలో... చిత్తశుద్ధి ఏమాత్రం కనిపించడం లేదన్నారు. ఒక జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ లో...ఈ ద్వంద్వ వైఖరి.. కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం కాదా అని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ రెండు నాల్కల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందనీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందాల్ని కూడా నిశితంగా పరిశీలిస్తోందని గుర్తుచేశారు. కాంగ్రెస్ కు అధికారమిచ్చిన పాపానికి.. తెలంగాణను అదానీకి అప్పగిం చాలని చూస్తే సహించమని, రాష్ట్ర భవిష్యత్తును అంధకారం చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టంచేశారు. తెలంగాణ హక్కుల కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టే పార్టీ బీఆర్ఎస్ అనే విషయాన్ని ఎప్పటికీ గుర్తు పెట్ట కోవాలన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులపై గత ప్రభుత్వ పదేళ్ల నిర్లక్ష్యం

- మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్,మహానాడు:
రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. వెనుకబడిన ప్రాంతమైన ఉమ్మడి పాలమూర్ జిల్లాలోని ప్రాజెక్టలను పూర్తి చేయడానికి అవసరమైన నిధులను పదేళ్ల కాలంలో కేటాయించలేదని తెలిపారు.



పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కల్లబొల్లి మాటలు చెబుతూ కాలం వెల్లదీశారని దుయ్యబట్టారు. వారు చేసిన పాపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపైకి నెట్టె ప్రయత్నం చేస్తున్నారని, పాలమూరు బీఆర్ఎస్ నాయకులు బురద జల్లుతూ అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్ట్ పనులు 20 శాతం పూర్తి కాకుండానే ఎన్నికల సమయంలో హడావుడిగా ప్రారంభించారని దుయ్య బట్టారు. మేజర్ కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీ కాలువలు తవ్వకుండానే ... ప్రాజెక్ట్ ను ప్రారంభించారని, ఇప్పుడు నీళ్ళు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. మీరు పదేళ్లలో చేయలేని వాటిని మమ్మల్ని 7 నెలల్లో చేయమని అడగటం సిగ్గుచేటన్నారు. నీళ్లు ఎత్తివేయలేదు కానీ, ప్రజా ధనాన్ని మాత్రం ఎత్తుకుపోయారని ద్వజమెత్తారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

# తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులు రిలీవ్

- ఏపీ ప్రభుత్వ ఉత్తర్వు

అమరావతి,మహానాడు:
తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విభజన సమయంలో కేటాయించిన 122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను స్వరాష్ట్రానికి పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

తెలంగాణ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన ఏపీ ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రిలీవ్ అయ్యే వారు తమ కేడర్ చివరి ర్యాంక్‌లోనే విధుల్లో చేరతారని వెల్లడించింది.



# ఆహారశుద్ధి, ఆక్వా రంగాల ఆధారిత ఇండస్ట్రియల్ పార్కులు

- ఒక్కోపార్క్ 100 ఎకరాల విస్తీర్ణంలో 100 పార్కులు ఏర్పాటు లక్ష్యం
- విజయవాడ మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కులో పూర్తి స్థాయి కార్యకలాపాలు జరగాలి
- ఉపాధి అవకాశాలు, సంపద సృష్టి కేంద్రాలుగా పోర్టుల నిర్మాణం
- పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి,మహానాడు:
రాష్ట్రంలో ఆహారశుద్ధి, ఆక్వా, ఉద్యానవన రంగాలతో పాటు ఖనిజాధారిత పారిశ్రామికాభివృద్ధి పార్కులు ఏర్పాటుకు అనుకూల పరిస్థితులున్నందుకు వాటి ఏర్పాటుకు తగిన కార్యాచరణను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న పారిశ్రామికాభివృద్ధి పార్కుల్లో ఎన్ని అభివృద్ధి చేశారు, ఇంకా అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్న వాటిపై పరిశీలన చేయాలని చెప్పారు.

రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలను దృష్టిలో ఉంచు కుని ఏరియా ఆధారిత ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఓడరేవులు, ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధికి సంబంధించి పరిశ్రమల శాఖ, ఎంఎస్ఎంఇ శాఖలపై సచివాలయంలో సీఎం మంగళవారం సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నపారిశ్రామికాభివృద్ధి పార్కులు, కొత్తగా ఏర్పాటు కానున్న ఓడరేవులపై సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సియంకు వివరించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఆహారశుద్ధి, ఆక్వా, ఉద్యానవన రంగాలతో పాటు ఖనిజాధారిత ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసేందుకు ఎక్కువ అవకాశాలను ఉన్నా యన్నారు. కావున వాటిని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రాష్ట్రంలో ఒక్కొక్క ఇండస్ట్రియల్ పార్క్ కనీసం 100 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 100 పార్కులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహారాష్ట్ర అత్యధిక ఇండస్ట్రియల్ పార్కులను కలిగి దేశంలో అగ్రస్థానంలో ఉందని, మన రాష్ట్రంలో ప్రస్తుతం 53 ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయని రానున్న రోజుల్లో మరిన్ని పార్కులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన విజయవాడ మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కును పునరుద్ధరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందో అక్కడ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలను పోత్సహించాలన్నారు.

రాష్ట్రంలో పీపీపీ విధానంలో ఇంటిగ్రేటెడ్ ఓడరేవుల అభి వృద్ధికి తగిన మాస్టర్ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశిం చారు. దేశంలో ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించ బడుతున్న ఉత్తమ పోర్టులపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. దేశంలో రెండవ అతిపెద్ద సముద్రతీర ప్రాంతాన్నికలిగి ఉన్నందున ప్రస్తుతం ఉన్న పోర్టులతో పాటు మరిన్ని పోర్టులు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

లాజిస్టిక్ పరమైన రోడ్లు, రైల్ కనెక్టివిటీతో పాటు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంత హింటర్ ల్యాండ్ అనుసంధానంతో కూడిన ఇంటిగ్రేటెడ్ ఓడరేవుల నిర్మాణం జరిగినప్పుడే ఎగుమతి ఖర్చులు తగ్గి ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయని చెప్పారు. ఆదిశగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇంటిగ్రేటెడ్ పోర్టుల ఏర్పాటుకై మాస్టర్ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి డా.ఎన్. యువరాజ్, సీయం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కమీషనర్ సిహెచ్.శ్రీధర్, ఎపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపల్లిలో ఒక్కొక్కటిగా వెలుగులోకి
# తోడేరు రెడ్డి నిర్వాకాలు

- ఇరిగేషన్ పనులు చేయకుండానే రూ.200 కోట్లు స్వాహా చేసిన కాకాణి అండ్ బ్యాచ్
- ఒకే పనిని ఎఫ్.డీ.ఆర్, జనరల్ ఫండ్. ఎన్ఆర్ఈజీఎస్, ఓ & ఎం కింద చేసినట్టు చూపి నిధుల స్వాహా
- ఒక్క షట్టర్లు(చెక్కలు) మార్పిడి పేరుతోనే రూ.8 కోట్ల దోపిడీ
- ఒక్క రూపాయి జీఎస్టీ కట్టకుండానే షట్టర్ల కోసం 300 టన్నుల ఇనుము కొనుగోలు చేశారంట..ఇనుము కొనిందీ లేదు..షట్టర్లు బిగించిందీ లేదు
- రైతులు సొంతంగా చేసుకున్న పనులను కూడా తాము చేసినట్లు బిల్లులు
- వెంకటాచలం మండలంలో కాకాణి అవినీతి బాగోతాన్ని ఆధారాలతో సహా మీడియా ముందు పెట్టిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి
- ఇప్పటికే ఈ అక్రమాలపై సీఎం చంద్రబాబు నాయుడికి ఫిర్యాదు చేసి విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి
- ఇడిమేపల్లి, ఈదగాలి పరిధిలో ఇరిగేషన్ కాలువలు, చెరువులను పరిశీలించిన శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
- పనులు చేసినట్టు బిల్లులు చేసుకున్న జాబితాను సోమిరెడ్డి చదువుతుంటే విని విస్తుపోయిన రైతులు
- రాజకీయాలకు అతీతంగా అందరినీ పిలుస్తాం... కాకాణి చేసినట్టు చెబుతున్న పనులను చూపించాలని సోమిరెడ్డి సవాల్

సర్వేపల్లి,మహానాడు:
వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్ శాఖ అవినీతికి అడ్డాగా మార్చి నిర్వీర్యం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో చేయని పనులను చేసినట్టు చూపి వందల కోట్లు స్వాహా చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. జంగాలపల్లి వద్ద చింత గుంట ట్యాంకు సప్లయి చానల్ పనులను రైతులు చందాలు వేసుకుని రూ.3.50 లక్షలతో చేసుకున్నారు.

అదే పనిని రూ.4.80 లక్షలతో లోటస్ కన్ స్ట్రక్షన్ కంపెనీ చేసినట్టు డబ్బులు డ్రా చేసుకున్నారు. ఇడిమేపల్లి చెరువులోని చేపల ద్వారా వచ్చిన ఆదాయంతో రైతులే కట్టమీద తుమ్మ చెట్లు కొట్టించుకున్నారు.కానీ చెరువు కట్ట మీద రూ.24 లక్షలతో రోడ్డు వేయించినట్టు బిల్లులు పెట్టుకున్నారు. మొన్న డిసెంబరులో తట్టడు మట్టి ఎత్తకుండానే రూ.18.70 కోట్లకు బిల్లులు పెట్టించుకున్నారు.





కాలువల్లో నిండా నీళ్లు పారే సమయంలో పనులు చేసినట్టు చూపడం దోపిడీకి పరాకాష్ట. రూ.9.78 లక్షలతో దోసాని గుంట దొరువు పనులు చేసినట్టు చూపారు. ఇప్పుడు చూస్తే ఆ కర్రతమ్మ ఎన్ని ఏళ్ల నుంచి ఉన్నాయో స్పష్టంగా కనిపిస్తోంది.

ఈదగాలిలో కాలువకు షట్టర్లు బిగించకుండానే బిగించి నట్టు బిల్లులు చేసేసుకున్నారు.ఇలా చెప్పుకుంటే పోతే వంద లాది పనులు చేయకుండానే చేసినట్టు బిల్లులు... రూ.200 కోట్లకు పైగా కుంభకోణం.ఒకే పనిని ఎఫ్.డీ.ఆర్, జనరల్



ఫండ్. ఎన్ఆర్ఈజీఎస్, ఓ అండ్ ఎం చేసినట్టు చూపి బిల్లులు చేసుకోవడం ఇప్పుడే చూస్తున్నాం.

కాలువలు, చెరువులకు కొత్త షట్టర్లు బిగించకుండానే శ్రీధర్ ఇంజనీరింగ్ కంపెనీ పేరుతో రూ.8 కోట్లు దోచుకున్న కాకాణి.కొత్త షట్టర్ల కోసం ఒక్క కిలో ఇనుము కొనుగోలు చేయకుండానే 300 టన్నులు కొన్నట్లు చూపారు.ఒక్క రూపాయి జీఎస్టీ కట్టలేదు.

నిబంధనల ప్రకారం కొత్త షట్టర్లు బిగిస్తే వచ్చే పాత ఇనుము వేలం వేయలేదు..7 ఆఫ్ అకౌంట్ లోనూ ఎలాంటి వివరాలు లేవు. కానీ మొత్తంగా దోపిడీ మాత్రం జరిగిపోయింది. ఆశ అనేది ఉంటుంది కానీ..అసలు పనులే చేయకుండా బిల్లులు చేసుకోవడం చరిత్రలో ఇప్పుడే చూస్తున్నాం.అన్నదాతలకు ద్రోహం చేసిన వారు మూల్యం చెల్లించుకోకతప్పదు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 14, ఆగస్టు 2024




## రాష్ట్రాభివృద్ధి చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖిస్తాం

- అభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోంది
- పర్యాటకం, రైల్వే, మైనింగ్ రంగాల్లో రాష్ట్రానికి కేంద్ర సహకారం కోరాం
- ఢిల్లీలో నిర్వహించిన మైనింగ్ అధికారుల సమావేశంలో సానుకూలంగా జరిగింది
- రాష్ట్రాభివృద్ధికి ఉండే ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటాం
- రాష్ట్రాభివృద్ధికి ఢిల్లీ పర్యటన కీలకం కానుందని తెలిపిన మంత్రి కొల్లు రవీంద్ర

న్యూఢిల్లీ,మహానాడు:

రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించుకోవడానికి ఉండే ప్రతి అవకాశాన్ని కూడా ఉపయోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు & ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఢిల్లీలో కేంద్ర గనులు, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. అనంతరం కేంద్ర అధికారుల్ని కలిసి రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను అందించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో అపారమైన సంపద ఉంది. దాదాపు 972 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. రాష్ట్రంలో ఉన్న వనరుల్ని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సృష్టించే అవకాశం ఉన్నప్పటికీ, జగన్ రెడ్డి వినియోగించుకోలేదు. పైగా దోపిడీ కోసం రాష్ట్రంలోని వనరుల్ని వాడుకున్నాడు.

అందుకే కేంద్ర ప్రభుత్వం నేషనల్ మైన్స్ ఇన్వెస్టిగేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేసిందన్నారు. 2019-24 మధ్య కాలంలో జగన్ రెడ్డి చేసిన అరాచకాలు, దోపిడీ కారణంగా రాష్ట్రాభివృద్ధి తిరోగమనంలో నడిచింది. ఒక్క ఇసుకలోనే దాదాపు లక్షల కోట్లు దిగమింగారు. బీచ్ శాండ్‌లో అద్భుతమైన మినరల్స్ ఉన్నాయి. వాటిని దేశం కోసం, రాష్ట్రం కోసం వినియోగించుకునే అవకాశం ఉంది. వ్యవస్థల్ని ప్రక్షాళన చేసేలా చర్యలకు శ్రీకారం చుడుతున్నాం.

### రాష్ట్రాభివృద్ధిని సువర్ణాక్షరాలతో లిఖిస్తాం

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. జగన్ రెడ్డి సృష్టించిన విధ్వంసం నుండి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాం. పోలవరం, అమరావతి నిర్మాణానికి కేంద్రం సహకారం తెలిపింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకు వస్తున్నాయి. ఇకపై రాష్ట్రంలో అన్నీ శుభ సూచకాలేనని, రాష్ట్రాభివృద్ధిని సువర్ణాక్షరాలతో చరిత్ర రాయబోతున్నామన్నారు.

### పర్యాటకాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను కేంద్ర టూరిజం సెక్రటరీకి వివరించాం. మచిలీపట్నం నియోజకవర్గంలో మంగినపూడి బీచ్, బ్యాక్ వాటర్స్ పర్యాటకాభివృద్ధికి ఎంతో తోడ్పడతాయి. రాష్ట్ర వ్యాప్తంగా బీచ్ రిసార్ట్స్ నిర్మాణానికి మెరుగైన అవకాశాలున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయి నివేదికతో త్వరలో వచ్చి కలుస్తాం.

విజయవాడకు రైల్వే కనెక్టివిటీ ఉంది. మచిలీపట్నం - రేపల్లె లైన్ వేయగలిగితే మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని రైల్వే శాఖ అధికారుల్ని కోరామన్నారు. కలకత్తా - చెన్నై రోడ్డును మచిలీపట్నం మీదుగా బీచ్ కారిడార్ ఏర్పాటు చేయగలిగితే రవాణా వ్యవస్థ పటిష్టమవుతుంది.

అదే సమయంలో రైలు, రోడ్డు మార్గం పూర్తైతే అవనిగడ్డ, రేపల్లె, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాలు అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. బందరు పోర్టు పూర్తైతే కనెక్టివిటీ కూడా పెరుగుతుంది. మచిలీపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు కాబోతోందని తద్వారా ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు.

## అర్ధరాత్రి ఎస్ఐ, హోంగార్డ్‌పై మహిళల దాడి

హైదరాబాద్,మహానాడు:

వారాంతం వచ్చిందంటే పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టడం సర్వసాధారణం. ఈ డ్రంక్ డ్రైవ్‌లో రకరకాల వ్యక్తులు పోలీసులకు తారస పడుతూ ఉంటారు. కొందరు కామ్‌గా పోలీసులు చెప్పినట్టుగా చేసేసి వెళ్లిపోతున్నారు. పట్టుబడితే ఫైన్ కట్టేస్తున్నారు. కొందరు మాత్రం నానా రచ్చ చేస్తున్నారు.

మద్యం మత్తో లేదంటే డబ్బుందనే అహంకారమో కానీ పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. కొందరైతే ఏకంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పాల్గొన్న పోలీసుల పైనే దాడికి పాల్పడుతున్నారు. ఇలా దాడికి పాల్పడుతున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉండటం గమనార్హం. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు ఇటీవలి కాలంలో సర్వసాధారణంగా మారిపోయాయి. తాజాగా ఇలాంటి ఘటనే ఒకటి హైదరాబాద్ బంజారా హిల్స్‌లో జరిగింది.

బంజారాహిల్స్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్సై, హోమ్ గార్డ్‌పై పలువురు మహిళలు దాడికి పాల్పడ్డారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 పార్కాయత్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. అర్ధరాత్రి పార్క్ హయత్ వద్ద ఓ కారును ట్రాఫిక్ ఎస్ఐ అవినాష్ బాబు, హోంగార్డ్ నరేష్‌లు ఆపారు. కారు నడుపుతున్న మహిళకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేసేందుకు హోంగార్డ్ యత్నించాడు.

అంతే సదరు డ్రైవింగ్ చేస్తున్న మహిళతో పాటు మరో ముగ్గురు మహిళలు బూతులతో విరుచుకుపడ్డారు. హోంగార్డ్



ఫోన్ తీసుకొని కారు నడుపుతున్న మహిళ నేలకేసి కొట్టింది. ప్రశ్నించడానికి వచ్చిన ఎస్సై అవినాష్‌పై దాడి చేయడమే కాకుండా అక్కడున్న కెమెరాలను సైతం ధ్వంసం చేసింది. ఎస్ఐ నరేష్ ను తిట్టి తోసేసింది.

మహిళకు మద్దతుగా ఇద్దరు యువకులు సైతం రంగంలోకి దిగారు. ఆ ఇద్దరు యువకుల్ని పట్టుకుని బంజారాహిల్స్ పోలీసులకు ఎస్సై, హోంగార్డ్ అప్పగించారు. హోంగార్డ్ నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జూలై నెలలో అయితే రికార్డ్ స్థాయిలో మందు బాబులు డ్రైవింగ్ చేస్తూ దొరికిపోయారు.

కేవలం 10 రోజుల వ్యవధిలోనే 1600 మంది దొరికారు. జూలై 1నుంచి జూలై 10 వరకు హైదరాబాద్ నగరవ్యాప్తంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో తాగి వాహనాలు నడుపుతున్న 1,614 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

## అమ్మ జోగి.. ఏమి స్కెచ్ వేశావ్?

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వచ్చి ఉంటే, ఒక్క ఆస్తి కూడా ఉండేది కాదు

(ప్రదీప్-నందిగామ)

జోగి రమేష్ అగ్రిగోల్డ్ భూముల్ని అడ్డగోలుగా కబ్జా చేశారు. సర్వే నంబరు మార్చేసి.. వాటిని కొట్టేసి.. తన కొడుకు, బాబాయ్ పేరిట మార్చేసి.. ఏకంగా ప్రహరీ నిర్మించేశారు. వాటి యజమానులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా.. జోగి రమేష్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు సన్నిహితుడు కావడంతో విచారణ లేకుండా తొక్కిపెట్టారు.

### స్కాం ఎలా చేసాడో తెలిస్తే, ఆశ్చర్య పోతారు

విజయవాడ గ్రామీణ మండలం అంబాపురం గ్రామంలో రీ సర్వేనంబరు 87లో అవ్వా వెంకట శేషునారాయణరావు, వారి బంధువులకు భూములు ఉన్నాయి. వీరు అగ్రిగోల్డ్ కంపెనీలో భాగస్వాములుగా ఉన్నారు. అగ్రిగోల్డ్ కేసులో ప్రభుత్వం రీసర్వే నంబరు 87లో 2,293.05 గజాల స్థలాన్ని జప్తు చేసింది. వాటిపై వైకాపా నాయకుల కన్ను పడింది. పక్కా ప్రణాళిక వేశారు.

అంబాపురంలోనే రీసర్వే నంబరు 88లో పోలవరపు మురళీమోహన్ అనే వ్యక్తి నుంచి మాజీ మంత్రి తనయుడు జోగి రాజీవ్ 1,074 గజాలు, ఆయన బాబాయ్ జోగి వెంకటేశ్వరరావు 1,086 గజాలు కొని 2022లో రిజిస్టర్ చేయించారు. ఆ దస్తావేజుల్లో సర్వే నంబరు 88 అని స్పష్టంగా ఉంది. తర్వాత నెల రోజులకే తమ దస్తావేజుల్లో సర్వే నంబరు 87కు బదులు 88 అని తప్పుగా నమోదైందంటూ దరఖాస్తు చేశారు. అప్పటికే జోగిరమేష్ మంత్రిగా ఉండటంతో



ఏమాత్రం విచారణ లేకుండా అధికారులు సర్వే నంబరు మార్చేశారు.

### వెంటనే అమ్మకం


దొంగదారిలో స్వాధీనం చేసుకున్న భూమిని వెంటనే 2023 మే నెలలో వైకాపా కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి బంధువులకు అమ్మేశారు.

## గురుకులాలను ప్రక్షాళన చేస్తాం... నిధులు సమకూరుస్తాం

- మంత్రులు, ఎమ్మెల్యేలు నెలకొకరోజు గురుకులాల పర్యటన
- గురుకుల భవన నిర్మాణాలకు బడ్జెట్లో రూ.5 వేల కోట్లు
- గురుకుల భవన నిర్మాణాలను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం
- పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు తక్షణమే రూ.50 లక్షలు మంజూరు
- గురుకుల విద్యార్థులకు మంచాలు, బెడ్స్ ఉండాల్సిందే, ప్రతిపాదనలు పంపితే నిధులు ఇస్తాం
- పెద్దాపూర్‌లో విద్యార్థుల మృతి ప్రభుత్వాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది
- పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కుమారులను కోల్పోయి కంటతడి పెట్టిన తల్లిదండ్రులను ఓదార్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్

పెద్దాపూర్,మహానాడు:

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలను ప్రక్షాళన చేసి ప్రాంగణాలను అత్యంత పరిశుభ్రతగా తీర్చిదిద్దడంతో పాటు అవసరమైన నిధులను సమకూర్చుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. నెలలో ఒక రోజున రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు శాసనసభ్యులు గురుకుల పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో భోజనం చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఆలోచనకు




అనుగుణంగా జిల్లా కలెక్టర్లు, డిఎంహెచ్వోలు సైతం నెలలో ఒక రోజున గురుకుల పాఠశాలలో బస చేయాలని సూచించారు.

జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంగళవారం డిప్యూటీ సీఎం



సందర్శించారు. గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల మృతి నలుగురు విద్యార్థుల అస్వస్థతకు సంబంధించిన కారణాల గురించి విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. తీవ్ర దుక్క సాగరంలో ఉన్న తల్లిదండ్రుల ఆవేదనను చూసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భావోద్వేగానికి గురయ్యారు.

కంటతడి పెట్టుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఓదార్చిన అనంతరం వారితో సమావేశమయ్యారు అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంలో బడ్జెట్ పెట్టడానికి ముందు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులను తెలుసుకొని విద్యా, వైద్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ వార్షిక బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించినట్లు వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా గురుకుల పాఠశాలల పక్క భవనాల నిర్మాణం కోసం ఈ బడ్జెట్ లో ప్రజా ప్రభుత్వం రూ. 5వేల కోట్లు కేటాయించిందన్నారు.

పది సంవత్సరాలు అధికారంలో ఉన్న గత పాలకులు గురుకుల పాఠశాలల పక్కా భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా అర కొర వసతుల మధ్యన నేడు విద్యార్థులు అనుభవిస్తున్న దుస్థితి అని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల పక్క భవనాల నిర్మాణం కొరకు గత ప్రభుత్వం 2015 -16 ఆర్థిక సంవత్సరంలో 197 కోట్ల కేటాయించగా 2016 17 ఆర్థిక సంవత్సరం నాటికి 116 కోట్ల రూపాయలకు కుదించిందన్నారు.

2018- 19 సంవత్సరంలో రూ. 79 కోట్లు, 2019-20 వార్షిక సంవత్సరంలో 70 కోట్లు, 2020-21 వార్షిక సంవత్సరంలో కేవలం 11 కోట్లు, 2021-22 వార్షిక సంవత్సరంలో 9 కోట్లు, 2022-23 వార్షిక సంవత్సరంలో ఏడు కోట్లు, 2023 24 వార్షిక సంవత్సరానికి మూడు కోట్లు మాత్రమే కేటాయించిందని వివరించారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మానవ వనరులను అభివృద్ధి చేసుకోవాలని ప్రపంచంతో పోటీపడే విద్యను అందించాలని విద్యకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి గొప్ప ఆలోచనతో ముందుకెళ్తున్న తరుణంలో పెద్దాపూర్ లో ఇద్దరు విద్యార్థులను కోల్పోవడం ప్రజా ప్రభుత్వాన్ని తీవ్రంగా కలిచివేసిందని బాధపడ్డారు.

రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో పక్క భవనాల నిర్మాణం కోసం కావలసిన నిధులు, భవనాల నిర్మాణ కావలసిన స్థల సేకరణకు అయ్యే నిధులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని గత కలెక్టర్ల కాన్ఫరెన్స్ లోనే ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రభుత్వ హాస్టల్స్ లో చదివే విద్యార్థులకు హెల్త్ కార్డ్స్ ఉండేదనీ, ప్రతి నెల డాక్టర్లు వచ్చి వారి ఆరోగ్యాన్ని చెక్ చేసి కార్డులో రాసే వారని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్టల్లో నే పారామెడికల్ స్టాఫ్ ఉండేవారని. అ విధానాన్ని తిరిగి తీసుకురావాలని గురుకులాల సెక్రటరీని ఆదేశించారు

### విద్యార్థుల డైట్ చార్జీల పెంపునకు కమిటీ వేస్తాం

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచడానికి త్వరలోనే అధికారులతో కమిటీ వేస్తామని ప్రకటించారు. కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత డైట్ చార్జీలను పెంచుతామని వెల్లడించారు. గురుకుల పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి నేలపైన పడుకోవడానికి వీలులేదని కచ్చితంగా మంచం, బెడ్, బెడ్ షీట్ ను ప్రభుత్వ సమకూర్చుతుందని ఇందుకోసం ప్రతిపాదనలు పంపితే నిధులు విడుదల చేస్తామని గురుకులాల సెక్రటరీ రమణ కుమార్ ఆదేశించారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి గురుకులంలో అత్యవసర ఔషధాలు, పారా మెడికల్ స్టాఫ్, కుక్కకాటు, పాముకాటుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గురుకులాల సెక్రెటరీని ఆదేశించారు. శుచి, శుభ్రత పాటిస్తూ నాణ్యత గల ఆహారాన్ని అందించాలని సూచించారు. ప్రతి గురుకుల పాఠశాలలో టాయిలెట్స్, బాత్రూమ్స్ విద్యార్థులకు అనువుగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

సమృద్ధిగా నీరు, విద్యుత్తు, గురుకుల పాఠశాలకు కావలసిన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఈజీఎస్ పనుల కింద గురుకుల పాఠశాలలో చెత్తా, చెదారం పిచ్చి మొక్కలు తొలగించి, పండ్లు, ఔషధ మొక్కలు నాటించాలని చెప్పారు. గురుకులాల్లో పనిచేసే వార్డెన్స్, టీచర్స్, పారామెడికల్ సిబ్బంది రాత్రి సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

### పెద్దాపూర్ పాఠశాలకు 50 లక్షలు మంజూరు

పెద్దాపూర్ గురుకుల పాఠశాల ప్రాంగణంలో నీటి కుంటలు, చెత్తాచెదారం లేకుండా అభివృద్ధి చేయడానికి, టాయిలెట్స్ నిర్మాణం కోసం ఇతర సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 50 లక్షలు మంజూరు చేశామన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డార్మీటరీ, డైనింగ్ హాల్స్, భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించిన వెంటనే ఒక్కరోజు ఆలస్యం చేయకుండా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

12 ఎకరాలు ఉన్న పెద్దాపూర్ పాఠశాలలో భవన నిర్మాణం కోసం 2020-21 వార్షిక సంవత్సరంలో నిధులు మంజూరు చేసి విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులను ఆపి వేసినట్లు అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు.

అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసిన వెంటనే ఆ నిధులు మా ప్రభుత్వం ఇస్తుందన్నారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని, నీటి కుంటలు చెత్తాచెదారం లేకుండా చూడాలని కలెక్టర్ ను ఆదేశించినట్లు చెప్పారు.

### విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండ

మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా తో పాటు గురుకుల సొసైటీలో వారి విద్యా అర్హతకు అనుగుణంగా ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ఇల్లు లేకుంటే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్టు చెప్పారు. మృతి చెందిన విద్యార్థుల పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత దాని ఆధారంగా విచారణ ఉంటుందన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || బుధవారం 14, ఆగస్టు 2024


## మొదటి జాతీయ జెండా

**చెన్నై, మహానాడు:**
స్వాతంత్ర్య దినోత్సవం అనగానే గుర్తొచ్చేది పింగళి వెంకయ్య రూపొందించిన రెపరెపలాడే మువ్వన్నెల జెండా. మొట్ట మొదటగా 1947 ఆగస్టు 15న ఆవిష్కరించిన జెండాను మీరెప్పుడైనా చూశారా?

ఆ జెండా ఎక్కడ ఉందో తెలుసా? చెన్నైలోని ఫోర్ట్ సెయింట్ జార్జ్ మ్యూజియంలో 12 అడుగుల పొడవు 8 అడుగుల వెడల్పు గల జాతీయ జెండాను భద్రపరిచారు. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యం వచ్చిన రోజు ఆవిష్కరించిన జెండాల్లో ఇది ఒకటి. దీనిని స్వచ్ఛమైన సిల్క్ తో తయారుచేశారు.




# అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు కులాలను రెచ్చగొడతారా?

◆ **జోగి రమేష్‌పై మంత్రి అనగాని ఫైర్**

**అమరావతి, మహానాడు:**
తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మాజీ మంత్రి జోగీ రమేష్ కులాలను రెచ్చగొట్టేలా మాట్లాడడం సరైంది కాదని రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అగ్రిగోల్డ్ భూముల కుంభకోణంలో జోగీ కుటుంబం పాత్రపై పూర్తి ఆధారాలు ఉన్నాయని చెప్పారు. దాదాపు ఐదు కోట్ల రూపాయల ఆస్తిని జోగి కుటుంబం కాజేసిందని, దీనిపై బాధితుడు ఫిర్యాదుచేయడంతో ప్రారంభమైన విచారణలో జోగి కుటుంబం కుంభకోణానికి పాల్పడినట్టు తేలిందన్నారు.

తన అవినీతి బయటపడడంతో ఏం చేయాలో అర్థంకాక జోగి రమేష్ కులాలను రెచ్చగొడుతున్నారని అన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు 14 ఏళ్ల బాలుడు అమర్నాథ్ గౌడ్ చనిపోతే కులం కూడు పెడుతుందా అని అన్న వ్యక్తి జోగి రమేష్ అని, అదే రమేష్ ఇప్పుడు మాత్రం తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు కులాల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. జోగి రమేష్ కుటుంబం బలహీన వర్గాల




ప్రజల అభ్యున్నతికి చేసింది శూన్యమని చెప్పారు. బీసీ సంఘాలేవీ జోగి రమేష్‌కు మద్దతివ్వడం లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడూ జోగి రమేష్ అహంకారంతో విర్రవీగారని, చంద్రబాబు ఇంటిపైకి కత్తులు, కర్రలతో దాడి చేయడానికి ప్రయత్నించారని గుర్తుచేశారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించడం లేదని, జోగి రమేష్ కుటుంబం భూ అక్రమాలకు పాల్పడబట్టే వారిపై కేసు పెట్టామని చెప్పారు. ఈ వ్యవహారంలో అధికారులపై కూడా ఏసీబీ కేసు పెట్టిందని చెప్పారు. జోగీ రమేష్ భూ దాహానికి ఆయన కొడుకే బలయ్యాడని అన్నారు.

ఇప్పటికీ జోగి రమేష్ బుద్ధి మారలేదని మంత్రి అనగాని అన్నారు. మీకు పిల్లలు ఉన్నారు... మాకు అవకాశం వస్తుందన్నట్టు బెదిరింపులకు పాల్పడుతున్నారని, వైసీపీ నేతల వైఖరే అలాంటిదని, కానీ వారి బెదిరింపులకు ఎవ్వరూ భయపడేది లేదన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అని జోగి రమేష్ మాట్లాడుతున్నారని, నిజంగా రెడ్ బుక్ తెరిస్తే వైసీపీ నేతలు రాష్ట్రంలో తిరగగలరా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చట్ట ప్రకారమే పరిపాలన సాగిస్తుందని, ప్రతీకార రాజకీయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ ప్రోత్సహించరని అన్నారు. తమ ప్రభుత్వం తప్పు చేసిన వారిని కచ్చితంగా శిక్షిస్తుందని, బాధితులకు అండగా నిలబడి న్యాయం చేస్తుందని చెప్పారు.



కాకినాడ పోర్టులోని బొంబాయి గేట్ దగ్గర ఏర్పాటు చేసిన చెక్ పోస్టును పరిశీలించిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. అక్కడి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని - తక్షణమే మరో చెక్ పోస్టును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎం.డి. వీర పాండియన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## జోగి రమేశ్‌కు నోటీసులిచ్చిన పోలీసులు

◆ **చంద్రబాబు ఇంటిపై దాడి కేసు**

◆ **మంగళగిరి డీఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలన్న పోలీసులు**

**మంగళగిరి,మహానాడు:**
ఏపీ సీఎం చంద్రబాబు నివాసంపై దాడి కేసులో విచారణకు హాజరు కావాలని మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఇవాళ సాయంత్రం మంగళగిరి డీఎస్పీ ఆఫీసులో విచారణకు హాజరు కావాలని తెలిపారు. వైసీపీ హయాంలో ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంపై జోగి రమేశ్ దాడికి ప్రయత్నించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసుకు సంబంధించి మంగళగిరి పోలీసులు ఆయనకు నోటీసులు ఇచ్చారు.



తిరుమల శ్రీవారి ట్రస్ట్‌కు 21 కోట్లు విరాళంగా ఇచ్చిన చెన్నైకి చెందిన ఆర్య వైశ్య ప్రముఖులు రాజేందర్ గుప్తా



విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 16 నుండి నిర్వహించబోయే రెవెన్యూ సదస్సులకు గాను DRO అనితతో చర్చిస్తున్న విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గం శాసనసభ్యులు లోకం నాగ మాధవి



షార్ కేంద్రంకు వెళుతూ రేణిగుంట విమానాశ్రయంలో దిగిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి హార్దిక స్వాగతం పలికిన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆరణి శివ కుమార్, ఆరణి మదన్



కేంద్ర మైనింగ్ సెక్రటరీ కె.ఎల్.కాంతారావును కలిసిన రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఢ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్రంలో మైనింగ్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, సీబెడ్ మైనింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బీచ్ శాండ్ మైనింగ్ కోసం వచ్చిన దరఖాస్తుల్ని త్వరగా పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.

# పేదలకు కడుపు నిండా భోజనం

◆ **రూ. 5 కే టిఫిన్, లంచ్, డిన్నర్**

◆ **15న గుడివాడలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అన్న క్యాంటీన్ లు ప్రారంభం**

◆ **ఆహారం సరఫరా చేసే భారీ కిచెన్‌ను మంత్రి పరిశీలన**

**అమరావతి, మహానాడు:**
అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్ లను తిరిగి ప్రారంభిస్తాం...ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హెూదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ...వంద రోజుల్లో అన్న క్యాంటీన్ లు ప్రారంభించాలని మొదట్లో టార్గెట్...కానీ అనుకున్న దానికంటే ముందుగానే కేవలం రెండు నెలల్లోనే క్యాంటీన్‌ల ప్రారంభం...పేదవాడి కోసం మేమున్నామంటూ కూటమి సర్కార్ మరోసారి నిరూపించుకుంటుంది... ఆగస్ట్15స్వాతంత్ర దినోత్సవం నాడు అన్న క్యాంటీన్‌ల పునః ప్రారంభానికి ప్రభుత్వం సిద్ధమయింది...పేదలకు ఐదు రూపాయిలకే కడుపు నిండా అన్నం పెట్టాలనే ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు అన్న క్యాంటీన్ లను ప్రారంభించారు.

2018, 2019 ఎన్నికల ముందు వరకూ నాలుగు కోట్ల 60 లక్షల మందికి ఆహారం సరఫరా చేసారు.. ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజనం ఏదైనా గానీ కేవలం ఐదు రూపాయిలు మాత్రమే లబ్ధిదారుల నుంచి వసూలు చేసి మిగిలిన భారమంతా ప్రభుత్వమే భరించింది. కానీ 2019 ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆగస్ట్ ఒకటో తేదీ 2019 నుంచి అన్న క్యాంటీన్లను రద్దు చేసి పేదలకు కూడుకు దూరం చేసింది. ప్రభుత్వం నిర్మించిన క్యాంటీన్ల భవనాలను కూడా ఇతర అవసరాలకు ఉపయోగించుకుంది. దీంతో గత ఐదేళ్లలో పేదలు నానా ఇబ్బందులు పడిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి నుంచి పేదలకు ఉపశమనం కలిగించేలా తామున్నామంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుంది.

### ఆగస్టు 15న వంద అన్న క్యాంటీన్లు ప్రారంభం: మంత్రి నారాయణ

అన్న క్యాంటీన్లు, ఆహార సరఫరా వంటి అంశాలపైపురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఎప్పటికప్పుడూ పర్యవేస్తూ వచ్చారు. ఈనెల 15 నుంచి క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి. తనకు వందరోజుల్లో క్యాంటీన్లు ప్రారంభించాలని సీఎం చంద్రబాబు సూచించినప్పటికీ దానికంటే ముందుగానే వేగంగా కార్యరూపం దాల్చేలా కీలకపాత్ర పోషించారు. అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా టెండర్లను హరేకృష్ణ మూవ్ మెంట్ సంస్థ దక్కించుకుంది.

ఈ సంస్థ ఇప్పటికే అక్షయపాత్ర పేరుతో బడిపిల్లలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తోంది. ఈ సంస్థకు చెందిన భారీ కిచెన్ ను మంత్రి నారాయణ సందర్శించారు. మంగళగిరి లోని తెనాలి రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్ మెంట్ కు చెందిన భారీ కిచెన్ ను మంగళవారం పరిశీలించారు. ఒకేసారి వేలాది మందికి అతి తక్కువ సమయంలో ఆహారం వండి సరఫరా చేసేలా కిచెన్ లో ఏర్పాట్లున్నాయి. ఎంతో పరిశుభ్రమైన వాతావరణంలో అన్నం వండే విధానాన్ని, కూరగాయలు తరిగే విధానం, కూరలు వండే విధానం, ప్యాకింగ్ ఎలా చేస్తారనే అంశాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అన్నం వడుకుతున్న భారీ పాత్రలో అన్నాన్ని కలియబెట్టారు మంత్రి. కూరగాయలు కట్ చేసే యంత్రంలో టమోటాలు వేసి ఎలా పనిచేస్తుందనేది తెలుసుకున్నారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు.



గత టీడీపీ ప్రభుత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా అన్న క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన,పరిశుభ్రమైన ఆహారం సరఫరా చేసాం.. ఎన్నికల ముందు వరకూ 4 కోట్ల 60 లక్షల మందికి భోజనాలు పెట్టాం.. కానీ దురదృష్టవశాత్తూ గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసిందన్నారు మంత్రి నారాయణ... క్యాంటీన్ల భవనాలను సైతం స్టోర్ లుగాను, సచివాలయాలుగా మార్చివేసింది. అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజు చంద్రబాబు చేసిన ఐదు సంతకాల్లో అన్న క్యాంటీన్ల ప్రారంభం కూడా ఒకటి. ఈ సంతకం ఆచరణ దిశగా ముందుకెళ్తున్నాం. వంద రోజుల్లో క్యాంటీన్లు ప్రారంభించాలని సీఎం చెప్పిన విధంగా గతంలో ఉన్న విధంగానే ఏర్పాట్లు చేసి ప్రారంభోత్సవాలు చేస్తున్నామన్నారు. ఆగస్టు 15న కృష్ణా జిల్లా గుడివాడలో మధ్యాహ్నం లంచ్ సమయంలో ఈ క్యాంటీన్లను సీఎం ప్రారంభిస్తారన్నారు. ఆ మరుసటి రోజు మిగిలిన 99 క్యాంటీన్లను స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారని అన్నారు. మిగిలిన 103 క్యాంటీన్లను సెప్టెంబర్ ఐదో తేదీన ప్రారంభి



స్తామన్నారు.

అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేసే టెండర్లను హరేకృష్ణ మూవ్ మెంట్ సంస్థ దక్కించుకుందని చెప్పారు...గత టీడీపీ ప్రభుత్వంలోనే పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించిన తర్వాత వాటికి వచ్చిన స్పందన చూపి గ్రామీణ ప్రాంతాల్లో కూడా 152 క్యాంటీన్లు ప్రారంభించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని,టెండర్లు పిలిచినప్పటికీ... ఆ తర్వాత జరిగిన పరిణామాలు,ఎన్నికలు రావడంతో అమల్లోకి రాలేదన్నారు.

హరేకృష్ణ మూవ్ మెంట్ కిచెన్ లాంటి కిచెన్ మరెక్కడా లేదన్నారు. ఎంతో పరిశుభ్ర వాతావరణంలో ప్రతిరోజూ లక్ష మందికి ఆహారం సరఫరా చేసే భారీ కిచెను ఏర్పాటు చేసిన సంస్థను అభినందిస్తున్నట్టు మంత్రి తెలిపారు. కేవలం మూడు గంటల్లోనే లక్షమందికి ఆహారం సిద్ధం చేసే భారీ కిచెన్ ఇంకెక్కడా లేదన్నారు. ఈ భారీ కిచెన్ ఏర్పాటుకు 22 కోట్లు ఖర్చుయింది. మరోవైపు అన్న క్యాంటీన్ల కోసం భారీగా విరాళాలు ఇచ్చేందుకు ఎంతో మంది ముందుకొస్తున్నారు. ఈరోజు కూడా ఎస్ ఎల్ వీ గ్రూప్ శ్రీనివాస రాజు కోటి రూపాయిలు విరాళం ఇచ్చారని చెప్పారు. అయితే అన్న క్యాంటీన్ల కోసం ప్రత్యేకంగా కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి అన్న క్యాంటీన్ చారిటబుల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసినట్టు మంత్రి నారాయణ చెప్పారు.

పేదలకు కడుపునిండా భోజనం పెట్టే అన్న క్యాంటీన్ల కోసం విరాళాలు ఇవ్వాలనుకుంటే అన్న క్యాంటీన్స్, ఏసీ నెంబర్ 37818165097, చంద్ర మౌళినగర్, గుంటూరు, ఐఎఫ్ఎస్‌సీ నెంబర్ SBIN0020540, అకౌంట్‌కు పంపించవచ్చని సూచించారు.

### జోగి రమేష్ కుమారుడు అరెస్ట్ విషయంలో చట్ట ప్రకారమే ముందుంకు...

మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు రాజీవ్ అరెస్ట్‌పై మంత్రి నారాయణ స్పందించారు. ఏ విషయంలోనైనా చట్టబద్ధంగా ముందుకెళ్లాలని సీఎం చంద్రబాబు కేబినెట్‌లో చెప్పారన్నారు. వైసీపీ నాయకులు గతంలో చేసినట్టు ఎలాంటి అరాచకాలకు పాల్పడవద్దని సూచించారని తెలిపారు. మన ప్రభుత్వం ప్రజాపాలన చేయాలని, గత ప్రభుత్వం అసలు ప్రజల్లోకి రాకుండా పాలన చేసిందని సీఎం గతంలోనే చెప్పారన్నారు...గతంలో 36 మందిని ఈ ప్రభుత్వం చంపేసిందని అభాండాలు వేశారని, తీరా ఎఫ్ ఐ ఆర్ లు ఇవ్వాలని సీఎం అడిగితే ముందుకు రాలేదన్నారు. బీసీలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని... తమ ప్రభుత్వంలో ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి చెప్పారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 14, ఆగస్టు 2024

# రిజర్వేషన్‌లకు కేంద్రం వ్యతిరేకం!

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

రాజమండ్రి, మహానాడు:

రిజర్వేషన్‌లకు కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకంగా ఉందని, ఇందులో విదేశీ కుట్ర దాగిందని, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి భాగస్వాములని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ఆ వివరాలు.. సెబీ స్కామ్ లో తప్పులు లేకుంటే జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలి. పీవీ హయాంలో సెక్యూరిటీ స్కామ్ ఆరోపణలు వస్తే, ఆనాడు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేశారు. అదాని కంపెనీలపై వస్తున్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? జగన్ పరిపాలన కంటే చంద్రబాబు పరిపాలన జబర్దస్త్ గా ఉంది. ఆయన (చంద్రబాబు ) టిడిపి, నేను (చింతామోహన్ ) కాంగ్రెస్ అయినప్పటికీ మా మధ్య రాజకీయ వైరుధ్యం ఉన్నప్పటికీ చంద్రబాబును అభినందించక తప్పదు. కాపు, బలిజలు ఏనాటికైనా ముఖ్యమంత్రి అవుతారు. కాపు డిప్యూటీ సీఎం అయినంత మాత్రాన నాకు సంతృప్తిగా లేదు. కాపు బలిజల్లో కసి, పట్టుదల ఉండాలి. అది ఉంటే ఏదో ఒక రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి అవుతారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎస్సీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు.

జిల్లా కలెక్టర్లుగా, జిల్లా ఎస్పీలుగా ఎస్సీ అధికారులను నియమించకపోవడమే ఎందుకు నిదర్శనం. బిజెపి ది విభజించు పాలించు సిద్ధాంతం. అందులో భాగంగానే వర్గీకరణ తీర్పు. తుషార్ మెహతా సుప్రీంకోర్టులో వర్గీకరణకు అనుకూల వాదనలు చేశారు. వెనుకబడిన వర్గాలు దేశంలో 60 కోట్ల మంది ఉంటే, ముగ్గురే సుప్రీంకోర్టు జడ్జిలుగా ఉన్నారు. 20 కోట్ల మంది మైనార్టీలు ఉంటే సుప్రీం జడ్జిగా ఒకరే ఉన్నారు. 34 మంది సుప్రీం జడ్జిల్లో ఒకే సామాజిక వర్గం వారు 20 మంది ఉన్నారు. 5000 సంవత్సరాలుగా అంటరానితనం భారతదేశంలో ఉన్నది.



సౌత్ ఆఫ్రికా దర్బార్లో మహాత్మా గాంధీ అంటరానితనం గురించి తెలుసుకొని, బెజవాడ వచ్చి అన్ని విషయాలు తెలుసుకున్నారు. కేరళ నుంచి కన్యాకుమారి వరకు గాంధీ పాదయాత్ర చేశారు.

ప్రతి దగ్గర ఐదు నిమిషాలు గాంధీ మాట్లాడారు. అంటరానితనం, హరిజనోద్ధరణ, దేశానికి స్వతంత్రం గురించి మాత్రమే గాంధీ ప్రస్తావించారు. దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు స్వతంత్రం వచ్చిన తర్వాత ఆరోజు హరిజనులు, నేడు దళితులకు రిజర్వేషన్లు ఇవ్వాలని నెహ్రూకి గాంధీ చెప్పారు. బెజవాడకు చెందిన చక్రయ్యను దేశానికి తొలి రాష్ట్రపతిని చేయాలని గాంధీ కోరుకున్నారు. అనారోగ్యంతో చక్రయ చనిపోవడంతో, అది నెరవేరలేదు. 10 లక్షల కోట్లు జగన్ అప్పులు తెచ్చారు.

తెచ్చిన అప్పులు ఏ జిల్లాకు ఎంత ఖర్చు చేశారు? ఆ వివరాలు బయటపెట్టాలి. ముఖ్యమంత్రికి నెల రోజులు గడువిస్తున్నా... ముఖ్యమంత్రి ప్రజలకు తెలియజేయకుంటే, నేనే ఆ వివరాలు బయటపెడతా... నాకు తెలుసు ఆ వివరాలు ఎలా రాబట్టాలో! తెలంగాణలో ఒక కుటుంబం, ఆంధ్రాలో ఒక కుటుంబం వల్ల రాష్ట్ర విభజన జరగడమే కాదు, తెలుగు వాళ్ళ ప్రతిష్ట, ఆత్మగౌరవం దెబ్బతింది.

## కేంద్ర మంత్రి దృష్టికి
# మంత్రి కొల్లు రవీంద్ర విన్నపాల వెల్లువ

- సానుకూలంగా స్పందించిన కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, మహానాడు:

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు విన్నపాలు చేశారు. ఆ వివరాలు...

- జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ), ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబీఎం) ప్రాంతీయ కార్యాలయాలు ఏపీలో ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రంలో మైనింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేక మైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏపీలో ఏర్పాటు చేయండి.
- ఆంధ్రప్రదేశ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీలు), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీలు)లో మైనింగ్ అండ్ మినరల్ ప్రాసెసింగ్‌లో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాలి.
- ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక గ్రానైట్ ప్రమోషన్ బోర్డును ఏర్పాటు చేయాలి.



- ఆర్ఐఎన్ఎల్‌కు క్యాప్టివ్ ఇనుప ముడి ఖనిజం, బొగ్గు గనులను తక్షణమే కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలి.
- క్రిటికల్ మినరల్ ప్రాసెసింగ్ పెట్టుబడుల్ని ఏపీ ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలి.
- ఆఫ్‌షోర్ మైనింగ్ వేలంలో పాల్గొనేందుకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.


# దళిత ద్రోహి జగన్ రెడ్డి!

- అంబేద్కర్ విగ్రహాలను తాకే అర్హత వైసీపీ నేతలకు లేదు
- మాజీ మంత్రి పీతల సుజాత

మంగళగిరి, మహానాడు:

అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచి.. దళితుల అభివృద్ధిని మంటగలిపి దళితులపై దమనకాండ సాగించిన వైసీపీ నేతలకు దళితుల గురించి మాట్లాడే హక్కు.. అంబేద్కర్ విగ్రహాలను తాకే అర్హత లేదని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లడారు. సమాజంలో సమానత్వాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రజా పాలన ఉండాలన్న అంబేద్కర్ ఆశయానికి విరుద్ధంగా వైసీపీ పాలన సాగింది. దళితులుపై అనేక నేరాలు ఘోరాలు చేయించిన ఘన చరిత్ర జగన్ రెడ్డిది. వైసీపీ నాయకులకు అంబేద్కర్ విగ్రహాలను తాకే అర్హత కూడా లేదు. చంద్రబాబు నాయుడు దళితుల విద్యోన్నతి కోసం అంబేద్కర్ విదేశీ విద్యావిదానంను తీసుకొచ్చారు. వైసీపీ వచ్చాక విదేశీ విద్యాపథకాన్ని నిలిపేయడమే కాక.. అంబేద్కర్ విదేశీ విద్యాపథకానికి పేరు మార్చి జగన్ రెడ్డి పేరు పెట్టుకున్నాడు. పేరు మార్చుకొని అంబేద్కర్ ను జగన్ రెడ్డి ఘోరంగా అవమానించినా.. నాడు వైసీపీలో ఉన్న దళిత నేతలు ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

దళితుల అభివృద్ధిని అట్టడుగుకు తీసుకెళ్తే వైసీపీలో ఉండే దళిత నేతలు ఒక్కరు ప్రశ్నించలేదు. టీడీపీ పాలనలో దళిత వాడల్లో అభివృద్ధి జరిగితే... వైసీపీ పాలనలో అభివృద్ధి అటకెక్కింది. అమరావతిలో అంబేద్కర్ స్మృతి వనం కోసం చంద్రబాబు రూ. 100 కోట్లతో 30 ఎకరాల్లో మంచి ప్రాజెక్ట్ ను చేపడితే.. కుట్రపూరితంగా జగన్ రెడ్డి దాన్ని అడ్డుకొని విజయవాడకు తరలించి దోచుకున్నారు. శిలాఫలకంపై ఉండాల్సిన జగన్ రెడ్డి పేరును అంబేద్కర్ పేరుకంటే పెద్దగాపెట్టారు. జగన్ పేరును తాటికాయంత అక్షరాలతో రాసి అంబేద్కర్ పేరు చిన్న అక్షరాలతో రాయడం అంబేద్కర్ ను అవమానించడం కాదా? అనాడే



అంబేద్కర్ వాదులు జగన్ రెడ్డి చర్యలకు చాలా బాధపడ్డారు. ఆ బాధను అనుచుకోలేక అంబేద్కర్ వాదులే జగన్ పేరును తొలగించారు.

అంబేద్కర్ పేరును అందరికి కనిపించేలా పెట్టాలి కాని జగన్ పేరు పెట్టుకుంటారా? దీన్ని టీడీపీ మీదకు మళ్లీ కుట్రపూరితంగా నెడుతున్నారు సిగ్గులేకుండా.. ఇదే జగన్ రెడ్డి పైశాచికత్వానికి నిదర్శనం. జగన్ రెడ్డి మానసిక పరిస్థితి దిగజారిపోయింది. దళితులకు మేలు చేసింది టీడీపీ పార్టీనే. అంబేద్కర్ దళితులకు రాజ్యంగ ఫలాలు ఇస్తే.. దాన్ని అమలు చేస్తూ నందమూరి తారక రామరావు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తూ.. దళిత బిడ్డల విద్యాభివృద్ధికి కృషి చేశారు. అంబేద్కర్ ఆలోచనలను చంద్రబాబు కొనసాగిస్తూ.. దళితవాడలను అభివృద్ధి చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ను బలోపేతం చేసి ఇన్నోవా కార్లు ఇచ్చి దళితులను కార్లకు చంద్రబాబు ఓనర్లను చేశారు. దళిత బాంధవుడు చంద్రబాబు... దళిత ద్రోహి జగన్ రెడ్డి. దళితుల అభివృద్ధికోసం ఇచ్చిన హామీలు అన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాకి అడ్డుకట్ట

- కాకినాడ పోర్టులో చెక్ పోస్టు
- చెక్ పోస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు
- వారంలో అదనంగా మరో రెండు చెక్ పోస్టులు
- రోజుకి వెయ్యికి పైగా లారీలు పాస్ అయ్యే విధంగా ఏర్పాట్లు
- కాకినాడ యాంకరేజీ పోర్టును దుర్వినియోగం చేశారు
- ఒక కుటుంబం కోసం పోర్టు లేదు
- బియ్యం సీజ్ వ్యవహారంలో విచారణ సాగుతోంది
- బాధ్యులపై క్రిమినల్ చర్యలు.. 41ఏ నోటీసులు.. అరెస్టులు
- కాకినాడ కలెక్టరేట్‌లో పోర్టు కార్మికులు, ట్రాన్స్ పోర్టర్లు, ఎగుమతిదారుల ప్రతినిధులతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్






కాకినాడ, మహానాడు:

కాకినాడ పోర్టు కేంద్రంగా జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితాన్నిస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కాకినాడ పోర్టులో అక్రమాలు ఆగాలి.. ఆపి తీరుతామన్నారు. అందుకు ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఆ క్రమంలో పోర్టు మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఇబ్బందులు కలగకుండా, పోర్టు కార్యకలాపాలకు ఆటంకాలు ఏర్పడకుండా చర్యలు ఉంటాయన్నారు. తక్షణం చెక్ పోస్టుల సంఖ్య పెంచుతామని హామీ ఇచ్చారు. కాకినాడ కలెక్టరేట్‌లో పోర్టు కార్మికులు, ట్రాన్స్ పోర్టర్లు, ఎగుమతిదారుల ప్రతినిధులతో మంగళవారం సమావేశం అయ్యారు. కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి కొండబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టు కారణంగా ఎగుమతి ప్రక్రియలో జాప్యం జరుగుతోందని పోర్టు ప్రతినిధులు తెలిపారు.

ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్రంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగింది. అందుకు కాకినాడ పోర్టు అడ్డాగా మారింది. ఆహార భద్రత చట్టం కింద రాష్ట్రవ్యాప్తంగా కోటీ 47 లక్షల రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా బియ్యం సరఫరా చేస్తుంటే, ఆ బియ్యాన్ని 10 రూపాయిల లోపు ధరకు వినియోగదారుల నుంచి కొనుగోలు చేసి బ్రోకెన్ రైస్, బాయిల్ రైస్ పేరిట ఇతర దేశాలకు ఎగుమతి చేసి అమ్ముకుంటున్నారు.

కాకినాడ పోర్టు ఉన్నది ఒక కుటుంబం కోసం కాదు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం. పోర్టు ద్వారా ఈ ప్రాంతానికి మంచి పెట్టుబడులు, పరిశ్రమలు రావాలి. తద్వారా కాకినాడ అభివృద్ధి జరగాలి. గత ప్రభుత్వంలో యాంకరేజీ పోర్టుని దుర్వినియోగం చేసి అధికారులు, మీడియా సంస్థలకు సైతం ప్రవేశం లేకుండా హుకుం జారీ చేశారు. జూన్ 28, 29 తేదీల్లో నిర్వహించిన తనిఖీల్లో 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్ చేస్తే అందులో 26 వేల మెట్రిక్ టన్నులు పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. ఈ వ్యవహారంపై శాఖాపరమైన విచారణ పూర్తికావచ్చింది. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటా. అక్రమాలకు కారకులైన వారికి 41ఏ నోటీసులు జారీ చేస్తాం. విచారణ పూర్తయ్యాక అరెస్టులు ఉంటాయి.

### తనిఖీల విషయంలో వెనక్కి తగ్గం

బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చెక్ పోస్టు ఏర్పాటు చేశాం. చెక్ పోస్టు ఏర్పాటు వల్ల చిన్నపాటి ఇబ్బందులు ఉన్నాయన్న విషయాన్ని పోర్టు మీద ఆధారపడి జీవించే స్టేక్ హోల్డర్స్ మా దృష్టికి తీసుకువచ్చారు. కొత్తగా ఒక పని ప్రారంభించినప్పుడు ఇబ్బందులు ఉంటాయి. వారం రోజుల్లో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యకలాపాలు సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకుంటాం. రోజుకి వెయ్యి నుంచి 11 వందల లారీల ద్వారా బియ్యం సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేస్తాం. వచ్చే సోమవారం నుంచి అదనంగా మరో రెండు చెక్ పోస్టుల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తాం. ఆధునిక పరికరాలు ఏర్పాటు చేసి సమయం వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. చెక్ పోస్టుల్లో సిబ్బంది సంఖ్యను కూడా వెంటనే పెంచుతాం. 12 నుంచి 14 మంది సిబ్బందిని అదనంగా నియమించి మూడు షిఫ్టుల ద్వారా 24 గంటలు చెక్ పోస్టు నడిచే ఏర్పాటు చేస్తాము. తనిఖీల విషయంలో మాత్రం వెనక్కి తగ్గే పరిస్థితి లేదు.

ప్రభుత్వ నిబంధనల మేరకు బియ్యం రవాణా చేసుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటాం. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసుకుని రేషన్ బియ్యం నేరుగా పోర్టుకి తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. ఇది వ్యక్తిగత కక్ష సాధింపు కాదు. కాకినాడ పోర్టులో ఇలాంటి అక్రమాలు ఆగాలన్నదే మా ఉద్దేశం. ఎక్కడా హమాలీలకు నష్టం కలగకుండా చూస్తాం.. ప్రక్షాళణలో భాగంగా కొన్ని సందర్భాల్లో కొంత జాప్యం జరగవచ్చు ఆలోచనా విధానంలో మంచి పరిపాలన అందిరికి అందేలా చూడాలన్న ఉద్దేశంతో మేందుకు వెళ్తున్నాం. ప్రభుత్వపరంగా న్యాయబద్ధంగా చేయాల్సినవి చేస్తాం. ఎవరి వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని అన్నారు.

### పోర్టు చెక్ పోస్టు పనితీరు పరిశీలన

కలెక్టరేట్లో సమావేశం అనంతరం కాకినాడ పోర్టు బొంబాయి గేటు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు పని తీరుని మనోహర్ పరిశీలించారు. లోడుతో వచ్చే వాహనాలను లోనికి అనుమతించే విధానం, బరువు కొలిచే విధానంతో పాటు బియ్యం శాంపిల్స్ సేకరణ తదితర అంశాలపై అధికారులను ఆరా తీశారు. చెక్ పోస్టు కారణంగా లారీల రవాణా ఆలస్యం అవుతున్న నేపథ్యంలో అదనంగా మరో రెండు చెక్ పోస్టుల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. వచ్చే సోమవారంలోపు మరో రెండు చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని ఆధికారులను ఆదేశించారు.

మంత్రితో పాటు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండీ వీరపాండ్యన్, కలెక్టర్ షాన్ మోహన్, పోర్టు అథారిటీ అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లు ప్రారంభం.. శుభ సూచికం

- ఎమ్మెల్యే బోండా ఉమా

విజయవాడ, మహానాడు:

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ప్రారంభం అవుతుండడం శుభ సూచికమని సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యుడు, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బోండా ఉమా అన్నారు. 58వ డివిజన్ సింగ్ నగర్‌లో మంగళవారం మధ్యాహ్నం 12:30 గం లకు అన్న క్యాంటీన్ దగ్గర ఉమా నాయకత్వంలో, బాలాజీ కన్స్ట్రక్షన్స్ దొడ్ల చిన్నారావు ఆధ్వర్యంలో 250 మందికి మంది పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా బోండా ఉమామహేశ్వర రావు పాల్గొని స్వయంగా భోజనాలు వడ్డించిన అనంతరం మాట్లాడారు.

సెంటర్ నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా 2014 నుండి 2019 వరకు చంద్రబాబు నాయకత్వంలో దివంగత నందమూరి తారకరామారావు పేరుతో పేదలు ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళల ఆకలి తీర్చేందుకు పౌష్టిక ఆహారం రూపంలో మధ్యాహ్నం భోజనం రూపంలో కేవలం 5.రూ లతో రోజుకి 15 రూపాయలతో భోజనం పెట్టిన చరిత్ర తెలుగుదేశం పార్టీదే అని అన్నారు.

2019 నుండి అధికారంలోకి వచ్చినటువంటి జగన్మోహన్ రెడ్డి పేదల నోటి కాడ కూడుని లాగేసి, తినడానికి తిండి దొరకకుండా చేసిన అసమర్ధ పాలనతో ప్రజలకు నరకం



చూపించారని విమర్శించారు. సెంట్రల్ నియోజకవర్గంలో గతంలో ఆరు అన్నా క్యాంటీన్లు ఉండేవన్నారు. ఆగస్టు 15న తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్ ను ప్రారంభించి పేదలకు అందుబాటులో మూడు పూటలా భోజనం ఏర్పాటు అవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సెంట్రల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, పిరియ సోమేశ్వరరావు, సాంబ్రాణి అమర్నాథ్, సత్యాల చిన్నారవు, బత్తుల కొండ, పైడి శ్రీను, దాసరి ఉదయశ్రీ, దాసరి దుర్గారావు, సర్వేపల్లి అమర్నాథ్, పత్రి శ్రీనివాస్ (చిన్న), దొట్ట మురళి, పి.మురళీకృష్ణ, విరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో జేసీ, సీనియర్ అసిస్టెంట్!

- రూ.8 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

రంగారెడ్డి, మహానాడు:

ఏసీబీ వలలో పెద్ద చేప, చిన్న చేప పడ్డాయి. వివరాలివి. ధరణి వెబ్ సైట్లో ప్రొహిబిటెడ్ లిస్ట్ నుండి 14 గుంటల భూమిని తొలగించాలని జక్కిడి ముత్యంరెడ్డి కోరారు. అయితే, ఈ పనికి రూ. 8 లక్షలు కావాలని సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు జక్కిడి ముత్యంరెడ్డి అవినీతి నిరోధక శాఖను సంప్రదించగా, ఏసీబీ అధికారులు ట్రాప్ చేశారు. అసిస్టెంట్ మధుమోహన్ రెడ్డికి బాధితుడు కారులో లంచం ఇస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి చెబితేనే తాను డబ్బులు తీసుకున్నట్టు ఏసీబీకి సీనియర్ అసిస్టెంట్ తెలిపారు. దీంతో అధికారులు ఘటనా స్థలం



నుంచే జేసీకి ఫోన్ చేయించారు. పెద్ద అంబర్ పేట ఔటర్ రింగ్ రోడ్డువద్దకు డబ్బులు తీసుకురావాలని ఫోన్లో జాయింట్ కలెక్టర్ సీనియర్ అసిస్టెంట్ కు చెప్పారు. పెద్ద అంబర్ పేట వద్ద జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డికి సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్ డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేశారు.

9
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 14, ఆగస్టు 2024

# ప్రతి అడుగులోనూ బాబు మోసం..

- మన ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంక్షోభం
- అయినా ఏనాడూ సాకులు చూపలేదు
- రెండున్నర నెలల్లోనే ప్రభుత్వం వ్యతిరేకత
- విత్తనాల కోసం రైతులు క్యూలో నిలబడాల్సి వస్తోంది
- ఇ-క్రాప్, ఉచిత పంటల బీమా లేకుండా పోయాయి
- హామీలు అమలు చేయకుండా చంద్రబాబు సాకులు చెబుతున్నారు
- ఏదీ శాశ్వతం కాదు. చీకటి తర్వాత వెలుతురు తప్పదు
- ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాడుగుల, అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాలకు చెందిన ఎంపీటీసీ, జడ్పీటీసీలతో మాజీ సీఎం వైయస్ జగన్



తాడేపల్లి,మహానాడు: గత ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్నెన్నో హామీలు ఇచ్చిన చంద్రబాబు, ఇప్పుడు వాటిలో ఏవీ అమలు చేయకుండా, ఏవేవో కారణాలు చెబుతున్నారు. సాకులు చూపుతున్నారు. అది చంద్రబాబుగారి నైజం. మోసం చేయడం ఆయనకు ఎప్పుడూ అలవాటు.

మన ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్థిక సంక్షోభం ఉన్నా మనం సాకులు చూపలేదు. మాట తప్పకుండా మేనిఫెస్టో అమలు చేశాం. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించాం. ఎన్నికల్లో ఇచ్చిన మాట కోసం కట్టుబడి పని చేశాం. అలా అన్నీ చేశాం కాబట్టే.. ఇవాళ్టికి కూడా మన పార్టీ ప్రతి నాయకుడు, కార్యకర్త తలెత్తుకుని ధైర్యంగా ప్రతి గ్రామానికీ పోగలుగుతాడు

ఆ ధైర్యం చంద్రబాబులో, ఆయన పార్టీలో కనిపించదు. ఎందుకంటే, ఓట్లు అడిగేటప్పుడు నీకు రూ.15 వేలు, నీకు రూ.18 వేలు సంతోషమా? అంటూ ప్రచారం చేశారు. యువకులు కనిపిస్తే.. నీకు రూ.3 వేల నిరుద్యోగభృతి అన్నారు. అవ్వాతాత కనిపిస్తే నీకు నెలకు రూ.4 వేలు ఇస్తాం. సంతోషమా? అంటూ ఎవరు కనిపిస్తే వారికి వాగ్దానాలు చేశారు.

జగన్ బాగానే చూసుకున్నాడు. జగన్ కన్నా చంద్రబాబు వయసులో పెద్దవాడు కదా.. జగన్ పలావు పెట్టాడంటే చంద్రబాబు బిర్యానీ పెడతాడేమో అని ప్రజలందరూ కాస్తా కూస్తో మోసపోయి అటు వైపు వెళ్లారు. కేవలం రెండున్నర నెలల్లోనే ప్రభుత్వం మీద ఇంత వ్యతిరేకత కనిపిస్తోంది. ఇంటికే వచ్చే పెన్షన్ విధానం పోయింది. ఇంటికే వచ్చే రేషన్ విధానం పోయింది. మళ్లీ జన్మభూమి కమిటీలు వచ్చాయి. విత్తనాల కోసం రైతులు క్యూలో నిలబడాల్సి వస్తోంది. ఇ-క్రాప్, ఉచిత పంటల బీమా పోయింది.

చేసిన మంచి ఎక్కడికీ పోదు. మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి ఈ మంచే మనకు శ్రీరామ రక్ష. చంద్రబాబు చేస్తున్న మోసాలు ప్రజల ఆగ్రహానికి దారి తీస్తాయి. ఎందుకంటే ప్రజలకు ఇప్పుడు పలావు లేదు. బిర్యానీ లేదు. పస్తులుండాల్సిన పరిస్థితి.

ఇప్పుడు అదే జగన్ ఉండి ఉంటే.. రైతు భరోసా అందేది. రైతుభరోసా డబ్బులతో రైతులందరూ చక్కగా వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండేవారు. స్కూళ్లకు వెళ్తున్న పిల్లల తల్లులకు అమ్మ ఒడి అందేది. అక్కచెల్లెమ్మల ముఖంలో చిరునవ్వు కనిపించేది. వారికి సున్నా వడ్డీ ప్రయోజనం అంది ఉండేది. విద్యాదీవెన కింద ప్రతి పిల్లాడికి మూడు నెలలకోసారి ఆర్థిక సాయం అందేది. వసతి దీవెన వచ్చేది. మత్స్యకార భరోసా, వాహన మిత్ర కూడా వచ్చి ఉండేవి. చేనేతలకు నేతన్న నేస్తం కూడా ఇప్పటికే జమ అయి ఉండేది.

ఇంకా రైతులకు ఉచిత పంటల బీమా అమలై ఉండేది. ఇప్పుడు ఈ ప్రభుత్వం ఆ ప్రీమియం కట్టడం లేదు. గతంలో ఏప్రిల్, మేలో ప్రీమియం కట్టేవాళ్లం. జూన్‌లో వ్యవసాయ పనులు మొదలయ్యేసరికి ఇన్సూరెన్స్ డబ్బులు, రైతు భరోసా



డబ్బులు ఇచ్చేవాళ్లం. పెట్టుబడులకు రైతులకు సహాయంగా ఉండేది. ఇప్పుడు అదీ పోయింది. అవేవీ ఇవ్వకుండా చంద్రబాబు ఇప్పుడు మోసం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం ప్రతి అడుగులో మోసం కనిపిస్తోంది. విద్యాకానుక పంపిణీ కూడా అస్తవ్యస్తం. ట్యాబ్‌లు ఇస్తారన్న నమ్మకం లేదు. గోరుముద్ద (మధ్యాహ్న భోజనం) మెనూ కూడా అస్తవ్యస్తంగా మారింది.

ఆరోగ్యశ్రీ కింద ఒక్క పైసా ఇవ్వడం లేదు. ఇప్పటికే రూ.1600 కోట్ల బకాయిలు ఉన్నాయి. మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో.. బిల్లులు ఆపాల్సి వచ్చింది. కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఆరోగ్యశ్రీకి ఒక్క రూపాయి ఇవ్వలేదు.

వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పరిపాలన, ఇంటికే అందే డెలివరీ మెకానిజమ్‌తో పాటు, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి.

మళ్లీ మన పార్టీ ఘన విజయం సాధిస్తుంది. ఎందుకంటే మనం ఎవరినీ మోసం చేయలేదు. ఎలాంటి అబద్ధాలు చెప్పలేదు. ఈ ఐదేళ్లలో వేధింపులకు గురి చేస్తారు. కష్టాలు కూడా ఉంటాయి. నా పరిస్థితులే దీనికి ఉదాహరణ. నన్ను 16నెలలు జైల్లో పెట్టారు. అటువంటి కష్టాలు నేను చూశాను.

కానీ కష్టాలు ఎల్లకాలం ఉండవు. చీకటి తర్వాత వెలుతురు కచ్చితంగా వస్తుంది. ఇది సృష్టి సహజం. రాత్రి తర్వాత పగలు వస్తుంది. అలాగే ఈ ఐదేళ్లు కూడా ముగుస్తాయి. మనమే అధికారంలోకి వస్తాం. మన ప్రభుత్వంలో మరలా మీరు, నేను ప్రజలకు సేవ చేసే గొప్ప పరిస్థితుల్లో అందరం ఉంటాం. ఇది కచ్చితంగా అందరూ గుర్తు పెట్టుకోండి.

మోసాలకు, అబద్ధాలకు చంద్రబాబునాయుడు, టీడీపీ అలవాటు పడింది. అదే మనం విలువలు, విశ్వసనీయత మీదే రాజకీయాలు చేస్తున్నాం. అందుకే తప్పక మంచి రోజులు వస్తాయి.

# ఆదాని మోదీ బినామీ

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి



ఢిల్లీ,మహానాడు: ఆదాని మోదీ బినామీ అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం పై ఇక్కడ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆమె విలేఖర్లకు వివరాలు అందించారు. దేశ వ్యాప్త కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్ ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ఇటీవల పార్లమెంట్ లో బిజెపి అనుసరించిన వైఖరి మీద చర్చ జరిగింది. సవివరంగా, ప్రజాస్వామ్య బద్ధంగా అందరి అభిప్రాయాలను గౌరవించే సంప్రదాయం ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే ఉంది.

బీజేపీ ఏకపక్ష నిర్ణయాలపై దేశ వ్యాప్త పోరాటాలకు సిద్ధం అవుతున్నాం. బీజేపీ మైనారిటీల మనోభావాలను దెబ్బ తీసింది. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ మీద బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుంది. వక్ఫ్ చట్ట సవరణ మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయి. భారత రాజ్యాంగాన్ని బీజేపీ గౌరవించడం లేదు. సెబీ ఆదాని అంశం ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. సెబీని తన గుప్పెట్లో పెట్టుకొని ఆదానిని కాపాడుతున్నారు. కులగణనపై కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి నుంచి పోరాటాలు చేయబోతోంది. కులగణన అంశంపై పార్లమెంట్ లో కాంగ్రెస్ లెవనెత్తింది. అవినీతి రహిత పాలన అంటూ బీజేపీ గొప్పలు చెప్తుంది, కానీ ఆదాని- మోడీల అవినీతిని రాహుల్ గాంధీ ఎప్పుడో ఎండగట్టారు. ఆదాని మోడీ గ్రూప్, ఆదాని మోడీ బినామీ. ఆదాని ని కాపాడే విషయంలో మోడీ చేస్తున్న ప్రయత్నాలను ఎండగడతాం. క్షేత్రస్థాయిలోకి బీజేపీ అవినీతిని తీసుకెళ్లే కార్యాచరణ ఉండబోతుంది.



# కన్నాకు టీడీపీ నేతల జన్మదిన శుభాకాంక్షలు

మాజీ మంత్రి, సత్తెనపల్లి శాసనసభ సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణని వారి జన్మదిన సందర్భంగా వారి స్వగృహంలో పశ్చిమ శాసనసభ్యురాలు గల్లా మాధవి తెలుగుదేశం నాయకులు వెంకటేష్ యాదవ్ తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. కన్నాకు మొక్కను బహూకరించి కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- గుంటూరు, మహానాడు

# ఉన్నత విద్యారంగంలో సంస్కరణలకు సహకారం

- మంత్రి లోకేష్ ను కలిసిన సింగపూర్ వర్సిటీ ప్రొఫెసర్ బీవీఆర్ చౌదరి



అమరావతి, మహానాడు: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగంలో మెరుగైన విద్యా ప్రమాణాలు, ర్యాంకింగ్స్ మెరుగుదల, సంస్కరణల అమలుకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ ఎంవిఆర్ చౌదరి చెప్పారు. ఉండవల్లి నివాసంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ను ప్రొఫెసర్ చౌదరి మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని యూనివర్సిటీల పనితీరు మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయనతో చర్చించారు. రీసెర్చి, ఇన్నొవేషన్స్ లో వెనుకబడి ఉండటమే ఎపిలో ర్యాంకింగ్స్ తగ్గుదలకు కారణమని, వీటిని మెరుగుపరిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ప్రొఫెసర్ చౌదరి పేర్కొన్నారు.

ఇంటర్నేషనల్ ఎక్స్పోజర్ తేవడానికి అవసరమైన పాఠ్యాంశాల మార్పులు, ఇతర విధానాలను ఎపి వర్సిటీలతో పంచుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. దీనిద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎపి యూనివర్సిటీలకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యారంగ నిపుణులు, విద్యార్థులు తమ యూనివర్సిటీని సందర్శించి సింగపూర్‌లో అవలంభిస్తున్న పద్ధతులను అధ్యయనం చేయాలని చౌదరి ఆహ్వానించారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ... రాష్ట్రంలో యూనివర్సిటీ ర్యాంకింగ్ మెరుగుదలకు యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ సహాయ, సహకారాలు తీసుకుంటామని చెప్పారు. ప్రొఫెసర్ చౌదరి నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో స్ట్రాటజిక్ ఇండియా అండ్ ఇనిషియేటివ్స్ విభాగానికి సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌గా పనిచేస్తున్నారు.




# రోడ్ల నిర్మాణాల్లో సరికొత్త సాంకేతికతను జోడించండి

- రూరల్ డెవలప్ మెంట్, పంచాయతీ రాజ్ అధికారులతో మంత్రి పెమ్మసాని

హైదరాబాద్, మహానాడు: ఒకప్పుడు ఏపీ, తెలంగాణలో జరిగిన అభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రాలు కాపీ కొట్టేవి. తిరిగి ఆ రోజులు రావాలి... అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. హైదరాబాద్ లో గల ఎన్ ఐ ఆర్ డి పీ ఆర్(నేషనల్ ఇన్స్ టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలపమెంట్, పంచాయతీ రాజ్) ఇన్స్ టిట్యూట్ లో మంగళవారం జరిగిన 66వ జనరల్ కౌన్సిల్ సమావేశానికి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, గ్రామీణాభివృద్ధి శాఖ మరో కేంద్ర సహాయ మంత్రి అయిన కమలేష్ పాశ్వాన్‌తో కలిసి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా సంబంధిత కేంద్ర, రాష్ట్ర శాఖాధికారులతో కలిసి రోడ్ల నిర్మాణాలపై పెమ్మసాని పరిశీలన జరిపారు. రహదారుల నిర్మాణాలకు సంబంధించి అధికారులు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అవలంబిస్తున్న విధానాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. నల్లరేగడి, ఎర్ర రేగడి నేలలపై జరుపుతున్న నిర్మాణాలపై అధికారులు పలు వివరాలు అందజేశారు. అలాగే నూతన సాంకేతిక విధానాలైన ప్లాస్టిక్ వేస్ట్ ను ఉపయోగించి, ఎఫ్.డి.ఆర్ టెక్నాలజీతో నిర్మిస్తున్న పద్ధతులను పెమ్మసాని గారికి అధికారులు వివరించారు.

అనంతరం రోడ్ల నిర్మాణాలలో సహజంగా ఎదురవుతున్న ఇబ్బందులు, అవకతవలపైనా అధికారులను వివరాలు అడగ్గా, అధికారులు పలు సమస్యలు, పరిష్కారాలను వివరించారు. పెమ్మసాని మాట్లాడుతూ అందుబాటులో ఉన్న టెక్నాలజీతో పాటు సరికొత్త సాంకేతికతను కూడా ఉపయోగించి రహదారుల నిర్మాణాలను చేపట్టాలని, ఆలోచన విధానాల్లో ఇతర రాష్ట్రాలకు మనం ఒక ప్రత్యామ్నాయంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ, ఏపీ మరియు తెలంగాణకు చెందిన రూరల్ డెవలప్ మెంట్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు.

# ఉచిత ఇసుకకు ధర కడితే కఠిన చర్య

- కలెక్టర్ నాగలక్ష్మి


గుంటూరు, మహానాడు: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు తిరిగి అమ్మకాలు చేసే వారి వాహనాలు సీజ్ చేయడంతో పాటు భారీగా అపరాధ రుసుం విధిస్తామని, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం కొల్లిపర మండలంలోని మున్నంగి ఇసుక స్టాక్ యార్డును కలెక్టర్ నాగలక్ష్మి తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

స్టాక్ యార్డ్ వద్ద పేమెంట్లు వసూలు చేస్తున్న సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. పేమెంట్ చెల్లించిన తర్వాత ఇసుక లోడుకు రసీదులు అందించే స్వయం సహాయక సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రసీదు పుస్తకాలు పరిశీలించి ఎక్కువ రసీదులలో వినియోగదారుడు, ఇసుక సరఫరా చేసే వాహనదారుని ఫోన్ నెంబర్లు ఒకటే ఉండటం గుర్తించి ఇక నుంచి కచ్చితంగా వినియోగదారుల ఫోన్ నెంబర్ నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ యార్డు వద్ద నిర్వహణ విధులు నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘంకు టన్నుకు పది రూపాయిలు అందిస్తున్నారని, బాధ్యతగా పనిచేయాలన్నారు.

రసీదులో వినియోగదారుల పూర్తి వివరాలు నమోదు చేయాలని అవసరమైతే వాహనదారులు తెచ్చిన వినియోగదారునికి ఫోన్ చేసి చెక్ చేయాలన్నారు. ప్రతి రోజు జరిగిన లావాదేవీల వివరాలను ఎక్సెల్ షీట్ లో నమోదు చేయాలన్నారు. రసీదు నమోదు కేంద్రం వద్ద ఉన్న వాహన డ్రైవర్లతో కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు చెప్పిన ప్రకారం వారి ఆధార్ కార్డు ఇతర వివరాలు, ఫోన్ నెంబర్ తో సహా అందించి ఇసుకను తీసుకువెళ్లాలని తెలిపారు.

వినియోగదారులు పేరు చెప్పి ఇసుకను తీసుకొని అధిక ధరలకు విక్రయించినట్లు గుర్తిస్తే వాహనదారుల వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ ఎత్తున జరిమాన విధిస్తామని హెచ్చరించారు.

ఇటీవల ఇసుక డెలివరీ తీసుకున్న వినియోగదారుల వివరాలను రసీద్ పుస్తకంలో పరిశీలించి కొంత మందికి తహశీల్దారుతో కలెక్టర్ ఫోన్ చేయించారు. వారు ఇసుక తీసుకున్న



అవసరం, టన్నులు, ధర తదితర అంశాలను తెలుసుకొని పుస్తకంలోని వివరాలను పరిశీలించారు. నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఇసుకను వినియోగదారులకు సక్రమంగా సరఫరా అయ్యేలా స్టాక్ యార్డులో పనిచేసే ఉద్యోగులతో పాటు సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

ప్రభుత్వం వినియోగదారులకు ఇసుకను ఉచితంగా అందిస్తోందని, కేవలం ఆపరేషన్ చార్జీ కింద ఒక్కో టన్నుకు 250 రూపాయలు మాత్రమే వసూలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ?కార్యక్రమంలో కొల్లిపర తహశీల్దారు సిద్ధార్థ, మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 14, ఆగస్టు 2024

# జోగి రమేష్ కొడుకు రాజీవ్ అరెస్ట్

- జోగి రమేష్ ఇంట్లో ఏసీబీ సోదాలు
- రమేష్ ఇంట్లో కీలక డాంక్యుమెట్ల స్వాధీనం

విజయవాడ,మహానాడు:





మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత జోగి రమేష్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేస్తోంది. ఇబ్రహీంపట్నంలోని రమేష్ నివాసంలో మంగళవారం నాడు తెల్లవారుజామున 15 మంది అధికారుల బృందం రంగంలోకి దిగి సోదాలు చేపట్టింది. రమేష్ ఇంట్లో ఉన్న కీలక డాంక్యుమెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అగ్రిగోల్డ్ భూముల విషయంలో జోగి రమేష్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. చాలామంది బాధితులు ఆయనపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు అధికారుల దృష్టికి రావడంతో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం.

జోగి రమేష్ అవినీతికి పాల్పడినట్లు అధికారులు ఆధారాలు సేకరించారు. ప్రధానంగా ఇసుకతో పాటు పలు భూ అక్రమణలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇటీవల ఆయనపై వరుసగా మీడియాలో కథనాలు వచ్చాయి. అధికారులను బెదిరించి అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించారు. ఈ వ్యవహారాల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

మంత్రి హోదాలో జోగి రమేష్ ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డారు. ఏవిధంగా ప్రభుత్వ నిబంధనలకు కాదని కాంట్రాక్ట్‌లు అప్పగించారనే కీలక విషయాలపై ఏసీబీ అధికారులు అరా తీశారు. ఇప్పటికే కీలకమైన డాంక్యుమెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయానికి సంబంధించి ఇంత వరకు ఏసీబీ అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు.

# విపక్షం గొంతు నొక్కడమే పనిగా ప్రభుత్వం

- జోగి రాజీవ్‌ను విజయవాడలో ఏసీబీ అధికారులు అరెస్టు చేయడంపై మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం,



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ అమలు చేయకుండా, అన్నీ మర్చిపోయిన టీడీపీ కూటమి ప్రభుత్వం, విపక్షం గొంతు నొక్కడం, కక్ష సాధింపు లక్ష్యంగా పని చేస్తోందని మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆక్షేపించారు. మాజీ మంత్రి జోగి రమేష్‌పై కక్ష తీర్చుకోవడానికి అతడి కుమారుణ్ని టార్గెట్ చేయడం దారుణం అని ఆయన అన్నారు.

గత ఎన్నికల ముందు టీడీపీ కూటమి గొప్పగా ప్రచారం చేసిన సూపర్‌సిక్స్ అమలు కోసం అంతా ఎదురుచూస్తున్నారని, అయితే వాటిని అమలు చేయని ప్రభుత్వం, ప్రజల దృష్టి మళ్లించడం కోసం బీసీలు టార్గెట్‌గా ఇవన్నీ చేస్తోందని ఆయన ఆక్షేపించారు. బలహీనవర్గాల్లో ఎదిగిన నాయకులను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బలహీన వర్గాలను అణచి వేయడం ద్వారా అసలు ఎలాంటి లబ్ధి పొందాలనుకుంటున్నారని మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ నిలదీశారు.

## టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో

# జగన్ ప్రభుత్వం భారీ స్కాం

- సుమారు రూ.700 కోట్ల టీడీఆర్ బాండ్ల అవినీతి
- జగనే ప్రధాన సూత్రదారి
- సిఐడి విచారణ జరుగుతుంది
- మాజీ మంత్రి కారుమూరి, బాధ్యులైన అధికారులకు శిక్ష తప్పదు
- ఎమ్మెల్సీ దువ్వాడ రాజీనామా చేస్తారా? జగనే సాగనంపుతారా?
- అగ్రిగోల్డ్ ఆస్తుల మేతలో మాజీమంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ ఎ2.
- వైసీపీలో చాలామంది 420 లు ఉన్నారు
- నాడు శాసనమండలి వద్దన్న జగన్ బొత్సాను మండలికి ఎలా పంపిస్తారు?
- రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్రంలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతాం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం,మహానాడు:



వైసీపీ పాలనలో రూ. 700కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అసలు సూత్రధారి అని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆరోపించారు. ఈ స్కాంలో విషయంలో మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు కీలకపాత్ర పోషించినప్పటికి తెరవెనుక అసలుకథనడిపింది జగనే అనేది వాస్తవమన్నారు. టీడీఆర్ బాండ్ల స్కాంపై సీఐడి విచారణ జరుగుతుందని, అధికారులతోసహా దీనికి బాధ్యులైన వైసిపి వారందరికి శిక్ష తప్పదని అన్నారు.

మంగళవారం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మీడియాతో మాట్లాడుతూ టీడీఆర్ బాండ్ల దోషులను తమ ప్రభుత్వం వదిలే ప్రసక్తి లేదన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు కుటుంబం పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి గౌరవంగా అతనితో రాజీనామా చేయించి ఇంటికి పంపాలని సూచించారు.

పెద్దల సభలో ఉన్నవారే ఈ మధ్య కాలంలో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, రేపు పెద్దలసభలోకి దువ్వాడ శ్రీనివాస్ ఏ ముఖం పెట్టుకొని వచ్చి సమాధానం చెబుతానని ప్రశ్నించారు. అసలు దువ్వాడ కాని, జగన్ కాని సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నిలదీశారు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ వైసీపీకి సమాధి కట్టారని, ఇప్పుడు దువ్వాడ వ్యవహారంతో ఆ పార్టీ ప్రజల్లో మరింత దిగజారిందన్నారు. ఆనాడు శాసనమండలి వద్దని రద్దు చేస్తామని చెప్పిన జగన్ ఇప్పుడు బొత్స సత్య నారాయణను శాసనమండలి ఎన్నికల్లో పోటీకి ఎలా నిలబెడుతున్నారని ప్రశ్నించారు.

పెద్దలసభకు ఇలాంటివారంతా అవసరమా అన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాహా చేసిన కేసులో మాజీమంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ ఎ2 అని, అగ్రిగోల్డ్ ఆస్తులు పందికొక్కుల్లా మేసేశారని మండిపడ్డారు. నాటి జగన్ పాలనలో మంత్రులంతా ఇలాంటి వారేనని, ఒకమంత్రిగంటా అరగంటా అని అసభ్యంగా మాట్లాడారని గుర్తు చేశారు. వైసీపీ వారిలో చాలామంది 420 లని ఆరోపించారు. వారంతా చేసిన అవినీతి ఒకటొకటిగా బయటకు వస్తున్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు.

నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అనేనానుడి వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డికి అక్షరాల సరిపోతుందన్నారు. 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చిన తనకు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదా కట్టబెట్టాలంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి లేఖ రాయడం హాస్యాస్పదమని విమర్శించారు. ఆ లేఖలో తన రాజకీయ అజ్ఞానాన్ని జగన్ ప్రదర్శించారని, ప్రతిపక్ష నేత హోదా పొందాలంటే 10 శాతం సీట్లు పొందాలన్న నిబంధన ఎక్కడా లేదు కదాఅని స్పీకర్ ను ప్రశ్నించడం విడ్డూరమన్నారు.

రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిని రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆసుపత్రికి వచ్చేవారికి మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తామన్నారు. పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు.. వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అవగాహన లేక ఈ ఆసుపత్రిని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తామని,బేబీ కిట్లు మళ్ళీ ఇస్తామని చెప్పారు. నెలకో,పదిహేను రోజులకొకసారి ఆసుపత్రిని సందర్శించాలనుకంటే వారానికి ఒకసారి రమ్మని రోగులు అడుగుతున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు.

ఆసుపత్రి కమిటీ వేస్తున్నామని, గత ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని కమిటీ సమావేశానికి ఆహ్వానించే వారుకాదని తెలిపారు. సదరన్ సర్టిఫికేట్ల విషయంలో కలెక్టర్ శ్రద్ధ తీసుకుని వారికి న్యాయం చేస్తున్నారని అన్నారు. వారందరికీ రూ. 15 వేలు పెన్షన్ వచ్చేలా చూస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్ అడిగేవారి సంగతి తేల్చుతానని హెచ్చరించారు. కిడ్నీ బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

రుడాలో జరిగిన అవకతవకల గురించే కాదు,ఎక్కడ తప్పు జరిగినా చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు. నామవరంలో 1200 గృహాలు త్వరలో ఇస్తామని మంత్రి నారాయణ చెప్పారని తెలిపారు. జనప్రియ లే అవుట్ లో ఫ్రీ హోల్డ్ పేరుతో భూములను దోచేశారుని ఆరోపించారు. ఇకవారి దందాలు సాగనివ్వకుండా చూస్తామని హెచ్చరించారు.

అనంతరం ఆయన ఆసుపత్రికి వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యలుతెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీడీపీ నాయకులు మరుకుర్తి రవి యాదవ్, మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, కడలి రామకృష్ణ, కొత్తల వీర వెంకట రామ కిషోర్, హరి బెనర్జీ, సలాది ఆనంద్, పొలకి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డాక్టర్లు, సిబ్బంది వైఖరిలో మార్పు రావాలి

- వైద్య సేవల కోసం ప్రభుత్వాసుపత్రులు ప్రజల మొదటి ఎంపికగా మారాలి
- ఆసుపత్రుల నిర్వహణ, సేవల నాణ్యత మెరుగుపడాలి
- మార్పు కోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల్ని పటిష్టంగా అమలు చేయాలి
- పరిసరాల పరిశుభ్రత, సమయ పాలన, జవాబుదారీ తనంతో ప్రజల మెప్పు పొందవచ్చు
- గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యంతో గాడితప్పిన ప్రభుత్వాసుపత్రులు
- రెండేళ్లలో సమగ్ర మార్పులు తెస్తామన్న ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్
- ప్రభుత్వాసుపత్రులు, వైద్య కళాశాలలకు ఇక నుండి రేటింగ్
- ఏడు గంటల పాటు సాగిన సమీక్షా సమావేశం

అమరావతి:మహానాడు:

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ సరిగా లేకపోవడంతో అనేక సమస్యలు పేరుకుపోయాయని వాటిని పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

ప్రభుత్వాసుపత్రులకు సైతం ఆరోగ్యశ్రీ నిధులు జగన్మోహన్ రెడ్డి హయాంలోని ప్రభుత్వం బకాయిపడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

మంగళగిరి ఎపిఐఐసి టవర్స్‌లో ఆయన రాష్ట్రంలోని అన్ని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు,ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రుల్లో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించే దిశగా ఈ సమాలోచన సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ వేలాది కోట్ల రూపాయలు ఆరోగ్య శ్రీ నెట్వర్క్ ఆసుపత్రులకు బకాయిపడిన వైసిపి ప్రభుత్వం చివరికి ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా బకాయపడిందని, ఒక్క విజయవాడ జిజిహెచ్ కే రూ. 23 కోట్ల రూపాయలు బకాయిపడిందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ, సేవల్లో ఎదురవుతున్న లోటుపాట్లను సరిదిద్దాల్సిన అవసరముందని మంత్రి తెలిపారు.

## వైఖరి మారాలిః మంత్రి సత్యకుమార్ యాదవ్

వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ముఖ్యంగా డాక్టర్లు తమ వ్యవహారశైలిని మార్చుకోవాలని, సమయపాలన పాటించాలని అన్నారు. నర్సింగ్ సిబ్బందికి సరైన శిక్షణ కూడా అవసర మన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు క్లినికల్ అటాచ్‌మెంట్ ఉన్న నర్సింగ్, ఫార్మసీ కాలేజీల విద్యార్థుల్ని ఓపీ సేవలు మెరుగుపర్చడంలో వినియోగించే దిశగా ఈ సమావేశంలో చర్చించామన్నారు.

అలాగే పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, ఇతర సంస్థల సేవల్ని ప్రభుత్వ వైద్య సేవల పట్ల రోగుల అభిప్రాయాన్ని తెలుసు కోవడంలో భాగస్వామ్యం కల్పించాలని మంత్రి సూచించారు. అలాగే ప్రభుత్వాసుపత్రుల్లో కూడా ఆరోగ్య బీమా ఉన్న వారికి వైద్యం అందించే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు,




సైనేజీ బోర్డులు లేకపోవడం, శానిటేషన్ సరిగా లేక పోవడం, చివరికి బాత్రూంలు, టాయిలెట్ల నిర్వహణ లేకపో వడం, కొన్నిటికైతే తలుపులు కూడా లేకపోవడం, విజయవాడ, కాకినాడ, వైయస్సార్ కడప ప్రభుత్వాసుపత్రుల్లో తాగునీటికి ఇబ్బందులు, తాగునీటిలో ఫ్లోరైడ్ ఉండడం వంటి సమస్యలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయన్నారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి స్వంత జిల్లాలోని కడపరిమ్స్ ఊరికి దూరంగా ఉండడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి సత్యకుమార్ అన్నారు.

ఈ విషయంలో ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవడంలో గత ప్రభుత్వం విఫలయమయ్యిందన్నారు. ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ ఓ ల కొరతతో పాటు ఇతర సిబ్బంది కొరత, కింది స్థాయిలో అవినీతి వంటి అంశాలు కూడా చర్చకొచ్చాయన్నారు. చేతులు తడిపితే తప్ప స్ట్రెచర్ కూడా కదలని దుస్థితి నుండి రోగుల్ని కాపాడి మెరుగైన సేవలందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో మాట్లాడామన్నారు. వైద్య ఆరోగ్య శాఖను పూర్తిగా ప్రక్షాళన చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోందని, గత అనుభవాల్ని దృష్టిలో ఉంచుకుని ఏరకమైన చర్యలు తీసుకుంటే రోగులకు చేరువవుతామన్న దిశగా ఈ సమాలోచన సమావేశం చర్చించామన్నారు.

ప్రస్తుతం 54 మహాప్రస్థానం వాహనాలు అందుబాటులో ఉన్నాయని మరో 30 వాహనాల్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకరించారని మంత్రి తెలిపారు. కొన్ని ఆసుపత్రుల్లో ఎలక్ట్రికల్ సమస్యలతో పాటు , యుపియస్ , ఎసిల సమస్యలు కూడా నెలకొన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఎక్స్‌రే, సిటి స్కాన్ యంత్రాలు లేకపో వడం, ఉన్నా నిర్వహణ సరిగాలేకపోవడం వంటి సమస్యలు కూడా సమావేశంలో చర్చకొచ్చాయన్నారు. మరికొన్ని ఆసుపత్రుల్లో డ్రైనేజీ నిర్వహణ సరిగా లేకపోవడం కూడా దృష్టికి వచ్చిందన్నారు.

## ఓపీ రిజిస్ట్రేషన్ అరగంటలో జరగాలి

మేథోమధన సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో ఓపీలో రోజూ 2 వేల నుండి 3 వేల వరకు తాకిడి ఉంటోందని, కొన్ని సందర్భాల్లో 4 వేలు కూడా ఉంటోందన్నారు. ఓపీ రిజిస్ట్రేషన్ అరగంటలోపే జరిగేలా తగు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఉదయం ఏ డాక్టరైతే ఓపీ చూస్తారో రిపోర్టులొచ్చాక మధ్యాహ్నం కూడా అదే డాక్టర్ రోగుల్ని చూసేలా విధానాన్ని రూపొందించాలన్నారు.

ఆసుపత్రుల సూపరింటెండెట్లు ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించి పనిచేస్తున్నారని, కొన్ని విజయగాథలు కూడా ఉన్నాయని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏ రకమైన మార్పుల్ని తీసుకురాగలం, ప్రజలు మన గురించి ఏమనుకుంటున్నారు, ప్రజల నుండి గుర్తింపు ఎందుకు రావడంలేదు, ప్రభుత్వాసుపత్రుల్ని చివరి ఆప్షన్‌గా ఎందుకు తీసుకుంటున్నారు వంటి అంశాల్ని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ వైద్య సేవల పట్ల ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడేలా స్వల్ప , మధ్య, దీర్ఘ కాలిక ప్రణాళికలు రచించి అమలు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రులు అందిస్తున్న వివిధ రకాల సేవల వివరాల్ని మీడియాకు క్రమం తప్పకుండా వివరించాలని మంత్రి సూచించారు.

ప్రస్తుతం అనుసరిస్తున్న విధానానికి భిన్నంగా ఆసుపత్రుల నిర్వహణ, వైద్య సేవలు అందించడానికి నడుం కట్టాలని డాక్టర్లకు మంత్రి పిలుపునిచ్చారు.

ఆసుపత్రుల లోపలా, బయటా పరిశుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్ని మొదటి ప్రాధాన్యతా ప్రజలు ఎంచుకునేలా సౌకర్యాలు, సేవల్ని అందించాలన్నారు.

అందుకు ఏంచేయాలో తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి కోరారు. సమయానికి డాక్టర్లు వచ్చేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎంఆర్ ఐ , సిటి స్కాన్లు, వివిధ



పరీక్షలు నిర్వహించే పరికరాలు నిత్యం సరిగా పనిచేసే విధంగా చూడాలని మంత్రి ఆదేశించారు.

## ఫీడ్ బ్యాక్, రేటింగ్‌కు చర్యలు

వైద్య సేవల్ని మెరుగుపర్చే దిశగా పటిష్టమైన ఫీడ్ బ్యాక్ విధానం ఉండాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్ని మౌలిక సదుపాయాలున్నా ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ట్రాన్స్ ప్లాంటేషన్ ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. రోగులు సంతృప్తి చెందేలా ప్రతి ఒక్కరూ తమ పని విధానాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. రాబోయే రెండేళ్లలో ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ, వైద్య సేవల నాణ్యతలో సమూలమైన మార్పుల్ని తీసుకొస్తామన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సెక్యూరిటీ విధానాన్ని పటిష్టంచేయాలన్నారు. పిల్లల్ని ఎత్తుకుపోవడం వంటి సంఘటనలు భవిష్యత్తులో చోటుచేసుకోకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ కేటగిరీల వారిగా వారివారి సేవల్ని గుర్తించేందుకు ప్రోత్సాహకాలు, ప్రశంసలు ఇవ్వడం ద్వారా వారిలో ఉత్సాహాన్ని నింపొచ్చని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వాసుపత్రుల సూపరింటెండెంట్ల పనితీరును మదింపు చేయడానికి పటిష్టమైన విధానాన్ని రూపొందించాలని, అదే రీతిన వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులకు వివిధ అంశాల ప్రాతిపదికన ప్రతి ఏడాదీ రేటింగ్ ఇచ్చి పోటీతత్వాన్ని పెంపొందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.

వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, కార్యదర్శి డాక్టర్ మంజుల, ఎపిఎంఎస్ ఐడి మేనేజింగ్ డైరెక్టర్ మరియు ఎన్టీఆర్ వైద్య సేవ సిఇఓ డాక్టర్ జి.లక్ష్మీశా, డిఎంఇ డాక్టర్ నర్సింహం, రాష్ట్రంలోని అన్ని జిజిహెచ్‌ల మెడికల్ సూపరింటెండెంట్లు, మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఇతర సంస్థల ప్రతినిధులు ఏడు గంటల పాటు జరిగిన మేథోమదన సమావేశంలో పాల్గొన్నారు.

11

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 14, ఆగస్టు 2024

## మల బురద సమస్యను అధికమించేలా

# మొబైల్ సెప్టిక్ ట్రీట్‌మెంట్ యూనిట్

- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు
- గంటకు 6000 లీటర్లను శుద్ధి చేయగల అత్యాధునిక సాంకేతికత



**మహానాడు:** మల బురద శుద్ధి సమస్యను పరిష్కరించే క్రమంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు తెలిపారు. పారిశుద్ధ్య రంగంలో వినూత్న మార్పులు, సరికొత్త పరిష్కారాలను అన్వేషిస్తూ మల బురదను శుద్ధి చేయగలిగిన మొబైల్ సెప్టిక్ ట్రీట్‌మెంట్ యూనిట్‌లను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి జరుగుతుందన్నారు.

ఏ ప్రాంతంలోనైనా సమర్ధవంతంగా పని చేసేలా రూపొందించిన ఈ యూనిట్ పనితీరును మంగళవారం మంగళగిరి తాడేపల్లి పురపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంధం చంద్రుడుకు సంబంధింత సిబ్బంది వివరిస్తూ మా ఈ యూనిట్ గంటకు 6000 లీటర్లను ప్రాసెస్ చేయగల అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉంటుందన్నారు.

మొబైల్ సెప్టిక్ ట్రీట్‌మెంట్ యూనిట్ సేకరించిన మల బురదను శుద్ధి చేసి స్వచ్ఛమైన నీరు, కొంపోస్ట్‌గా విడగొడుతుందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ యొక్క అకాంక్షలకు అనుగుణంగా మల బురదను శుద్ధి చేయటం పర్యావరణ రక్షణకు దోహదపడుతుందన్నారు.

గంధం చంద్రుడు మాట్లాడుతూ.. మొబైల్ సెప్టిక్ ట్రీట్‌మెంట్ యూనిట్‌ల ఆవశ్యకతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రెండు వంతున మనకు కేటాయించిందని, టెండర్ ప్రక్రియను పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తీసుకు రావాలని ఉందని వివరించారు. ఈ యంత్రం అధునాతన సాంకేతికత, అధిక ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని ఉపయోగించడం ద్వారా, మల బురదను వ్యవసాయ వినియోగ సంపదగా మార్చుతుందని గంధం చంద్రుడు వివరించారు.

ఇప్పటికే కేరళలో ఈ యంత్రం మంచి పనితీరును కనబరుస్తుందన్న సమాచారం ఉందని, అన్నివిషయాలను లోతుగా పరిశీలిస్తామని తెలిపారు. స్వచ్ఛ నగరాలు, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల మద్దతు కోరుతున్నామన్నారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతో కూడిన ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించడమే లక్ష్యంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అడుగులు వేస్తుందన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలను సాధించే దిశగా ఆంధ్రప్రదేశ్ పురోగమిస్తున్న తరుణంలో మొబైల్ సెప్టిక్ ట్రీట్‌మెంట్ ప్రాజెక్ట్ వంటి కార్యక్రమాలు శాశ్వతమైన మార్పును తీసుకు వచ్చే అవకాశం ఉందని గంధం చంద్రుడు వివరించారు.

# తెలంగాణ పర్యాటక రంగానికి నూతన జవసత్వాలు

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం
- పర్యాటక బ్రాండింగ్, ప్రమోషన్ పై ఫోకస్
- టూరిజం ప్రమోషన్‌లో అన్ని వర్గాలకు భాగస్వామ్యం
- తెలంగాణ పర్యాటకాభివృద్ధికి చేయూతనివ్వాలని ఐటీ ఉద్యోగులు, యువతకు మంత్రి జూపల్లి పిలుపు
- హరిత హెూటల్స్‌లో ఐటీ ఉద్యోగులకు 15% డిస్కౌంట్
- రహేజా మైండ్ స్పేస్‌లో ఐటీ ఉద్యోగులతో కలిసి డిస్కౌంట్ కూపన్‌ను లాంచ్ చేసిన మంత్రి జూపల్లి



**హైదరాబాద్:,మహానాడు:**

తెలంగాణ పర్యాటక రంగానికి నూతన జవసత్వాలు సంతరించేలా పర్యాటక శాఖ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ప్రపంచ పర్యాటక ముఖ చిత్రంలో తెలంగాణ కీలక స్థానంలో ఉండాలనే సీయం రేవంత్ రెడ్డి అకాంక్షలకు అనుగుణంగా పర్యాటక రంగ అభివృద్ధి, బ్రాండింగ్, ప్రమోషన్ వంటి అంశాలపై దృష్టి పెట్టింది.

ఇందులో భాగంగా రాష్ట్ర పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి, తగు ప్రాచుర్య కల్పించి ప్రోత్సహించేందుకు పర్యా టక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. జిల్లాల్లోని పర్యాటక ప్రదేశాల్లో విస్తృతంగా పర్యటిస్తూ... టూరిజం ప్రమోషన్‌లో సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నారు.

మరోవైపు ఐటీ ఉద్యోగులు, యువత, వివిధ సంఘాలు, స్థానికుల సహకారంతో తెలంగాణ పర్యాటక ప్రాంతాల గురించి విస్తృత ప్రచారం రాబట్టాలని యోచిస్తున్నారు. ఇందులో భాగంగా హైటెక్ సిటీ రహేజా మైండ్ స్పేస్ లో ఐటీ ఉద్యోగులతో మంత్రి జూపల్లి కృష్ణరావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐటీ ఉద్యోగులకు డిస్కౌంట్ కూపన్‌ను లాంచ్ చేశారు. పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వాలని వారిని కోరారు.

టూరిజం ప్రమోషన్‌లో భాగంగా మైండ్ స్పేస్‌లో పని చేస్తున్న ఐటీ ఉద్యోగులకు హరిత హెూటల్స్‌లో 15 శాతం డిస్కౌంట్ అవకాశం కల్పిస్తున్నామని, దీన్ని మరిన్ని ఐటీ కంపనీ ఉద్యోగులకు విస్తరిస్తామని ప్రకటించారు. స్కాన్ కోడ్ లో రిజిస్టరైన ఐటీ ఉద్యోగులు ఈ డిస్కౌంట్ కూపన్ ను వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... తెలంగాణ పర్యాటకానికి విస్తృత ప్రచారం (మార్కెటింగ్) కల్పించి, పర్యాటకులను ఆకర్షించేందుకు తానే స్వయంగా సేల్స్ మెన్ అవతారం ఎత్తి ఇక్కడకు వచ్చానని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి - సంప్రదాయాలు ఎంతో ప్రత్యేకమని, చరిత్ర, వారసత్వ సంపద, ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన జలపాతాలు, జలవనరులు, సెలయేర్లు, దేవాలయాలు, ఎకో టూరిజం, ట్రైబల్ టూరిజం, ట్రైబల్ సంస్కృతి, మెడికల్ టూరిజం లాంటి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని వివరించారు. ఇన్ని వైవిధ్యమైన ప్రదేశాలు ఉన్న తెలంగాణ ప్రాంత పర్యాటక రంగం కనీస ప్రచారానికి కూడా నోచుకోలేదని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో తెలంగాణ పర్యాటకాన్ని కొత్తపుంతలు తొక్కించబోతున్నామని, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్శించేందుకు ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. యాంత్రిక జీవన విధానం నుంచి బయటపడేందుకు పాశ్చత్య దేశీయులు వారంతాల్లో మానసికోల్లాసం, ఆట విడుపు కోరుకుంటారని తెలిపారు. వారానికి లేదా నెలకు ఒక్కసారైనా పర్యాటక ప్రాంతాల్లో పర్యటించాలని పర్యాటకులను కోరారు.

పర్యాటకంలో మన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పర్యాటక ప్రదేశాల్లో తెలంగాణ కళారూపాలను ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అన్ని జిల్లాలలోని పర్యాటక ప్రాంతాల్లో వసతులు కల్పించడం ద్వారా అంతర్గత పర్యాటకాన్ని ప్రోత్సాహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాల అభివృద్ధి వల్ల సందర్శకుల సంఖ్య పెరిగి వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా వివిధ విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్, ఇతర ప్రాంతాల్లో తెలంగాణ పర్యాటక ప్రాంతాల ప్రదర్శించి.. విస్తృత ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. త్వరలోనే పర్యాటక శాఖ కొత్త వెబ్ సైట్ ను లాంచ్ చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్, పర్యాటక శాఖ సంచాలకులు ఇలా త్రిపాఠి, రహేజా గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోనే శ్రవణ్ కుమార్, హైదరాబాద్ సాఫ్ట్వేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మెంబర్ బిపిన్ చంద్ర, ఐటీ ప్రమోషన్ అమరనాథ్ రెడ్డి, ఐటీ ఐద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# పవిత్ర సంగమానికి పూర్వ వైభవం

- కృష్ణా, గోదావరి పవిత్ర సంగమం వద్ద నవ హారతుల పునరుద్ధరణ
- దసరా ఉత్సవాల నాటికి పవిత్ర సంగమం వద్ద నవ హారతులు సిద్ధం
- ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా పవిత్ర సంగమం ప్రాంతంను తీర్చిదిద్దుతాం.
- 50 ఎకరాల భూమి సేకరించి ఆలయ నిర్మాణం చేస్తాం.
- నదికి ఆవల ఉన్న లంక భూములను కూడా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం.
- రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతాం.
- రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, కొలుసు పార్ధసారథి

**విజయవాడ,మహానాడు:**

కృష్ణా, గోదావరి పవిత్ర సంగమం వద్ద నవ హారతులను పునరుద్ధరిస్తామని దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఫెర్రీ ఘాట్ సమీపంలోని పవిత్ర సంగమం ప్రాంతంలో నవహారతులను పునరుద్దరించాలన్న సీఎం ఆదేశాలతో మంత్రుల బృందం మంగళవారం పవిత్ర సంగంను పరిశీలించి, అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ నవహారతులను 30 నుండి 45 రోజుల లక్ష్యంగా నిర్ణయించుకుని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. గత ప్రభుత్వం పవిత్ర సంగమం ప్రాంత విశిష్టతను చెడగొట్టిందన్నారు. నిత్యం ఇక్కడ కృష్ణమ్మకు ఇచ్చే జలహారతులను కూడా నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

2019 ముందు వరకు హారతులు కొనసాగాయని, నిత్యం వేలాదిమంది హారతి కార్యక్రమానికి హజరయ్యేవారని గుర్తు చేశారు. పవిత్ర సంగమం ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేందంగా తీర్చిదిద్దడానికి ఈ ప్రాంతంలో 50 ఎకరాలు సేకరించి ఒక దేవాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. అలాగే పర్యాటకానికి పెద్ద పీట వేస్తూ అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నదికి ఆవల వైపు ఉన్న లంక భూములను కూడా సేకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు.

అలాగే ప్రకాశం బ్యారేజీ నుండి పవిత్ర సంగమం వరకు బోట్ షికార్, స్పీడ్ బోట్ వంటి ఏర్పాట్లు చేయలని సంకల్పించామన్నారు. వైదిక కమిటీ సభ్యులతో చర్చించి ఏ ఆలయం కట్టాలనే దానిపై ఒక నిర్ణయానికి వస్తామన్నారు. పవిత్ర సంగమం ఎప్పుడూ భక్తులతో, పర్యాటకులతో కిటకిటలాడేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. హరతుల నిర్వహణకు నెలకు రూ. 11 లక్షల వరకు ఖర్చు అవుతుందని దాతల సహకారం కూడా తీసుకుంటామన్నారు. మరోసారి కమిటీ సభ్యులు సమావేశమై పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.

పవిత్ర సంగమ ప్రాంతం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అన్ని శాఖల సహకారం తీసుకుంటున్నామని, ప్రధానంగా సీఆర్డఏ నుండి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్,అర్బన్ డెవలప్ మెంట్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఇతర శాఖలు వారి బడ్జెట్ ప్రకారం నిధులు కేటాయించి ఈ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ధటంతో పాటు భక్తులకు, పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

కృష్ణమ్మకు ఇచ్చే నవహారతులతో మన రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని ఆకాంక్షించారు. 2019కి ముందు నిత్యం నవ హారతుల కార్యక్రమం జరిపామని, గత ఐదేళ్ల పాలనలో ఈ కార్యక్రమం నిలిపివేసారని, సీఎం చంద్రబాబు ఆదేశాలతో పునరుద్ధరణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో శానిటేషన్, భక్తుల భద్రత వంటి అంశాలను ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు.



పవిత్ర సంగమం ప్రాంతంను రాష్ట్రంలోనే ఐకానిక్ ప్రాంతంగా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్ధసారథి అన్నారు. నిత్య హారతులతోపాటు, ఒక ఆలయ నిర్మాణం చేస్తే ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా భాసిల్లుతుందన్నారు. అలాగే పర్యాటకుల కోసం వారిలో ఆహ్లాదాన్ని నింపి విహార యాత్రగా మార్చే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దీంతో అటు పర్యాటకంగా, ఇటు ఆధ్యాత్మికంగా పవిత్ర సంగమం నిలుస్తుందని తెలిపారు.

లంక భూములను కూడా అందుబాటులోకి తీసుకువస్తే ఈ ప్రాంతానికి మరింత శోభ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. భక్తులకు, పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో సైతం భక్తులకు ఇబ్బంది కలగకుండ అవసరమైనంత ప్లాట్ ఫాం ఎత్తు పెంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారని మంత్రి కొలుసు పార్ధసారధి అన్నారు.

ముందుగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయ అధికారులు, ఇరిగేషన్, సీఆర్డీఏ, ఆర్ అండ్ బి, ట్రాన్స్ కో, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులకు దిశానిర్ధేశం చేశారు. ప్రాధమికంగా అంచనా వేసిన పనులకు రూ. 88లక్షలకు పైగా నిధులు అవసరమని దీంతో పవిత్ర సంగమం వద్ద భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయవచ్చని అధికారులు మంత్రుల బృందానికి నివేదించారు. మంత్రుల బృందం హైవే నుండి ఘాట్ వరకు ఉన్న రహ దారికి పూర్తి స్థాయిలో మరమత్తులు అవసరమని, అక్కడి నుండే లైటింగ్ కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. నిధుల సమస్య లేకుండా చూస్తామని పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని ఆదేశించారు.

నవ హారతుల సమయంలో భక్తుల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందేలా వాఖ్యాత, భక్తి గీతాలు ఏర్పాటు చేయడం, విద్యుద్దీపాలంకరణలు చేయడం, పోలీసుల పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఉండేలా చూడాలని మంత్రుల బృందం ఆదేశాలు ఇచ్చారు.

కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ నిధి మీనా, తిరువూరు ఆర్ డి ఓ మాధవి, దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ చంద్రశేఖర్ ఆజాద్, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంల ఈవో కెఎస్. రమారావు, ఇరిగేషన్ EE కృష్ణారావు, దేవస్థానం EEలు ఎల్. రమ, కోటేశ్వరరావు, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ బి. రమ్యకీర్తన, డిసిపి వెస్ట్ హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

- బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి
- ఎన్డీఏ పక్షాల భాగస్వామ్యంతో తిరంగా యాత్ర

**అమరావతి,**

నేటి స్వతంత్ర ఫలాలు ఆనాటి నేతల పోరాట ఫలితం ఈ చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియచేయాల్సిన ఆవశ్యకత ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. దేశమంతా విద్యార్ధులతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

బిజెవైఎం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్రను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ జాతి యావత్తు ఒక పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా దేశ మంతా జాతీయ జెండాను ప్రతి ఇంటి పైన ఆవిష్కరించు కోవాలన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి, తిరంగా యాత్ర గురించి వివరించడం జరిగిందన్నారు. కూటమి పార్టీలు కూడా భాగస్వామ్యంతోనే తిరంగా యాత్ర నిర్వహిస్తున్న విషయం మీడియాకు తెలిపారు. జాతీయ జెండా చేత బూని తిరంగా యాత్రలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు.

బిజెపి ఫ్లోర్ లీడర్ పెన్మెత్స విష్ణుకుమార్ రాజు,



తెలుగుదేశం ఎమ్మెల్యే బొండా ఉమా తదితరులు మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో తిరంగా యాత్ర ఇంఛార్జి ముని శుభ్రహ్మణ్యం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, బబ్బూరి శ్రీరాం, మాదాల రమేష్, భోగవల్లి శ్రీధర్, కొలనపల్లి గణేష్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నరసరాజు , వివిధ విద్యాసంస్థల విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై, మాతరం మాతర వందేమాతరం అంటూ నినాదాలతో విజయవాడ నగర వీధుల్లో హెూరెత్తించారు.

# నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు

- ఆసుపత్రి నుంచి విద్యార్థులు డిశ్చార్జి... తరగతులకు హాజరు
- భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరిగితే సహించేది లేదు
- రేణిగుంట బీసీ వసతి గృహం ఘటనపై బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశం

**అమరావతి,మహానాడు:**

రేణిగుంట బీసీ వసతి గృహంలో అస్వస్థతకు గురైన 21 మంది ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడిందని, రుయా ఆసుపత్రి వైద్యులు డిశ్చార్జి చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆరోగ్యం మెరుగుపడ డంతో, విద్యార్థులు పాఠశాలకు వెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహించిన బీసీ వసతి గృహ అధికారులపై చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు.

విషయం తెలిసినప్పటి నుంచి ప్రతి క్షణం తిరుపతి డీఎం అండ్ హెచ్ వోతో, రుయా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన వైద్యమందేలా కృషి చేశామన్నారు. అదే సమయంలో బీసీ వెల్ఫేర్ డీడీని ఆసుపత్రికి పంపి, విద్యార్థులకు వైద్య సదుపాయాలు అందించేలా చేశామన్నారు. ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడడంతో, ప్రస్తుతం విద్యార్థులు పాఠశాలకు కూడా వెళ్లినట్లు మంత్రి తెలిపారు. బయట ఆహారం తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. విద్యార్థులకు వాంతులు విరేచనాలు జరిగినా పైఅధికారులకు తెలియజేయకపోవడంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

తమ పిల్లలకు ఇలాగే జరిగితే వదలేస్తారా..? అని వసతి గృహ సిబ్బందిపై మండిపడ్డారు. ఇది క్షమించరాని నేరమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని, హాస్టళ్లలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హాస్టళ్ల సిబ్బందికి, అధికారులకు మంత్రి స్పష్టంచేశారు. మరోసారి ఇటువంటి ఘటన రాష్ట్రంలో ఎక్కడైనా చోటుచేసుకుంటే



తీవ్ర పరిణామాలు ఉంటాయని బీసీ హాస్టళ్ల సిబ్బందిని, అధికారులను మంత్రి సవిత హెచ్చరించారు.

### ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు

తిరుపతి రేణిగుంట బీసీ వసతి గృహం విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో మంత్రి సవిత ఆదేశాల మేరకు ఇద్దరు అధికారులకు బీసీ వెల్ఫర్ అధికారులు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఇన్చార్జి బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్‌కు, ఏబీసీడబ్ల్యూఓ డి.జ్యోత్స్నకు బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ మల్లికార్జున ఈ నోటీసులు జారీ చేశారు. నోటీసులందుకున్న మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో స్పష్టంచేశారు.

12

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | బుధవారం 14, ఆగస్టు 2024





కర్ణాటకలోని హెూస్పేట వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్‌ని పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, ఏపీ జలవనరుల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు, అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు,గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, సంబంధిత అధికారులు తదితరులు

## అక్రమ కేసులు... భూ కబ్జాలపై అధిక అర్జీలు

◆ విడదల రజినీ, కేకేరాజు అనుచరులపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

మంగళగిరి, మహానాడు:

గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు పల్నాడులో ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. పిడుగురాళ్లలో తనకు ఉన్న 2.14 ఎకరాల పొలాన్ని వైసీపీ నేతలు కబ్జా చేయడానికి కుట్ర పన్నితే... కోర్టులో కేసు వేయగా కోర్టు తనకే అనుకూలంగా తీర్పు ఇచ్చినా మళ్లీ ఆ భూమిలో 60 సెంట్లకు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి వైసీపీ నేత తరుక కిషోర్ భూమిని కబ్జా చేశాడని.. అధికారుల వద్దకు వెళ్లినా పట్టించుకోలేదని.. తనకు న్యాయం చేయాలని సాంబయ్య విజ్ఞప్తి చేశాడు. మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మంత్రి టీ.జీ భరత్, నేతలు ప్రభాకర్ చౌదరి, నరసింహ ప్రసాద్ లను కలిసి వినతి ఇచ్చి ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుండి తరలి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను చెప్పుకోగా గ్రీవెన్స్ లో ఉన్న నేతలు నియోజకవర్గాలు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో సమస్యలను పరిష్కరించాలని ఫోన్ చేసి చెప్పారు. పరిష్కరించతగిన అర్జీలకు వెంటనే పరిష్కార మార్గాన్ని చూపి అర్జీదారులను ఆ విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా నేడు గ్రీవెన్స్ కు వచ్చిన అర్జీలు...

పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తర్లపాడు గ్రామానికి చెందిన చింతల శేషగిరిరావు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేస్తూ.. గత వైసీపీ చేపట్టిన సమగ్ర రీ సర్వేలో ఏకపక్షంగా నిర్ణయించి తమ భూమి 30 సెంట్లను మాజీ మంత్రి విడతల రజిని అనుచరుడు మండల స్థాయి వైసీపీ నాయకుడు అనుంగుల పేరుమీదకు మార్చారని తమ భూమని తనకు ఇప్పించి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తమ స్థలంలో దౌర్జన్యాంగా అక్రమ నిర్మాణాలు చేపట్టారని.. అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు పరోక్షంగా సహకరించారని దయ చేసి తమ స్థలంలో సింగారపు గోపి తండ్రి అప్పలస్వామి కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన గుంట సరస్వతి విజ్ఞప్తి చేశారు.

విశాఖ పట్నం జిల్లా తాటి చెట్లపాలెం సంజీవయ్య కాలనీకి చెందిన కోరుకొండ విజయలక్ష్మీ విజ్ఞప్తి చేస్తూ.. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కెకె రాజు అనుచరులు సహకారంతో కొంతమంది తమపై కత్తులతో దాడి చేసి రక్త గాయాలైయ్యేలా కొట్టారని.. చంపేస్తామని బెదిరించి తమ ఇంటిని కబ్జా చేయడానికి చూస్తున్నారని ఆమె గ్రీవెన్స్ లో నేతల ముందు విలపించారు.

అద్దె అడిగినందుకు వైసీపీ సానుభూతిపరుడైన విశ్వనాథరెడ్డి అక్రమ కేసులు పెట్టి తమ స్కూల్ ను మూయించారని, స్కూల్ స్థాపించినప్పటి నుండి ఇప్పటి వరకు



ఒక్కసారి కూడా అలాంటి ఘటనలు జరగలేదని ఎన్. రవీంద్ర గౌడ్ తెలిపారు. గతంలో ఎన్టీఆర్, వెంకయ్య నాయుళ్లు కూడా తమ స్కూల్ ను సందర్శించారని, దయ చేసి విచారించి తమ స్కూల్ పున: ప్రారంభానికి సాయం చేయాలని రవీంద్ర గౌడ్ విజ్ఞప్తి చేశారు. విజయనగరం జిల్లా గరివిడి మండలం నీలాద్రిపురానికి చెందిన సారిపాక నర్సమాంబ విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమి 21 ఎకరాల 15 సెంట్లను రెవెన్యూ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై తమ భూమిని రికార్డుల్లో లేకుండా చేసి భూమిని కొట్టేయాలని చూస్తున్నారని గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేశారు. వృద్ధాప్యంలో ఉన్న తనకు న్యాయం చేయాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో తాము టీడీపీ కార్యకర్తలమన్న ఉద్దేశంతో రేషన్ షాపులను గత ప్రభుత్వం తొలగించిందని.. గత ప్రభుత్వం తొలగించిన దుకాణాలను తమకు కేటాయించాలని అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన పాత రేషన్ డీలర్లు అర్జీ అందించారు.

అనంతపురం జిల్లా అనంతపురం అర్బన్ లోని చెన్నకేశవ ఆలయానికి ఆనుకోని అంబారపు వీధిలో ఉంటున్న పలువురు పేదలు విజ్ఞప్తి చేస్తూ.. 100 ఏళ్ళ నుండి చెన్నకేశ స్వామి ఆలయానికి ఆనుకోని నివాసం ఉంటున్నా గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు తమను తీవ్రంగా ఇబ్బందులు పెట్టారని.. తమ సమస్యను పరిష్కరించి ఉంటున్న స్థలాలను రిజిస్టర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

తమ పొలానికి దారిలేకుండా చేసి తమను పొలంలోకి వెళ్లకుండా అంకిరెడ్డి పల్లెకు చెందిన కొత్తకోట రోశయ్య చేస్తున్నారని... దాంతో తమ పొలం బీడు పెట్టాల్సి వస్తోందని



ప్రకాశం జిల్లా కొమరోలు మండలం దద్దవాడ పంచాయతీకి చెందిన బిజ్జం తిరుపాల్ రెడ్డి గ్రీవెన్స్ లో వాపోయారు.

నంద్యాల వెంకట గంగ రాజు కడప జిల్లా పెండ్లిమర్రి మండలం చింతలపల్లి గుర్రాల జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్నానని గత ప్రభుత్వంలో విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న వై.రాఘవరెడ్డి అవినీతి అక్రమాలపై ప్రశ్నించి నందుకు తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని.. మళ్లీ తనపై దాడులు చేశారని.. అక్రమంగా సస్పెండ్ చేశారని వాపోయాడు. తనపై దాడి చేసిన వారిని శిక్షించి అక్రమ సస్పెండ్ తొలగించాలని వేడుకున్నారు.

నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన మంజుల ఆంజినేయులు.. రొంపి చర్ల టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారని అతనిపై గత వైసీపీ ప్రభుత్వంలో నాటి ఎమ్మెల్యే ప్రోద్భలంతో అక్రమ కేసులు పెట్టి సబ్ జైలుకు పంపించారని.. అదే విధంగా ఎలక్షన్ అయిన తరువాత కూడా అతను నియోజకవర్గంలో లేకున్నా రౌడీ షీట్ ఓపెన్ చేశారని.. వైసీపీ నేతలు పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు విజ్ఞప్తి చేస్తూ గ్రీవెన్స్ కు అర్జీ ఇచ్చారు.

గత ప్రభుత్వంలో జరిగిన నియామకాల్లో చాలా అవకతవకలు జరిగాయని.. అందులో భాగంగా పీఎచ్ సీ, సీఎచ్ సీ, లతో పాటు డీహెచ్ లలో నియమించిన ల్యాబ్ టెక్నీషియన్ ల ఉద్యోగాలను నకిలీ ధ్రువపత్రాలతో పొందారని 2020 నుండి 2023 మధ్య నకిలీ పత్రాలతో అర్హత పొందిన వారిని చర్యలు తీసుకోవాలని కిరణ్ కుమార్ గ్రీవెన్స్ లో కోరారు.

ఇబ్రహీంపట్నం రామకృష్ణ అనే వ్యక్తి క్వారీని 2019 లో



టీడీపీ అధికారం పోయిన వెంటనే వైసీపీ నేతలు ఆక్రమించుకున్నారని.. ఎస్వీఈసీ క్రషర్ కు చెందిన వైసీపీ నేతలు తమను క్వారీలోకి అడుగు పెట్టనివ్వలేదని.. గత 30 సంవత్సరాల నుండి క్వారీ తమ ఆధీనంలోనే ఉందని వాపోయాడు. దయ చేసి వైసీపీ నేతలు ఆక్రమించుకున్న క్వారీని ఇప్పించాలని వేడుకున్నారు.

వినుకొండలో ఉన్న తన భూమి ఒక ఎకరా తొమ్మిది సెంట్లను లోకల్ రౌడీ షీటర్లు కబ్జా చేశారని.. ఒంగోలుకు చెందిన షేక్ జిలానీ భాషా గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు.

వీటితో పలువురు నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు కల్పించాలని రాగా.. పింఛన్ కల్పించాలని మరికొందరు లబ్ధిదారులు వేడుకున్నారు. నామినేటెడ్ పదవుల కోసం నేతలు వినతులు ఇచ్చారు. సీఎం రిలీఫ్ ఫండ్, విదేశీ విద్యాకానుక, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఇలా అనేక వినతులు నేడు గ్రీవెన్స్ కు పోటెత్తాయి.

## ఇస్రో ప్రస్థానం స్ఫూర్తిదాయకం

(మొదటిపేజీ తరువాయి..)

దాగుంది. దేశం కోసం, జాతి కోసం తమ సొంత కుటుంబాలను, ఇష్టాలను వదులుకొని, అవమానాలు, అవహేళనలను పట్టించుకోకుండా ముందుకు సాగిన గొప్ప వ్యక్తుల సాహస ప్రయాణం దాగుంది. వారే ఈ దేశానికి నిజమైన హీరోలు. ఆ అన్ సంగ్ హీరోలే నాకు నిజ జీవిత హీరోలుగా అనిపిస్తారు. తెరపై కనిపించకుండా దేశం కోసం జీవితాన్ని ధారబోసిన శాస్త్రవేత్తలు నాకు నిజమైన స్ఫూర్తిప్రదాతల'ని ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన సంస్థ (షార్) నిర్వహించిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్ చిన్నారులు, కళాశాల యువత, షార్ శాస్త్రవేత్తలు, సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఒక ఫార్ములా కనుక్కోవడానికి కానీ, ఓ ప్రయోగం నిర్వహించేందుకు కానీ శాస్త్రవేత్తలు చేసే మేధో మధనం చాలా విలువైనది. ఆలోచనల్లో పడి వారు నిద్ర, ఆహారానికి కూడా ఒక్కోసారి దూరం అవుతారు. దేశానికి ఏదో ఒకటి చేయాలనే తపన, ఏకాగ్రత, శ్రమ అమూల్యమైనవి. వారికి ఈ దేశం ఏమిచ్చినా రుణం తీర్చుకోలేదు. అలాంటి హీరోలు ప్రజలకు తెలియాలి. వారు యువతలో నిరంతరం స్ఫూర్తి నింపాలి. చిన్నచిన్న విషయాలకే తల్లడిల్లిపోయే నేటితరం యువతరానికి శాస్త్రవేత్తలు స్ఫూర్తిప్రదాతలుగా మారి, దారి చూపాలి. శాస్త్రవేత్తల కష్టాన్ని జాతి గుర్తించాలి.

### బలంగా కోరుకుంటే మంచి తప్పకుండా జరుగుతుంది

నేను నెల్లూరులో చదువుకున్నాను. నాకు చిన్నప్పటి నుంచి శాస్త్ర సాంకేతిక రంగాలు, అంతరిక్ష ప్రయోగాలపై మక్కువ ఉండేది. స్కూల్ టీచర్‌ను పదేపదే దీనిపై ప్రశ్నలు అడిగేవాడిని. టీచర్ నాలో ఉన్న తపనను గుర్తించి... నన్ను స్కూలు సైన్స్ టీంలో వేసి ఆర్యభట్ట ఉపగ్రహ ప్రయోగం మీద ఓ నమూనా తయారు చేసి తీసుకురమ్మన్నారు. నానా రకాల పాట్లు పడి... అప్పుడున్న వనరులతో సాధారణ పేపర్ నమూనా తయారు చేయడానికే నాకు చుక్కలు కనిపించాయి.

మరి అంతరిక్షంలోకి ప్రయోగించే, అక్కడ పనిచేసే ఉపగ్రహాల తయారీకి, వాటి ప్రయోగానికి శాస్త్రవేత్తలు ఎంత కష్టపడతారో అన్న ఆలోచన నాకు శాస్త్రవేత్తలపై అమితమైన గౌరవాన్ని పెంచింది. వారు చేసే ప్రయోగాలకు జీవితం ధారబోస్తారు. అందరికీ అవసరమయ్యే సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వారు నిత్యం శ్రమిస్తారు.

నెల్లూరులో ఉన్నపుడు శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగిస్తారని తెలుసుకొని ఎప్పుడైనా ఇక్కడకు రావాలని అనుకునేవాడిని. అయితే చాలామంది పోలీసులు ఉంటారు. శాస్త్రవేత్తలు, అధికారులు ఉండే ఈ ప్రదేశానికి నేను అసలు వెళ్లలేను అనుకునే దగ్గరే నా ఆలోచన ఆగిపోయేది. అనుకోకుండా ఈ రోజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం యాదృచ్ఛికం అయినా, జీవితంలో మంచిని బలంగా కోరుకుంటే అవుతుందనడానికి ఇది నిదర్శనం.

### దేశానికి సేవ చేయడం మహద్భాగ్యం

భారతదేశంలో ఉన్న ఎంతో విలువైన శాస్త్రవేత్తలు, నిపుణులు నిజమైన దేశభక్తులు. వారి మేధస్సులోని అపార జ్ఞానం దేశానికి మాత్రమే చెందాలని భావించడం వారి దేశ భక్తికి నిదర్శనం. సగటు భారతీయుడి విలువలకు తగ్గట్టుగా కడదాకా నా దేశం, నా నేల అనుకునే మనస్తత్వం మనందరినీ కలుపుతుంది. విదేశాలకు వెళ్లే వీలున్నా, అక్కడ హెూదా, ధనం వచ్చే అవకాశమున్నా వారంతా దేశానికి కట్టుబడి చేసిన సేవలు, వారి ప్రతిభే దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయి.

1969 నుంచి ఇంతింతై వటుడింతై అన్నట్లు సాగిన భారతదేశ అంతరిక్ష పరిశోధన ప్రయాణం నేడు ప్రపంచంలోనే మేటిగా మారింది. భారత్ ను బలమైన శక్తిగా నిలపడంలో ఎందరో కనిపించని హీరోల కష్టం దాగుంది. వారి విజ్ఞానం ఉపయోగించుకొని నిరంతరం ముందుకు సాగుతున్న వారికి మాత్రమే విజిల్స్, చప్పట్లు దక్కాలని భావిస్తాను.

### దైవం మానుష రూపేణా

చిన్నప్పుడు నేను, మా అమ్మ ప్రతిరోజు సాయంత్రం అవగానే ఇంట్లో బల్బు స్విచ్ వేసి దణ్ణం పెట్టుకోవడం గమనించేవాడిని. నువ్వు ఎవరికి మొక్కుతున్నావు అని అడిగితే బల్బు కనిపెట్టిన థామస్ అల్వా ఎడిసన్ కు అని చెప్పేది. అంటే శాస్త్రవేత్తలను, వారి జ్ఞానాన్ని దేవుడిగా నమ్మే సంస్కృతి మనది. పది మందికి మంచి చేసేవారికి దణ్ణం పెట్టడమే భారతీయ ధర్మం. దైవం మానుష రూపేణా అని భావిస్తాం. అలాగే పదిమందికీ మంచి చేసే వారిని దేవుడిగా భావిస్తాం. విశ్వం తాలుకా శక్తి నన్ను ఇక్కడ వరకు నడిపించింది అని నమ్ముతాను. మంచి చేయాలని, దేశానికి ఏదో ఇవ్వాలని బలంగా అనుకుంటే కచ్చితంగా అది జరిగి తీరుతుంది. అలాగే దేశం కోసం పనిచేసే ప్రతి శాస్త్రవేత్తకు జాతి రుణ పడి ఉంది.

### ఎక్కడో ఒక చోట అడుగుపడితేనే...

ఎక్కడో కేరళలోని తుంబ అనే ప్రాంతంలో చిన్నస్థాయిలో మొదలైన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయాణం నాకు స్ఫూర్తిదాయకం. ఎక్కడో ఒక చోట అడుగుపడితేనే అది వేల మైళ్ల ప్రయాణానికి దారి చూపుతుంది. మన దగ్గర వనరుల్లేవు.. మనకు శక్తి లేదు.. మన వల్ల కాదు అనుకుంటే ఏదీ కాదు. భారతీయ పరిశోధన సంస్థ ఒకేసారి 104 ఉపగ్రహాలను పంపే స్థాయికి ఎదగడం ఓ గొప్ప రికార్డు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఎప్పుడు ఒకటి చెబుతుండేవారు.

నీ కల.. నీ ఆశయం పెద్దగా ఉండాలి అని అనేవారు. నిజంగానే ఆయన మాట ఓ స్ఫూర్తి మంత్రం. ఇస్రో పెద్దలు కూడా ఒకప్పుడు అలాగే కలలు కనేవారు. ఈ దేశానికి ఇస్రో అనేది తలమానికం కావాలి... ఇస్రో ప్రపంచంలో అగ్రగామి అంతరిక్ష పరిశోధన సంస్థ కావాలి అనుకునే వారు. అది ఇప్పుడు తీరుతోంది. ఇస్రో పని తీరు వల్ల ప్రపంచ దేశాలన్నీ మన వైపు చేసేలా చేసింది. ఈ దేశం అన్ని రంగాల్లో అగ్రగామి కావాలి... ప్రపంచానికే భారతదేశం దిక్సూచి కావాలని బలంగా ఆకాంక్షిస్తున్నాను.

### శ్రీహరికోట.. పర్యావరణహిత ప్రయోగాల వేదిక

శ్రీహరికోటకు హెలికాప్టర్‌లో వస్తున్న సమయంలో పైనుంచి ఈ ప్రయోగ ద్వీపాన్ని చూస్తుంటే ముచ్చటేసింది. పచ్చగా అడవిని తలపించేలా షార్ కనిపించింది. శ్రీహరికోట నిర్మాణం ఓ అద్భుతం. చుట్టూ సముద్రం, మరో పక్క సరస్సు మధ్యలో ఉన్న ద్వీపంలో అంతరిక్ష ప్రయోగశాల నిర్మాణం దేశానికే తలమానికంగా నిర్మించుకోవడం గొప్ప విశేషం.

దీంతోపాటు పర్యావరణానికి ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా, అందమైన చెట్లతో అడవిని తలపించే వాతావరణంలో షార్ నిర్వహణ ఓ ప్రకృతి ప్రేమికుడిగా నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. 40 వేల ఎకరాల్లో ఎక్కడా కూడా పర్యావరణాన్ని విధ్వంసం చేసే చర్యలు లేవంటే మామూలు విషయం కాదు. లోపలికి వచ్చాక కూడా పచ్చటి తోరణాల్లా షార్ లో చెట్లు స్వాగతం పలుకున్న తీరు చూసి గొప్పగా ఉంది. జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటైన 'పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం' అనేది ఇక్కడ నాకు కనిపించింది. బయోడైవర్సిటీ, అటవీశాఖ చేస్తున్న కృషి గొప్పగా ఉన్నాయి.

### అంతరిక్ష పరిశోధనల్లో భారత్ రాజీపడదు

ఓ హాలివుడ్ సినిమాకు పెట్టిన ఖర్చు కంటే తక్కువ ఖర్చుతో భారతదేశం మార్స్ మిషన్ మంగళ్ యాన్ పూర్తి చేసింది. ప్రపంచంలో ఇంత తక్కువ ఖర్చుతో ప్రపంచంలో అంతరిక్ష పరిశోధనలు చేసిన దేశాలు లేవంటే మామూలు విషయం కాదు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశం అతి తక్కువ ఖర్చుతో చేస్తున్న ప్రయోగాల వైపు దృష్టి సారించాయంటే మన ఇస్రో చేస్తున్న కృషి, పని తీరు అసమానం అని చెప్పాలి. ఇస్రోలో పని చేస్తున్న సఫాయి దగ్గర నుంచి ఛైర్మన్ వరకు అంతా ఈ గొప్ప ప్రయాణంలో భాగస్వాములే. 2014లో న్యూయార్క్ టైం పత్రికలో మన అంతరిక్ష పరిశోధన సంస్థ గురించి వ్యంగ్యంగా ఓ కార్టూన్ వచ్చింది. సరిగ్గా దశాబ్దం తర్వాత అదే న్యూయార్క్ టైం పత్రిక.. నడుస్తున్న దేశం అయిన అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా మన ఇస్రోతో కలిసి సంయుక్తంగా పనిచేయడానికి ఆసక్తి చూపిందంటే ఇస్రో ప్రయాణం ఎంత గొప్పగా, పట్టుదలతో సాగిందో అర్థం అవుతుంది.

అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ఎక్కడ రాజీ పడకుండా ప్రయాణం చేస్తుంది. ఇస్రో ప్రయోగాలకు తగిన విధంగా కేంద్రం ఎప్పటికప్పుడు బడ్జెట్ ను పెంచుతోంది. ప్రయోగాలకు అవసరం అయిన నిధులను అందజేస్తోంది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో ఇస్రోకు ఏటా రూ.5,615 కోట్లు మాత్రమే కేటాయిస్తే, అది ఎన్డీయే ప్రభుత్వం లో 2022-23 బడ్జెట్ లో రూ.13,700 కోట్లకు చేరింది.

అంటే అంతరిక్ష ప్రయోగాలకు ఇస్తున్న ప్రాధాన్యం గుర్తించవచ్చు. చంద్రయాన్-2 ప్రయోగం విఫలమైనపుడు నిరాశలో, బాధలో ఉన్న శాస్త్రవేత్తలకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా విచ్చేసి ధైర్యం చెప్పడం, గుండెలకు హత్తుకోవడం గొప్ప విషయం. ఆయన ఇచ్చిన ధైర్యంతోనే ఇస్రో శాస్త్రవేత్తలు ధైర్యంగా ముందడుగు వేసి చంద్రయాన్-3 విజయవంతం చేశారు. అపజయం వచ్చినపుడు శాస్త్రవేత్తలను నిందించకుండా, వారికి బాసటగా నిలిచిన శ్రీ మోదీ ఓదార్పు నన్ను కూడా కదలించింది.

### గగన్ యాన్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరిస్తుంది

ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే గగన్ యాన్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనలను పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తుంది. శాస్త్రవేత్తల కృషి, వారి జ్ఞానం వినియోగించుకొని అద్భుతాలు చేయాలని భావిస్తోంది. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇప్పుడు స్పేస్ ఎకానమీని సృష్టించే స్థాయికి ఎదిగింది. విదేశాలకు చెందిన ఉపగ్రహాలను మనం కక్ష్యలో ప్రవేశపెట్టడం ద్వారా స్పేస్ ఎకానమీని మనం సాధిస్తున్నాం. మొత్తం గ్లోబల్ స్పేస్ ఎకానమీలో 2 నుంచి 3 శాతం సాధించే స్థాయికి ఇస్రో చేరుకుంది. మన జాతీయ స్థూల జాతీయోత్పత్తిలోనే మంచి అంకెలను ఇస్రో ఇస్తోంది. ఇస్రో సక్సెస్ రేటు కూడా ప్రపంచదేశాల అంతరిక్ష పరిశోధన సంస్థలతో పోల్చుకుంటే చాలా బాగుంది. ఇతర దేశాలు ఇస్రో సేవల కోసం అభ్యర్థిస్తున్నాయి. ఇది ఒక్క రోజులో వచ్చిన విజయం కాదు. ఎన్నో మేధస్సుల కలయిక... ఎందరో మేధావుల పరిశ్రమ. ఇస్రో కేవలం ప్రయోగాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు విజ్ఞాన ప్రదర్శనలు, పోటీలు నిర్వహించడం గొప్ప విషయం. భావితరాల భవిష్యత్తు దృష్ట్యా పిల్లలను ప్రోత్సహించడం అభినందనీయం.

### ఆ రోడ్డు అయిదు రోజుల్లో పూర్తవుతుంది

బుచ్చినాయుడు కండ్రిగ నుంచి షార్‌కు వైపు వచ్చే 17 కిలోమీటర్ల రోడ్డు బాగాలేదని షార్ అధికారులు నా దృష్టికి తెచ్చారు. వెంటనే కలెక్టరుతో మాట్లాడి రోడ్డు పనులు మొదలు పెట్టాం. మరో 5 రోజుల్లో పనులు పూర్తి అవుతాయి. ఇలాంటి పనులను వెంటనే పూర్తి చేసే బాధ్యతను మేం తీసుకుంటాం.

### ఇస్రోతో ఎంఓయూ కుదుర్చుకుంటాం

ఆంధ్రప్రదేశ్ యువతలో అపరిమితమైన జిజ్ఞాస ఉంది. దీన్ని సరైన రీతిలో ముందుకు తీసుకెళ్లే దారి లేక యువత ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. ఇస్రోతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయంలో విజ్ఞాన విషయాలను పంచుకునేందుకు, విలువైన సూచనలు యువతకు అందించే నిమిత్తం ఓ ఎంఓయూ చేసుకోవాలని భావిస్తున్నాను. దీనిపై నేను క్యాబినెట్ లో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాను.

భావితరాలకు అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఏర్పడాలి. యువతకు అంతరిక్ష పరిశోధనలపై ఉన్న ఆకాంక్షకు తగిన ఉపాధి మార్గం లేదా పరిశోధనల మార్గం చూపేలా ఇస్రో అధికారులు తగిన గైడెన్స్ ఇచ్చేలా మాట్లాడుతాం. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులను అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంచేలా ముందుకు వెళ్లాలి. దీనికి ప్రత్యేకంగా ఓ ఎంఓయూ చేసుకొని సంయుక్తంగా ముందుకు వెళ్లేలా ప్రయత్నాలు చేస్తాం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ విద్యార్థి, యువతలో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించేలా చూడటమే ప్రధాన లక్ష్యం. శాస్త్రవేత్తలే ఈ దేశపు బలం. జాతి సంపద. వారు ఈ దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. భావి భారతం మరిన్ని ప్రయోగాలకు వేదిక కావాలని కోరుకుంటున్నాను" అన్నారు.

ఈ కార్యక్రమంలో సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం (షార్) డైరెక్టర్ ఎ.రాజరాజన్, షార్ అసోయేట్ డైరక్టర్ సయ్యద్ సమీద్, షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, జనరల్ మేనేజర్ శంభు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### చంద్రయాన్ - 3 రాకెట్ ప్రయోగ నమూనా బహూకరణ

జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని సత్కరించి... అనంతరం షార్ డైరెక్టర్ రాజరాజన్ చేతుల మీదుగా చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగ నమూనాను బహూకరించారు. అనంతరం పవన్ కళ్యాణ్ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144